www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 31-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 345 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం,శుక్ల పక్షం తిథి: విదియ ఉ.9:11 తదుపరి తదియ, నక్షత్రం: అశ్విని మ.1:45 తదుపరి భరణి వర్జ్యం: ఉ.10:19-11:38, రా.10:17-11:43, దుర్ముహూర్తం: మ.12:43-1:32, మ.3:09-మ.3:58, అమృతఘడియలు: ఉ.7:24-8:48, రాహుకాలం: 7:30-9:00 వరకు, సూర్యోదయం: ఉ.6:14, సూర్యాస్తమయం: సా.6:24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘మరణించినా’.. బతికించొచ్చు!

మరణం తాత్కాలిక స్థితే.. వెనక్కి తిప్పటం సాధ్యమే

ఎక్మో యంత్రం, కొన్ని ఔషధాలతో తిరిగి జీవం పోయవచ్చు

కణాల్లో జీవక్రియలు నిలిచిపోనంత వరకూ దీనికి అవకాశం ఉంది

న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ సామ్ పార్నియా



2

- అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, జర్మనీ.. ఎక్కడకు వెళ్లినా భారతీయులే ఎక్కువ. ఆయా దేశాల్లో ఎక్కువ డబ్బులు సంపాదించే తెలివితేటలు ఉండే ఏకైక జాతి మనదే. వారిలో కనీసం 30% మంది తెలుగువారు ఉండాలనేది నా ఆకాంక్ష.. స్వార్థం కూడా. అందుకోసమే పనిచేస్తున్నాను.
- గతంలో ప్రపంచం మొత్తం యూదుల గురించి మాట్లాడేవారు. రేపు ఆంధ్రప్రదేశ్, తెలుగు జాతి గురించి మాట్లాడుకోవాలి. ఏ సమస్య అయినా పరిష్కరించే శక్తి సామర్థ్యాలు వారికి ఉన్నాయని నిరూపించుకోవాలి. - సీఎం చంద్రబాబు



పీ4 లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

పేదవాడిని పైకి తెద్దాం!

సంపద కొందరికే పరిమితం కారాదు: చంద్రబాబు

సమాజం వల్లే బాగా సంపాదించారు

దానికి ఎంతో కొంత తిరిగివ్వాలి

మీతో పుట్టినవారు పేదవాళ్లుగానే ఉన్నారు

తిండి దొరకడం లేదు.. సొంత ఇళ్లూ లేవు

వారిని పైకి తెచ్చే బాధ్యత తీసుకోవాలి

భవిష్యత్‌లో పేదవాళ్లు ఉండకూడదు

ఇదే నా జీవిత ఆశయం

తెలుగు జాతిని తెలివైన జాతిగా మార్చే బాధ్యత మార్గదర్శులదే: సీఎం

పేదరికం తగ్గడానికి పీ4 మార్గం: పథకం ప్రారంభంలో సీఎం

జీవితాంతం సమాజం కోసమే!

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కళ తప్పింది.. ఇలా కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి లేదు.. ఉగాది వేడుకల్లో చంద్రబాబు

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): "మనతోపాటు పుట్టిన వాడికి తిండిలేదు, మనం పెద్ద పెద్ద ప్యాలెస్‌ల్లో ఉంటే.. వాడికేమో ఇల్లు లేదు. మీలో చాలా మంది సమాజం వల్ల పైకి వచ్చారు. కాబట్టి తిరిగి దానికి ఎంతో కొంత ఇవ్వాలి. పేదవాళ్లగానే ఉన్న మీతోటి వారిని పైకి తీసుకొచ్చే బాధ్యతను సంపన్నులు తీసుకోవాలి. దీనిని ప్రభుత్వం పర్యవేక్షించాలనే 'మార్గదర్శి-బంగారు కుటుంబం.. పీ4-జీరో పావర్టీ' అనే కార్యక్రమానికి

మిగతా 12వ పేజీలో...

పేదరిక నిర్మూలనకే పీ4

సినిమాల్లో రెండున్నర గంటల్లోనే సమస్యలన్నీ తీరిపోతాయ్

కానీ నిజ జీవితంలో చంద్రబాబు లాంటి విజనరీ నేత కావాలి

అందుకే ఆయనకు మద్దతిస్తున్నాం 12

పీ4 ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

భూదందాల్లో ఆరుగురు జగన్ మంత్రులు!

42 మంది ప్రజాప్రతినిధులు, 120 మంది నేతలు కూడా

22 మంది డిప్యూటీ కలెక్టర్లకూ ప్రధాన పాత్ర

48 మంది తహశీల్దార్లు, 23 మంది సర్వేయర్లు సైతం

ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ నివేదిక

మొత్తం 13.59 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్

చట్టవ్యతిరేకంగా నిషేధ జాబితా నుంచి 5.74 లక్షల ఎకరాలకు విముక్తి

8,483 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్

అంతర్గత విచారణలో నిగ్గుతేలిన నిజాలు

రాజకీయ పెద్దలు, అవినీతి అధికారులపై క్రిమినల్ చర్యలకు సిఫారసు

వేటేస్తారా.. వదిలేస్తారా?.. సీఎం కోర్టులో 'రెవెన్యూ' బంతి



జగన్ జమానాలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి.. జరిగిన భూదందాల్లో ఏ మంత్రి పాత్ర ఎంత.. వైసీపీ నేతలెవరు కీలక పాత్ర పోషించారు.. మదనపల్లె ఆఫీసు-ఫైళ్ల దహనం సూత్రధారులెవరు.. పాత్రధారులెవరు.. ఆ ప్రాంతంలో అసైన్డ్, ఇతర భూములను చేజిక్కించుకుని లబ్ధి పొందిన రాజకీయ నేతలెవరు.. వారి కొమ్ముగాసి అవినీతి, అడ్డగోలు అక్రమాలకు పాల్పడిన అధికారులెవరు.. ఇందులో రెవెన్యూ యంత్రాంగం పాత్రేంటో రెవెన్యూ శాఖ నిగ్గుతేల్చింది. అయితే తనంత తాను వారిపై కఠిన చర్యలు తీసుకునే ఆస్కారం లేదు. ప్రభుత్వ స్థాయిలోనే నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో ఆ శాఖ కీలక అంశాలపై నాలుగు సమగ్ర నివేదికలను ముఖ్యమంత్రి ఆమోదానికి పంపించింది. ఇప్పుడాయన ఏం నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లోనే గాక అధికార వర్గాల్లోనూ నెలకొంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో భూదందాలకు పాల్పడిన మంత్రులు, వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులెవరో రెవెన్యూ శాఖ నిర్ధారించింది. నాటి మంత్రుల్లో ఆరుగురు ఈ అక్రమాలకు పాల్పడ్డారని తేల్చింది. 42 మంది ప్రజాప్రతినిధులు, 120 మంది వైసీపీ నేతలు, 22 మంది డిప్యూటీ కలెక్టర్లు, 48 మంది తహశీల్దార్లు ప్రధాన పాత్ర పోషించారని స్పష్టంచేసింది. వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిఫారసు చేసింది. వాస్తవానికి రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుతీరిన నెలన్నర రోజులకే 2024 జూలై 22న దుండగులు ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసుకు కుట్రపూరితంగా నిప్పుపెట్టారు. కీలకమైన భూ రికార్డులను తగలబెట్టారు. ఈ ఉదంతంపై

మిగతా 11వ పేజీలో...

కాకాణికి నోటీసులు

నేడు విచారణకు రావాలని పోలీసుల ఆదేశం

రెండ్రోజులుగా అందుబాటులో లేని మాజీ మంత్రి 11

ఇంటి గోడ, గేటుకు నోటీసులు అంటించిన పోలీసులు

‘స్త్రీ’ మూలంగా జగన్‌కు ఇబ్బందులు

ఆరోగ్య సమస్యలు తగ్గి.. అధికారంలోకొస్తారు

సిద్ధాంతి నారాయణమూర్తి 'పంచాంగం' 12

బెంగళూరులోనే జగన్

పంచాంగ శ్రవణానికి డుమ్మా

ఎవరి ‘పంచాంగం’ వారిదే!

తీరు మార్చుకోని సిద్ధాంతులు

ఎన్నికలకు నాలుగేళ్లున్నా జగన్‌దే అధికారమన్న ఓ సిద్ధాంతి 12

పార్టీలో అందరికీ బాబు పదవులు ఇచ్చేస్తారన్న టీడీపీ పంచాంగకర్త

అమరావతి పూర్తవుతుందని వెల్లడి

మయన్మార్ భూకంపం.. 334 అణుబాంబులతో సమానం!

ఆ స్థాయిలో భారీ విధ్వంసం 2

జియాలజిస్టు జెస్ ఫీనిక్స్ వెల్లడి

భారత్-యురేషియన్ ఫలకాల ఢీ

రాబోయే రోజుల్లోనూ ప్రకంపనలు!

మయన్మార్‌లో మృతులు 3 వేలపైనే

ఆదివారం మరోమారు భూకంపం

రహదార్లపైనే నివసిస్తున్న ప్రజలు

గోడకేసి కొట్టి.. చిన్నారి హత్య

కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి మరో బిడ్డకు నరకం..

సవతి తల్లి కర్కశం 3

గుంటూరు జిల్లాలో దారుణం



నాగపూర్‌లో గోల్వాల్కర్ చిత్రపటానికి మోదీ నివాళి

సంఘ్.. ఓ వటవృక్షం

సేవకు ప్రతిరూపం: ప్రధాని నరేంద్ర మోదీ

నాగపూర్‌లో ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్ సందర్శన

హెడ్గేవార్, గోల్వాల్కర్లకు నివాళి 2

కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి!

ఛత్తీస్‌గఢ్‌లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ

ఇంటర్ తరగతులు రేపటి నుంచే

ఏప్రిల్ 7 నుంచి ఫస్టియర్ అడ్మిషన్లు 2

'ప్రైవేటు'కు పోటీగా ప్రభుత్వ కాలేజీల డ్రైవ్

విజయవాడలో ఆ 4 గంటలు!

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో వీడుతున్న చిక్కుముళ్లు



రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాదం తర్వాత అక్కడే కూర్చున్న ప్రవీణ్

విజయవాడకు రాకముందే ఒకసారి రోడ్డు ప్రమాదం 3

పగిలిన బుల్లెట్ హెడ్‌లైట్.. పాస్టర్ చేతికి గాయాలు

గొల్లపూడి పెట్రోలు బంకు వద్దకు చేరే సమయానికి సిబ్బందితో మాట్లాడలేని స్థితిలో చేతితో సైగలు

రామవరప్పాడు రింగ్ సమీపంలో రెండో ప్రమాదం

పక్కన కూర్చోబెట్టిన ట్రాఫిక్ ఎస్ఐ, ఆటో డ్రైవర్లు

ట్రాఫిక్ బూత్ వద్ద 3 గంటలు నిద్రపోయిన పాస్టర్

మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని పాస్టర్‌కు ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు కౌన్సెలింగ్

వెళ్లొద్దని వారించినా పట్టించుకోకుండా ప్రయాణం

తిరిగి ఏలూరులో మరో మద్యం సీసా కొనుగోలు

సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద ఊరట

ఉగాది కానుకగా రూ.2,000 కోట్ల బిల్లుల చెల్లింపునకు సర్కారు నిర్ణయం

17 వేల మందికి మేలు: మంత్రి కేశవ్

జగన్ హయాంలో పెండింగ్ పెట్టారని వెల్లడి



అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులు చేపట్టి పూర్తి చేసిన చిన్న తరహా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. వైసీపీ హయాంలో కాళ్లరిగేలా తిరిగినప్పటికీ బిల్లుల చెల్లింపు జరగని చిన్న కాంట్రాక్టర్లను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు సీఎం ఆదేశాలతో

మిగతా 2వ పేజీలో...

ఆసక్తి.. ఆ ‘శక్తి’.. తగ్గుతున్నాయ్!

"మా దగ్గరకు వచ్చే జంటల్లో 20 శాతం మందికి ఆరోగ్యపరంగా ఏ సమస్యా ఉండదు.. కానీ, పిల్లలు పుట్టడం లేదని చెబుతారు. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత.. వారికి మేం ఇచ్చే సలహా ఏంటంటే.. నెలసరి అయిన తర్వాత కనీసం 10 నుంచి 17 రోజుల లోపు రోజూ సెక్స్‌లో పాల్గొనమని! సెక్స్‌లో పాల్గొనడానికి కూడా షెడ్యూల్ వేసుకుంటున్న జంటలకు అంతకుమించి ఏం చెప్పగలం?" - డాక్టర్ శాంతి

సంసార సుఖాన్ని ఆస్వాదించలేకపోతున్న యువజంటలు

భారీగా పెరుగుతున్న హెచ్ఎస్‌డీడీ కేసులు

జీవనశైలి, అనారోగ్య, మానసిక సమస్యలే కారణం

కొత్తగా పెళ్లయిన వారిలోనూ చాలామంది నెలకు ఒకట్రెండు సార్లే శృంగారంలో పాల్గొంటున్నారు!!

కోరికలు తగ్గుతున్నాయంటే గుండె జబ్బులకు సంకేతం

ఏడాది ముందు నుంచి అంగస్తంభన సమస్యలు


హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు బాగుండాలి.. ఎలాంటి కష్టాలు లేకుండా ఆనందంగా గడపాలి.. నేటి తరం ఆలోచన ఇది!! అందుకోసం రేయింబవళ్లు కష్టపడుతున్నారు. భార్యాభర్తలిద్దరూ కొలువులు చేస్తున్నారు. తమకు దేనికీ కొదవ లేదన్న భ్రమల్లో బతికేస్తున్నారు. లక్షల్లో జీతాలు.. కార్లు.. బంగళాలు..

మిగతా 11వ పేజీలో...



మారుతున్న భూకంప జోన్లు

- మరో రెండు నెలల్లో ఖరారు
- ప్రస్తుతం 5 జోన్లు.. 6కు పెంపు
- భద్రాచలం మినహా సేఫ్‌జోన్‌లో తెలంగాణ



దేశంలోని భూకంప జోన్లు మారనున్నాయి. ప్రస్తుతం ఐదు జోన్లుండగా.. వాటి సంఖ్య ఆరుకు పెరగనుంది. 1962లో తొలిసారి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఐదు జోన్లను ఏర్పాటు చేయగా.. భారత ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) 1970, 1984లో కొన్ని మార్పులు చేసి, జోన్ల పరిధిలోని ప్రాంతాలను మార్చింది. 2002లో 'ఐఎస్ 1893:2002' పేరుతో వాటిని అభివృద్ధి చేసింది. అప్పటి నుంచి భూమి లోపల ఫలకాల కదలికలో వేగం(యాక్సలరేషన్) పెరుగుతూ.. ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో.. భూభౌతిక శాస్త్రవేత్తలు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు, భూకంపాల పరిశోధకులు, బీఐఎస్ అధికారులతో కొత్త జోన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ పలు భేటీల తర్వాత.. ప్రస్తుతం ఉన్న ఐదు జోన్లను ఆరుగా మార్చాలని నిర్ణయించింది. మరో రెండు నెలల్లో కొత్త జోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది.

అంకెలా? ఆంగ్ల వర్ణమాలా?

ప్రస్తుతం ఉన్న జోన్లు రోమన్ నంబర్లలో ఉన్నాయి. జోన్-5లో అత్యంత ప్రమాదకరమైన భూకంపాలు సంభవించే ప్రాంతాలుండగా.. జోన్-2లో అత్యల్ప ప్రభావం ఉంటుంది. కొత్త జోన్లకు ఇదేవిధంగా రోమన్ నంబర్లను వాడాలా? పాత-కొత్త మధ్య అయోమయాన్ని తొలగించేందుకు ఆంగ్ల వర్ణమాలలోని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లను వాడాలా? అనే దానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఈ కమిటీలోని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ అంశం మినహా.. ఏ జోన్ పరిధిలోకి ఏయే ప్రాంతాలు వస్తాయి? అనే దానిపై బీఐఎస్ రూపొందించిన 'ఐఎస్ 1893:2025'ని కమిటీ ఖరారు చేసిందని వివరించారు. ప్రమాదకర ఆరో జోన్‌లో ఎగువ హిమాలయాలు, శివాలిక్ శ్రేణులు ఉన్నాయని తాజా మ్యాప్ చెబుతోంది. వీటితోపాటు.. గుజరాత్ రాష్ట్రంలోని కచ్ ప్రాంతం, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, కొంకణ్ ఈ జోన్‌లో ఉన్నాయి. హిమాలయాల్లోని జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, నేపాల్‌తో సరిహద్దులను పంచుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ దీవులు ఇదే జోన్‌లో ఉన్నాయి. భూగర్భంలో ఫలకాల కదలికకు సంబంధించిన యాక్సలరేషన్ ఈ ప్రాంతాల్లో 5జీ(గ్రావిటీ)గా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో భూగర్భంలో ఫాల్ట్స్ కారణంగా భూకంప తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అంతర్-ఫలకల ప్రాంతం కావడంతో నష్టం తీవ్రంగా ఉంటుందని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఐదో జోన్ కొంత భాగమే

పాత జోన్-5లో భూగర్భ ఫలకాల యాక్సలరేషన్ 0.36జీగా ఉండేది. కొత్త జోన్-5లో ఈ వేగం 0.333జీగా ఉన్నట్లు సమాచారం. దిగువ హిమాలయ ప్రాంతాల్లోని గంగామైదానాలు కొంత వరకు ఐదోజోన్‌లోకి వస్తాయి. ఇక్కడ కూడా రివర్స్ స్ట్రైక్‌స్లిప్ ఫాల్ట్స్ ఉన్నా.. వాటి యాక్సలరేషన్ తక్కువగా ఉంటుంది. రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు ఈ జోన్‌లో ఉంటాయి. 0.233 గ్రావిటీ ఉండే ప్రాంతాలను జోన్-4లో చేర్చారు. ఇక్కడ భూకంపాలు వచ్చినా.. తీవ్రత తక్కువగా ఉంటుంది. ఈ జాబితాలో న్యూఢిల్లీ, ఎన్‌సీఆర్-ఢిల్లీ, పట్నా, కోల్‌కతా నగరాలున్నాయి.

జోన్-3లో కీలక నగరాలు

జోన్-3(0.125జీ)లో లఖ్‌నవూ, పట్నా లోని కొన్ని ప్రాంతాలు, రాంచీ, భువనేశ్వర్, డామన్, ముంబై, ఏపీలోని అమరావతి, చెన్నై, పుదుచ్చేరి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భూకంపాల తీవ్రత తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర ప్రాంతాలు, తెలంగాణలోని భద్రాచలం, తమిళనాడులోని థేని, కేరళలోని శబరిమల, పెరియార్ అడవులు కూడా ఈ జోన్‌లోనే ఉన్నాయి.

జోన్-2లో తెలంగాణ

తెలంగాణ రాష్ట్రంలో ఒక్క భద్రాచలం మినహా.. మిగతా ప్రాంతాలన్నీ గత జోన్లలో మాదిరిగానే జోన్-2లో ఉన్నాయి. ఇక్కడ భూగర్భంలో ఫలకం కదలిక 0.075 గ్రావిటీతో ఉంటుంది. ఈ కారణంగా పెద్దగా ఆస్తి, ప్రాణనష్టం ఉండవని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర, కర్ణాటకలోని 99% ప్రాంతాలు, కేరళలోని గురువాయూర్ ఈ జోన్‌లోనే ఉన్నాయి.

- సెంట్రల్‌డెస్క్

ఇంటర్ తరగతులు రేపటి నుంచే

- ఏప్రిల్ 7 నుంచి ఫస్టియర్ అడ్మిషన్లు
- ఇకపై సైన్స్ గ్రూపుల్లో ఐదు సబ్జెక్టులే
- ఇంటర్ విద్యలో సమూల మార్పులు

అమరావతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యను ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. 2025-26 విద్యా సంవత్సరాన్ని ఏప్రిల్ 1 నుంచే ప్రారంభిస్తోంది. ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు ఏప్రిల్ 7 నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తారు. ఈ నెల 23 వరకు తరగతులు నిర్వహించి, తర్వాత వేసవి సెలవులు ఇస్తారు. జూన్ 1న విద్యా సంవత్సరం పునఃప్రారంభమవుతుంది. ఈసారి ప్రైవేటు కాలేజీల తరహాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కూడా అడ్మిషన్లకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నాయి. జూనియర్ కాలేజీల పనివేళలను కూడా ఇంటర్ బోర్డు మార్చింది. ప్రస్తుతం రోజుకు ఏడు పీరియడ్లు ఉండగా, ఇకపై ఎనిమిది పీరియడ్లు ఉండేలా టైమ్ టేబుల్ విడుదల చేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీలు పనిచేస్తాయి. సబ్జెక్టులు, కోర్సుల్లో ఇంటర్ బోర్డు కీలక మార్పులు ప్రవేశపెట్టింది. ఎంపీసీ విద్యార్థులకు గణితం ఏ, బీలుగా ఉండగా.. దాన్ని ఒక్కటిగా చేసింది. బైపీసీలో బోటనీ, జువాలజీని బయాలజీగా మార్చింది. సైన్స్ విద్యార్థులకు ఆరు సబ్జెక్టుల స్థానంలో ఐదు సబ్జెక్టులు ప్రవేశపెట్టింది. వారికి ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా, మూడు సంబంధిత గ్రూపు కోర్ సబ్జెక్టులుగా ఉండగా, మరొకటి ఎలక్టివ్ సబ్జెక్టుగా తీసుకోవచ్చు. అదనపు సబ్జెక్టు కాకుండా మిగిలిన ఐదు సబ్జెక్టులు కచ్చితంగా పాస్ కావాలి. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితాన్ని అదనపు సబ్జెక్టుగా తీసుకుంటే ఎంబైపీసీ అవుతుంది. అదనపు సబ్జెక్టు మార్కులను సర్టిఫికెట్ లాంగ్ మెమోలో చూపించరు. దానికి అదనపు మెమో ఇస్తారు. దాని ఆధారంగా ఇంజనీరింగ్ లేదా వైద్యవిద్య వైపు వెళ్లొచ్చు. సీబీఎస్ఈ తరహాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశ పెడుతున్నారు. మొత్తం మార్కుల్లో 10 శాతానికి ఒక మార్కు రూపంలో ఉంటాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫిబ్రవరిలోనే పబ్లిక్ పరీక్షలు ముగిస్తారు. కాలేజీల పనిదినాలను 222 నుంచి 235కు పెంచింది. 2025-26 నుంచి ఫస్టియర్ విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తారు.



అణు బాంబులతో సమానం

మయన్మార్ భూకంపం అంత శక్తిమంతమైంది.. జియాలజిస్టు జెస్ ఫీనిక్స్ వెల్లడి

- భారత్-యురేషియన్ ఫలకాల ఢీ.. రాబోయే రోజుల్లోనూ ప్రకంపనలు!
- 3 వేలకు పెరిగిన మరణాలు
- ఆదివారం మరోమారు భూకంపం

నేపిడా, మార్చి 30: మయన్మార్‌లో శుక్రవారం సంభవించిన భారీ భూకంపం, తదనంతర ప్రకంపనలు అత్యంత తీవ్రత ఉన్నాయని అమెరికాకు చెందిన జియాలజిస్టు జెస్ ఫీనిక్స్ వెల్లడించారు. ఈ తీవ్రత 334 అణుబాంబుల విధ్వంసంతో సమానమని పేర్కొన్నారు. భూగర్భంలో భారత-యురేషియన్ టెక్టానిక్ ఫలకాలు ఢీకొనడం వల్ల.. మయన్మార్‌లోని స్ట్రైక్‌స్లిప్ కేటగిరీకి చెందిన 'సగైంగ్ ఫాల్ట్' వద్ద రాబోయే కొన్ని నెలల పాటు తదనంతర ప్రకంపనలు(ఆఫ్టర్ షాక్స్) వచ్చే ప్రమాదముందని ఆమె హెచ్చరించారు. ఆదివారం రాత్రి కడపటి వార్తలందేసరికి మయన్మార్ భూకంప మృతుల సంఖ్య 2,972కు చేరుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. క్షతగాత్రుల సంఖ్య 3,122గా ఉన్నట్లు తెలిపాయి. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ.. మరణాల సంఖ్య పెరుగుతోందని చెప్పాయి. కాగా.. అంతర్యుద్ధం కారణంగా ఆంక్షలు కొనసాగుతుండడంతో.. సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలేర్పడుతున్నాయి. భవనాల శిథిలాలను తొలగించి, ఒక్కో మృతదేహాన్ని వెలికితీయడానికి 2 నుంచి 8 గంటల సమయం పడుతున్నట్లు రెస్క్యూ బృందాలు చెబుతున్నాయి.

అనుక్షణం భయంభయం

శుక్రవారం నాటి భారీ భూకంపం తర్వాత కూడా మయన్మార్ పౌరులు అనుక్షణం భయంభయంగా గడుపుతున్నారు. ఇక్కడ తదనంతర ప్రకంపనలు కూడా తీవ్రంగానే ఉంటున్నాయి. శుక్రవారం తొలి భూకంప తీవ్రత 7.7గా నమోదవ్వగా.. ఆ తర్వాత వరుసగా 3.3-4.7 మధ్య, శనివారం 3.8-4.7 మధ్య తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఆదివారం ఉదయం మండలే నగరానికి 28 కిలోమీటర్ల దూరంలో 5.1 తీవ్రతతో భూమి కంపించింది. మరిన్ని భూకంపాలు రావొచ్చనే వార్తల నేపథ్యంలో మయన్మార్ పౌరులు రోడ్లపైనే ఉంటున్నారు.

సికాయ్ 80% ధ్వంసం

మాండలే కేంద్రంగా భూకంపం సంభవించినా.. పర్వతప్రాంతం సికాయ్ దారుణంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. 80% పట్టణం ధ్వంసమైపోయిందని, మిగతా 20% కూడా పాక్షికంగా భూకంప ప్రభావిత ఇళ్లతో మిగిలిపోయిందని పేర్కొన్నారు. సెనేట్ ప్రతినిధి కమిటీ కార్యదర్శి మావో ఝూవేటియాన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటన చేశారు. రెబల్స్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో తమకు మానవతాసాయం అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా చోట్ల పౌరులే వట్టి చేతులతో శిథిలాలను తొలగించి, తమవారి కోసం వెతుకుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వెలికి తీసిన 183 మృతదేహాలను ఆదివారం సామూహికంగా ఖననం చేసినట్లు సికాయ్‌లోని ఓబో హెల్త్ అండ్ రెస్క్యూ టీమ్ బృందం సభ్యుడొకరు తెలిపారు.



సహాయక చర్యల్లో ఆటంకాలు..

మయన్మార్‌లో భూకంప సహాయక చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. ఇందుకు అనేక కారణాలున్నాయి. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక బృందాలు భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతోంది. రెబల్స్ ఉంటున్న ప్రాంతాలకు దారి తీసే రహదారుల్లో మిలటరీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సహాయక బృందాలను అడ్డుకుంటున్నారని, అక్కడి సైనికులకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాకే, సహాయక సిబ్బందిని అనుమతిస్తున్నారని ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

సాయానికి స్టార్‌లింక్

మయన్మార్‌లో కమ్యూనికేషన్ పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో స్టార్‌లింక్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పేస్‌ఎక్స్ చీఫ్ ఎలాన్‌మస్క్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మయన్మార్‌లోని సైనిక సర్కారు అనుమతిస్తే.. వెంటనే చర్యలను ప్రారంభిస్తామని తెలిపారు. భూప్రకోపానికి గురైన మయన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ'ను ప్రారంభించింది. ఇదిలా ఉండగా, భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల భవనంలో చిక్కుకున్న వారిపై ఆశలు ఆవిరవుతున్నాయని బ్యాంకాక్ పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు బయటకు తీసిన వారిలో ఎవరూ ప్రాణాలతో లేరని గుర్తుచేశారు. శిథిలాలను పూర్తిగా తొలగించడానికి కనీసం రెండు నెలల సమయం పడుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 18 మంది చనిపోయినట్లు పేర్కొన్న పోలీసులు.. ఇంకా 82 మంది గల్లంతైనట్లు వివరించారు.

శ్మశాన వాటికల్లో రద్దీ!

మాండలేలోని దక్షిణ, లాంగికాన్ శ్మశాన వాటికల్లో ఆదివారం విపరీతమైన రద్దీ నెలకొంది. ఖననాలకు స్థలం సరిపోని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. "ఆదివారం ఉదయం శ్మశానవాటిక బయట పార్క్ చేసిన కార్లతో రహదారులు నిండిపోయాయి. మయన్మార్ చట్టాల ప్రకారం మరణ ధ్రువీకరణ పత్రం లేనిదే మృతదేహాలను ఖననం చేయకూడదు. వందల మృతదేహాల విషయంలో అలాంటి పత్రాలు లేవు. దీంతో.. సమీప సరస్సు వద్దే బంధుమిత్రులు తమవారి మృతదేహాలతో పడిగాపులు కాస్తున్నారు" అని లాంగికాన్ శ్మశానవాటికలో పనిచేసే ఓ వ్యక్తి చెప్పారు. ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన మృతదేహాలు కూడా శ్మశాన వాటికలో కుప్పలుగా ఉన్నాయని వివరించారు.

లోకం తీరు



అణు ఒప్పందానికి ఒప్పుకోకపోతే బాంబులేస్తా

- ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం



వాషింగ్టన్, మార్చి 30: కొత్త అణు ఒప్పందానికి ఒప్పుకోకపోతే ఇరాన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో బాంబులేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. కొత్త అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రత్యక్ష చర్చలకు రావాలంటూ ట్రంప్ లేఖ ద్వారా ఇచ్చిన ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. ప్రత్యక్ష చర్చలకు ఒప్పుకోబోమని, ఒమన్ వేదికగా పరోక్ష చర్చలకు సిద్ధమని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఎన్‌బీసీ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌ను హెచ్చరించారు. రెండు నెలల్లోగా ఇరాన్ కొత్త అణు ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. లేకపోతే తర్వాత జరగబోయే పరిణామాలను ఎవ్వరూ ఊహించలేరని చెప్పారు. వాస్తవానికి 2015లో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అణు ఒప్పందం నుంచి ట్రంప్ ప్రభుత్వం 2018లో తప్పుకుంది. తాజాగా అణ్వాయుధాల తయారీపై ఇరాన్ చురుగ్గా ఉందనే కథనాల మధ్య ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు.

పుతిన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్

ఉక్రెయిన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని వెంటనే అమలు చేయకుంటే రష్యాపై మరిన్ని సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. రష్యా చమురుపై సుంకాలు పెంచుతామని, ఆ దేశం వద్ద చమురు కొనే దేశాలు అమెరికాతో వ్యాపారం చేయకుండా కట్టడి చేస్తామన్నారు. ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ ఊసులేని తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు పుతిన్ పిలుపునీయడం ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది.

'మరణించినా'.. బతికించొచ్చు!

- న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ సామ్



వాషింగ్టన్, మార్చి 30: మరణంతో అంతా అయిపోయినట్టేనా? జీవితానికి ముగింపేనా?.. కానే కాదని, మరణాన్ని వెనక్కి తిప్పవచ్చని చెబుతున్నారు న్యూయార్క్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ సామ్ పార్నియా. గుండె, ఊపిరితిత్తులు పాడైపోయిన వారికి చికిత్సను అందించే ఎక్మో యంత్రంతో కొన్ని ఔషధాల సమ్మేళనాన్ని ఉపయోగించి 'పోయిన ప్రాణాన్ని' తిరిగి నిలబెట్టవచ్చని ఆయన పేర్కొంటున్నారు. ఎపినెఫ్రిన్, మధుమేహ చికిత్సలో వినియోగించే మెట్‌ఫార్మిన్, విటమిన్ సీ, వాసోప్రెసిన్, సప్లిమెంట్ సల్‌బుటమైన్.. వీటిని తగుపాళ్లలో కలిపి ఎక్మో మెషిన్‌తో కలిపి అందిస్తే.. గుండె స్తంభించిన వారిలో కూడా తిరిగి జీవం పోయవచ్చని సామ్ తెలిపారు. ప్రయోగశాలలో జంతువుల మీద తాము జరిపిన ప్రయోగాల్లో ఇది సాధ్యమైందన్నారు. 'మనిషి మరణించిన తర్వాత శరీరంలోని కణాలన్నీ వెంటనే చచ్చుబడిపోవు. దానికి కొంత సమయం పడుతుంది. మెదడు కూడా కొన్ని రోజులపాటు సజీవస్థితిలో ఉంటుంది. దీనిని సైన్స్ ఇప్పటికే నిరూపించింది. మేం జరిపిన కొన్ని పరిశోధనల్లో.. గుండెపోటుకు గురైన వ్యక్తుల్లో గుండె కొట్టుకోవటం మానేసిన తర్వాత కూడా దాదాపు గంటపాటు జ్ఞాపకాలు పదిలంగా ఉండటం గమనించాం. వారి మెదడు పనితీరును పరిశీలించినపుడూ ఇది నిజమేనని తేలింది' అని సామ్ వివరించారు. మరణానికి గురైన వ్యక్తి శరీర కణాల్లో జీవక్రియలు పూర్తిగా నిలిచిపోనంత వరకూ ఆ వ్యక్తిని బతికించవచ్చని సామ్ పేర్కొన్నారు.

భారత్‌లో అణు రియాక్టర్ల నిర్మాణానికి అమెరికా గ్రీన్ సిగ్నల్

- హోల్టెక్ సంస్థకు అనుమతి

న్యూఢిల్లీ, మార్చి 30: భారత్-అమెరికా మధ్య అణు ఒప్పందంలో రెండు దశాబ్దాల తర్వాత కీలక ముందడుగు పడింది. భారత్‌లో అణు రియాక్టర్ల నిర్మాణం, రూపకల్పనకు హోల్టెక్ ఇంటర్నేషనల్ సంస్థకు అమెరికా రెగ్యులేటరీ అనుమతిచ్చింది. ఈ ఒప్పందానికి అమెరికా ఇంధన శాఖ (డీవోఈ) మార్చి 26న ఆమోదం తెలిపింది. 2007లో భారత్, అమెరికా మధ్య 123 ఒప్పందాలపై సంతకాలు జరిగిన తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు ఈ ఆమోదం లభించడం గమనార్హం. అప్పట్లో కుదిరిన అణు ఒప్పందంలోని వాణిజ్య కోణాన్ని అందిపుచ్చుకునే మార్గంలో దీన్ని తొలి అడుగుగా పరిగణిస్తున్నారు. భారత్‌లోని మూడు సంస్థలైన హోల్టెక్ ఆసియా, లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ లిమిటెడ్‌తో కలిసి మాడ్యులర్ రియాక్టర్ టెక్నాలజీని పంచుకునేందుకు హోల్టెక్‌కు అనుమతి లభించింది. '10సీఎఫ్ఆర్810' అని పిలిచే నిర్బంధ అమెరికా రెగ్యులేషన్ కింద ఈ అనుమతి ఇచ్చింది. ఈ ఒప్పందం పదేళ్లపాటు చెల్లుబాటవుతుంది. ప్రతి ఐదేళ్లకొకసారి దీన్ని పునఃసమీక్షిస్తారు.

సంఘ్.. ఓ వటవృక్షం

- సేవకు ప్రతిరూపం: ప్రధాని మోదీ
- ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ సందర్శన

న్యూఢిల్లీ, మార్చి 30: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవకు మరో పేరని ప్రధాని మోదీ అన్నారు. అది భారతీయ ప్రాచీన సంస్కృతికి, ఆధునికీకరణకు వటవృక్షంలాంటిదని చెప్పారు. దాని విలువలు, ఆదర్శాలు జాతీయ చైతన్యాన్ని పరిరక్షిస్తున్నాయని తెలిపారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ప్రథమ, ద్వితీయ సర్‌సంఘ్ చాలక్‌లు కేబీ హెడ్గేవార్, ఎంఎస్ గోల్వాల్కర్‌ల స్మృతి మందిరాలకు వెళ్లి నివాళులు అర్పించారు. సంఘ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన రెండో ప్రధాని మోదీ. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు 2000లో వెళ్లారు. ఇద్దరూ మూడోసారి ప్రధాని అయిన తర్వాతే ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం గమనార్హం. సంఘ్ ప్రాంగణంలో మాధవ్ నేత్రాలయ ఐ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు అనుబంధంగా మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్ భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ.. గత వందేళ్లుగా 'సంఘటన్', 'సమర్పణ్'తో ఆర్ఎస్ఎస్ చేస్తున్న తపస్సు.. 'వికసిత్-భారత్-2047' లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఇప్పుడు ఫలాలందిస్తోందని తెలిపారు. 'వందేళ్ల తర్వాత సంఘ్ మరో మైలురాయి దిశగా కదులుతోంది. స్వాతంత్ర్య పోరాటంలో 1925-47 సంక్షోభ సమయం. ఇప్పుడు 2025-47 మధ్య కాలం కూడా చాలా కీలకమైనది. భారీ లక్ష్యాలు మన ముందున్నాయి. వచ్చే వెయ్యేళ్ల శక్తిమంతమైన, పురోగామి భారత నిర్మాణానికి మనం శంకుస్థాపన చేయాలి' అని అన్నారు. స్మృతి మందిరం వద్ద ఉన్న సందేశ పుస్తకంలో మోదీ హిందీలో సందేశం రాశారు. హెడ్గేవార్, గోల్వాల్కర్‌ల ఆలోచనలు తనతో పాటు ఎంతో మందికి స్ఫూర్తిని, బలాన్ని ఇచ్చాయన్నారు. ఆయన వెంట సంఘ్ చీఫ్ భాగవత్, కేంద్ర మంత్రిగడ్కరీ, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా ఉన్నారు. నాగపూర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన 'దీక్షాభూమి'ని కూడా మోదీ సందర్శించారు. 'దీక్షాభూమి' సామాజిక న్యాయానికి, బడుగుల సాధికారతకు చిహ్నమన్నారు. దీక్షాభూమిలోని స్తూపం వద్దకు వెళ్లి 'అంబేడ్కర్ అస్థి' వద్ద మోదీ నివాళులు అర్పించారు.



హెడ్గేవార్‌కు ప్రధాని మోదీ నివాళి

కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి!

కాంగ్రెస్ దశాబ్దాల తరబడి అనుసరించిన విధానాలు నక్సలిజానికి ఊతమిచ్చాయని మోదీ అన్నారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లోనే నక్సలిజం ప్రబలంగా విస్తరించిందని తెలిపారు. ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిశకం ప్రారంభమైందని చెప్పారు. మోదీ ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లా మోహభట్టాలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అనంతరం రూ.33,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంబికాపూర్-రాయ్‌పూర్ మధ్య మెమూ రైలును ప్రారంభించారు. రూ.9,790 కోట్లతో ఎన్‌టీపీసీ నిర్మించే సీపత్ సూపర్ థర్మల్ విద్యుత్కేంద్రం మూడో దశ(800 మెగావాట్లు) కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.15,800 కోట్లతో నిర్మించిన మొదటి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టును ప్రారంభించారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని బీజీపూర్ జిల్లాలో ఆదివారం 50 మంది నక్సలైట్లు సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిలో 14మందిపై రూ.68 లక్షల మేర రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటనకు కొన్ని గంటల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

జల సంరక్షణకు కదలండి!

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు నడుంబిగించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గత ఎనిమిదేళ్లలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 11 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని పొదుపు చేసినట్టు ఆదివారం 'మన్‌కీ బాత్' రేడియో ప్రసంగంలో ప్రధాని పేర్కొన్నారు. పండుగలు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. "ఈ ఆదివారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రజలు ఉగాదిని జరుపుకొంటున్నారు. మహారాష్ట్రలో గుడిపాడ్వా.. రాబోయే రోజుల్లో అసోం, పశ్చిమ బెంగాల్, కశ్మీర్‌లలో వేర్వేరు పండుగలు జరగనున్నాయి. అయినప్పటికీ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని కొనసాగించాలి" అని ప్రజలను కోరారు. వేసవి సెలవులను విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు మెరుగు పెట్టేందుకు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని సూచించారు. సెలవు దినాల్లో విద్యార్థుల కోసం కార్యక్రమాలు నిర్వహించేవారు 'మైహాలీడేస్' హ్యాష్ ట్యాగ్‌ను వినియోగించాలని సూచించారు. వస్త్ర వ్యర్థాలతో ప్రపంచం పెను సవాలు ఎదుర్కొంటోందని మోదీ చెప్పారు. భారత్ మూడోస్థానంలో ఉందన్నారు. పాత దుస్తుల రీసైక్లింగ్‌కు స్టార్టప్‌లు రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు.

ఆదిలాబాద్ మహిళలకు అభినందనలు

వివిధ రకాల పువ్వులను మోదీ ప్రస్తావించారు. ఇప్పపూలు గిరిజనుల సంస్కృతిని ప్రతిబింబిస్తాయని చెప్పారు. "ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు సోదరీమణులు ఇప్ప పువ్వులతో కొత్త ప్రయోగం చేస్తున్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.వాటిని ప్రజలు ఎంతో ఇష్టపడుతున్నారు" అని అభినందించారు.

ఇక మీ జట్టు వీడం

- అమిత్‌షాకు నితీశ్ కుమార్ హామీ

పట్నా, మార్చి 30: బీజేపీతో మరోసారి తెగదెంపులు చేసుకొనే ప్రసక్తే లేదని జేడీయూ అధ్యక్షుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు హామీ ఇచ్చారు. గతంలో రెండుసార్లు బీజేపీ నుంచి దూరమవడం పొరపాటున జరిగిందని, మరోసారి అలా చేయబోనని తేల్చిచెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నితీశ్ కుమార్‌తో కలిసి రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆదివారం అమిత్‌షా ప్రారంభించారు. ఎన్డీయే కూటమి నేతలు సమావేశమై అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలపై చర్చించారు.

చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. దాదాపు రూ.2 వేల కోట్ల మేరకు పేరుకుపోయిన బిల్లులను చెల్లించాలని నిర్ణయించారు. దీంతో దాదాపు 17 వేల మంది చిన్న తరహా కాంట్రాక్టర్లకు మేలు జరగనుంది. వీరిలో 8 వేల మంది కాంట్రాక్టర్లు నీరు-చెట్టు పథకంలో పలు పనులు చేపట్టారు. మరో 9 వేల మంది ప్రభుత్వానికి సంబంధించిన చిన్నపాటి కాంట్రాక్టులు చేశారు. ఏళ్ల తరబడి తమ బిల్లుల కోసం ఎదురు చూసిన వీరికి ఉగాది సందర్భంగా ప్రభుత్వం ఊరట కల్పిస్తూ.. సాధ్యమైనంత వరకు ముందొచ్చిన బిల్లులను ముందుగా చెల్లించే విధానం పాటించి వారికి బకాయిలు ఇవ్వనుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రి కేశవ్ ఆ శాఖ అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్ల బిల్లుల కోసం ప్రస్తుతం విడుదల చేస్తున్న రూ.2,000 కోట్లలో 10 శాతం పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించామన్నారు. రూ..కోటిలోపు ఉన్న బిల్లులకే ప్రాధాన్యం ఇస్తామని మంత్రి చెప్పారు. నీరు-చెట్టు, గుంతల రహిత రోడ్లు, నాబార్డు పనులకు ఈ విడతలో బిల్లుల చెల్లింపులు పూర్తవుతాయని వెల్లడించారు. జలవనరుల నిర్వహణ బిల్లులతో పాటు పోలవరం ప్రాజెక్టుకూ కొన్ని నిధులు విడుదల చేస్తామని కేశవ్ వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులెదురైనా పెండింగ్ బిల్లులు చెల్లిస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని మంత్రి చెప్పారు. ఈ బిల్లులన్నీ జగన్ పాలనకు చెందినవేనని, మూడు, నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.



శ్రీశైలంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు.., రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

కమనీయం...మల్లన్న రథోత్సవం

శ్రీశైలానికి తరలివచ్చిన అశేష భక్తజనం

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది మహోత్సవాల్లో భాగంగా శ్రీశైల క్షేత్రంలో ఆదివారం దేవదేవుని రథోత్సవం వైభవంగా సాగింది. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు తీసుకొచ్చారు. పుష్పాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవులు ఆశీనులై ముందుకు సాగుతుండగా భక్తుల శివ నామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. కాగా, ఆదివారం రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.



నూతన వస్త్రాలు, పంచాంగాన్ని తీసుకొస్తున్న శ్రీవారి ఆలయ పెద్దజీయర్ స్వామి తదితరులు

శ్రీవారి ఆలయంలో వైభవంగా ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయలో ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఆస్థానం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతం అనంతరం శుద్ధి నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుడికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి.. మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానాన్ని నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. దేశ, విదేశాల్లో ఉండే తెలుగు ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కర్నూలు నగరంలోని కల్లూరులో చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టూ ఎద్దుల బండిని తిప్పుతున్న రైతులు

కల్లూరు చౌడేశ్వరీ ఆలయంలో కన్నుల పండువగా జ్యోతి మహోత్సవం

- ఆకట్టుకున్న రైతుల ఎడ్ల బండ్ల ప్రదర్శన

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం కల్లూరులోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం జ్యోతి మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. గతంలో..దూర ప్రాంతాలకు వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి చేరాలని చౌడేశ్వరి ఆలయం చుట్టూ ఎద్దులబండ్లతో ప్రదర్శనలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకునే వారని చెబుతారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఎడ్ల బండ్ల ప్రదర్శనలో భాగంగా..అమ్మవారి ఆలయం చుట్టూ నారుమడి పద్ధతిలో నీరు నింపారు. ఎద్దులను అలంకరించి గ్రామ ఊరువాకిలి నుంచి మేళతాళాలతో ఊరేగిస్తూ అమ్మవారి ఆలయం చుట్టూ రైతులు తిప్పారు. ఇక్కడ రెండు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. పుష్కలంగా వర్షాలు కురవాలని రజకులు సోమవారం గాడిదలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు.

చిన్నారిని గోడకేసి కొట్టి హత్య

సవతి తల్లి కర్కశం



కవలలు ఆకాశ్, కార్తీక్

- కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి మరో బిడ్డకు నరకం
- గుంటూరు జిల్లా గొల్లపాలెంలో దారుణం
- చిత్రహింసలపై చలించిపోయిన ఇరుగుపొరుగు
- పోలీసులకు సమాచారం.. దంపతులపై కేసు



కాలుతున్న పెనంపై కూర్చోబెట్టడంతో గాయపడిన ఆకాశ్

యడ్లపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సవతి బిడ్డలను చిత్రహింసలకు గురిచేయడంతోపాటు వారిలో ఒకరిని గోడకేసి కొట్టి హతమార్చిందో సవతి తల్లి. మరో బిడ్డను కాలుతున్న పెనంపై కూర్చోబెట్టిన నరకం చూపించింది. అయినా, ఈ అమానవీయ ఘటనలపై ఆ చిన్నారుల తండ్రి స్పందించలేదు. పిల్లల ఆర్తనాదాలకు చలించిపోయిన ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామంలో జరిగిందీ దారుణం. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి చెందిన కంచర్ల సాగర్ రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటారు. ఆయనకు కృష్ణాజిల్లా జనగాం ప్రాంతానికి చెందిన అనూషతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి తొలికాన్పులో కవలలు ఆకాశ్, కార్తీక్ జన్మించారు. రెండో కాన్పులో రెండేళ్ల క్రితం పాపకు జన్మనిచ్చిన మరుసటి రోజే అనూష మరణించారు. అనంతరం గొల్లపాలెం గ్రామానికి చెందిన లక్ష్మిని సాగర్ రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి 8 నెలల క్రితం పాప జన్మించింది. అనూషకు ద్వితీయ కాన్పులో కలిగిన పాపను యనమదల గ్రామస్థులకు దత్తత ఇచ్చారు. తమ వద్దే ఉంటున్న సాగర్, ఆకాశ్‌లను లక్ష్మి కొట్టడం, హింసించడం నిత్యకృత్యమైంది. సాగర్ మిన్నకుండిపోవడంతో లక్ష్మి మరింత రాక్షసంగా ప్రవర్తిస్తోంది. సుమారు నలభై రోజుల క్రితం వీరు కొండవీడు వదిలి గొల్లపాలెంకు మకాం మార్చారు. శనివారం ఉదయం సాగర్ పనికి వెళ్లగా, లక్ష్మి కవలలిద్దరినీ చిత్రహింసలకు గురిచేసింది. కార్తీక్(6)ను గోడకేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆకాశ్‌ను నిక్కరు ఊడదీయించి కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి పైశాచికంగా ప్రవర్తించింది. ఈలోగా పిల్లల ఆర్తనాదాలు విన్న ఇరుగుపొరుగువారు ఫిరంగిపురం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీంద్ర అక్కడికి వచ్చేసరికే కార్తీక్ నిర్జీవంగా పడిఉన్నాడు. కాలిన గాయాలతో ఏడుస్తున్న ఆకాశ్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. చిన్నారుల మేనత్త విజయ ఫిర్యాదు మేరకు లక్ష్మి, సాగర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్తీక్ మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కొండవీడులోని బంధువులకు అప్పగించారు.

ఏలూరు జైల్లో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

- బ్యారక్‌లోని కిటికీకి చున్నీతో ఉరి
- ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసిన అధికారులు



శాంతకుమారి

ఏలూరు క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీ ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం బ్యారక్‌లో చున్నీతో ఉరి వేసుకుంది. దీంతో ఇద్దరు జైలు ఉద్యోగులను అధికారులు సస్పెండ్ చేశారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం తాటి ఆకులగూడేనికి చెందిన గంధం శాంతకుమారి(31), ప్రియుడు గోపాలరావుతో కలిసి భర్త బోసును హతమార్చింది. దీంతో శాంతకుమారి, గోపాలరావులను అరెస్టు చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఈ నెల 24న ఏలూరు జిల్లా జైలుకు తరలించారు. మహిళా బ్యారక్‌లో ఉన్న శాంతకుమారి ఆదివారం ఉదయం బ్యారక్‌లోని కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని మరణించింది. ఉదయం 7.50 గంటలకు సిబ్బంది గమనించి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. ఘటనపై జిల్లా జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా జైల్లో హెడ్ వార్డర్ ఎల్.వరలక్ష్మి, వార్డర్ నాగమణి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రిమాండ్ ఖైదీ ఆత్మహత్యకు ఆస్కారం ఏర్పడిందని అధికారులు నిర్ధారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ జిల్లా సూపరింటెండెంట్ స్వామి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శాంతకుమారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలూ అమ్మమ్మ సంరక్షణలో ఉన్నారు.

50 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎస్పీ ఎదుట ఆదివారం 50 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరందరిపై సుమారు రూ.68లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ జితేందర్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలో పలు విధ్వంసకర ఘటనల్లో వీరు పాల్గొన్నారని ఎస్పీ తెలిపారు.

విజయవాడలో ఆ 4 గంటలు!

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో వీడుతున్న చిక్కుముళ్లు



విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాదం తర్వాత అక్కడే కూర్చున్న ప్రవీణ్

- విజయవాడకు రాకముందే ఒకసారి రోడ్డు ప్రమాదం
- రామవరప్పాడు రింగ్ సమీపంలో రెండో ప్రమాదం
- మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని పాస్టర్‌కు ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు కౌన్సెలింగ్
- సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)



పాస్టర్ ప్రవీణ్ బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిన దృశ్యం

పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి కేసులో ఒక్కో చిక్కుముడి వీడుతోంది. విజయవాడలో ప్రవీణ్ నాలుగు గంటల పాటు ఎక్కడున్నారన్న ప్రశ్నకు సాంకేతికంగా ఆధారాలను పోలీసులు సేకరించారు. రాజమహేంద్రవరం చేరుకోవడానికి ముందు ప్రవీణ్ విజయవాడలో ఆగినట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవడంతో సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా ప్రవీణ్ ప్రతి కదలికను పోలీసులు గుర్తించారు. దీనికోసం విజయవాడ, రాజమహేంద్రవరం పోలీసులు మొత్తం 300 కెమెరాల ఫుటేజీలను విశ్లేషించారు.

పాస్టర్ ప్రవీణ్ ఈ నెల 24న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరిన విషయం తెలిసిందే. అదేరోజు మధ్యాహ్నం సమయంలో కోదాడలోని మద్యం దుకాణంలో రూ.650తో మద్యం సీసా కొనుగోలు చేసి, ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించడానికి ముందే

కోదాడలో మద్యం సీసా కొనుగోలు

ప్రవీణ్ మద్యం తాగినట్టు అనుమానిస్తున్నారు. సరిగ్గా కంచికచర్ల-పరిటాల మధ్య అదుపుతప్పి పడిపోవడంతో బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిపోయింది. సేఫ్టీ రాడ్స్ వంగిపోయాయి. ప్రవీణ్ చేతులకు గాయాలయ్యాయి. అక్కడినుంచి గొల్లపూడి చేరుకున్న తర్వాత బంకు వద్ద పెట్రోలు పోయించుకున్నారు. అప్పటికే ప్రవీణ్ మాట్లాడలేని స్థితిలో ఉన్నట్టు బంక్‌లోని ఉద్యోగులు పోలీసులకు తెలిపారు. బంక్‌కు రాగానే ఎంత పెట్రోల్ పోయమంటారని సిబ్బంది అడిగితే ప్రవీణ్ ఎనిమిది వేళ్లు చూపించారు. రూ.800కు పోయమంటారా అని సిబ్బంది మళ్లీ ప్రశ్నించగా ఆయన అడ్డంగా తలూపారు. ఎనిమిది లీటర్లు పోయమంటారా అంటే అడిగితే అవునని సంకేతం ఇస్తూ తల పైకి, కిందకు ఊపారు. దీనికి సంబంధించిన డబ్బు రూ.872 ఫోన్ పే చేశారు. అప్పటికే ప్రవీణ్ చేతులపై కొట్టుకుపోయినట్టుగా గాయాలు ఉన్నాయని, బుల్లెట్ హెడ్‌లైట్ ఊడిపోయి ఉందని బంకు సిబ్బంది వివరించారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీని పెట్రోల్ బంక్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన జాతీయ రహదారిపై దుర్గగుడి ఫ్లై ఓవర్, రాజీవ్ గాంధీ పార్కు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ మీదుగా బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ ఎక్కి మహానాడు జంక్షన్‌కు చేరుకున్నారు.

'మహానాడు' దాటాక కాసేపు మాయం

ఆ మార్గంలోని అన్ని సీసీ కెమెరాల్లో ప్రవీణ్ బుల్లెట్‌పై వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. మహానాడు కూడలి దాటాక రామవరప్పాడు రింగ్ వస్తుంది. ఇక్కడ సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు ప్రవీణ్ కనిపించకపోవడంతో మహానాడు కూడలి- రామవరప్పాడు రింగ్‌కు మధ్యలో ఏదో జరిగిందని అనుమానించారు. రామవరప్పాడు రింగ్‌కు పది మీటర్ల దూరంలోనే వోక్స్ వ్యాగన్ షోరూమ్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై బుల్లెట్‌పై నుంచి ఆయన పడిపోయారు. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు రింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావుకు విషయం చెప్పారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్‌ను పైకి లేపి పక్కన ఉన్న రెయిలింగ్ వద్ద కూర్చోబెట్టారు. కాసేపటి తర్వాత పాస్టర్‌ను ఎస్ఐ నెమ్మదిగా నడిపించుకుంటూ, బుల్లెట్‌ను ఆటో డ్రైవర్లు తోసుకుంటూ రింగ్ వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్ దగ్గరకు తీసుకొచ్చారు. ముఖం కడుక్కోవడానికి ఆయనకు ట్రాఫిక్ ఎస్ఐ నీళ్లు ఇచ్చారు. ఆ తర్వాత బూత్ ఎదురుగా ఉన్న గడ్డిలో రాత్రి 8.20 గంటల వరకు పాస్టర్ నిద్రపోయారు. నిద్రలేచాక మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత ఇన్నోటెల్ హోటల్ పక్కన ఉన్న టీస్టాల్ వద్దకు తీసుకెళ్లి టీ ఇప్పించారు. టీ తాగిన తర్వాత ప్రవీణ్ బుల్లెట్‌పై ఏలూరు వైపు బయల్దేరారు. ట్రాఫిక్ ఎస్ఐ వద్దని వారించినా ఆయన ఆగలేదు. ట్రాఫిక్ ఎస్ఐతో కలిసి పాస్టర్ టీ తాగడానికి వెళ్లడం, తిరిగి ట్రాఫిక్ బూత్ వద్దకు వచ్చిన దృశ్యాలు ఇన్నోటెల్ హోటల్ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. టోల్‌గేట్లు దాటుకుని ఏలూరు చేరుకున్నాక అక్కడ టానిక్ వైన్స్‌లో మద్యం కొని, రూ.350 ఫోన్‌పే చేశారు. ఈ సీసీ కెమెరా ఫుటేజీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీసీ కెమెరాలు చూపించిన సమయాలు

- 24వ తేదీ సాయంత్రం 4.45 గంటలకు ప్రవీణ్ గొల్లపూడిలో పెట్రోలు బంక్‌కు చేరుకున్నారు.
- 5.13 గంటలకు మహానాడు కూడలిలో జాతీయ రహదారిపై సీసీ కెమెరాలో కనిపించారు.
- 5.30 గంటలకు పోలీసులు రామవరప్పాడు రింగ్ వద్ద ట్రాఫిక్ బూత్ వద్దకు తీసుకొచ్చారు.
- 5.30- 8.20 గంటల వరకు బూత్ ఎదురుగా గడ్డిలో నిద్రపోయారు.
- రాత్రి 8.47 గంటలకు రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు వైపు వెళ్లారు.

ప్రయాణానికి పక్కాగా ఏర్పాట్లు

హైదరాబాద్ నుంచి ప్రవీణ్ పకడ్బందీ ఏర్పాట్లతో బయలుదేరారు. తలకు జావా కంపెనీ హెల్మెట్, కాళ్లకు తెలుపు రంగు బూట్లు, బుల్లెట్‌కు వెనుక ఒక బ్యాగ్ పెట్టుకున్నారు. విజయవాడ చేరుకునే లోపు అనేక చోట్ల ఆగినా ఎక్కడా హెల్మెట్ తీయలేదు. విజయవాడ చేరుకున్నాక రామవరప్పాడు రింగ్ సమీపంలో పడిపోయారు. ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావుకు ఆయన ఎవరో తెలియదు. బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిపోయి వైరుతో వేలాడుతూ ఉండడం, సేఫ్టీ రాడ్లు వంగిపోవడం, చేతులకు కొట్టుకుపోయినట్టుగా గాయాలు ఉండటం, హెల్మెట్‌కు సొట్ట పడటంతో వీడియోలు, ఫొటోలు తీశారు. ఆ రోజున బుల్లెట్ పైనుంచి పడిపోయిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, హెల్మెట్ ధారణపై అవగాహన పెంచడానికి ఫొటోలు, వీడియోలు తీశానని అధికారులకు ఎస్ఐ సుబ్బారావు వివరించారు.

రాజేష్ కుటుంబం సేఫ్!

- విషయం బయటకు పొక్కడంతో విడిచిపెట్టిన కిడ్నాపర్లు
- కిడ్నాప్ ముఠాలో రాజేష్ స్నేహితునితో పాటు మరో ఆరుగురు
- నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రాజేష్ కుటుంబ సభ్యుల కిడ్నాప్ వ్యవహారం సుఖాంతమైంది. ఆర్థిక లావాదేవీల కారణంతో ఒకే కుటుంబంలోని ఐదుగురిని కిడ్నాప్ చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న విషయం విదితమే. రూ.2 కోట్లు ఇస్తేనే విడిచి పెడతామని కిడ్నాపర్లు బెదిరించిన నేపథ్యంలో పోలీసులు గాలింపు చేట్టారు. కిడ్నాప్ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం.. కారులో నుంచి రాజేష్ దూకి తప్పించుకోవడం, పోలీసులకు తెలిసి పోవడంతో కిడ్నాపర్లు ఆందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి రాజేష్ తల్లి విజయను చిత్తూరు-బెంగుళూరు మార్గమధ్యలో రోడ్డుపై వదిలి వెళ్లారు. ఆమె ఇతరుల సాయంతో ఆదివారం తెల్లవారుజామున జీవకోనలోని కుమారుడి ఇంటికి చేరుకున్నారు. రాజేష్ భార్య సుమతి, ఇద్దరు పిల్లలను బెంగుళూరులోని సుమతి అమ్మ ఇంటికి దూరంగా కిడ్నాపర్లు వదిలిపెట్టారు. రాజేష్ తల్లి నుంచి ఆదివారం ఉదయం పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

కిడ్నాప్ ఎందుకంటే?

రాజేష్, భార్గవ్ స్నేహితులు. రాజేష్ వద్ద భార్గవ్ రూ.20 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బు ఇవ్వకపోగా.. మళ్లీ రూ.2 కోట్లు ఇవ్వాలని తన స్నేహితుడు అరుణ్‌తో కలిసి డిమాండ్ చేశాడు. దీనికి రాజేష్ నిరాకరించడంతో అరుణ్‌తో కలిసి కిడ్నాప్ ప్లాన్ చేసినట్టు సమాచారం. శుక్రవారం రాత్రి అక్కారాంపల్లిలోని ఒక అపార్టుమెంటు వద్దకు రావాలని రాజేష్‌కు ఫోను చేసి పిలిచారు. అనుమానించిన రాజేష్ తనతో పాటు తల్లి, భార్య, పిల్లలను తీసుకొచ్చారు. పథకం ప్రకారం భార్గవ్, అరుణ్ వీరితో గొడవ పడ్డారు. రాజేష్‌ను ఒక కారులో, కుటుంబ సభ్యులను మరో కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. మరో ఐదుగురు ఈ కిడ్నాప్‌లో పాల్గొన్నట్టు తెలిసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా రెండు కార్లను అలిపిరి పోలీసులు గుర్తించారు. ఆ కార్లు ఎవరివి? డ్రైవర్లుగా ఎవరు వెళ్లారు? ఇప్పుడు వాళ్లెక్కడ ఉన్నారనేది వారి ఫోన్ల ఆధారంగా గుర్తించేందుకు టెక్నికల్ టీమ్‌లు రంగంలోకి దిగాయి. కిడ్నాపర్లు బెంగళూరులోనే ఉంటారని భావించిన పోలీసులు రెండు బృందాలను పంపారు. ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది.



భువనేశ్, కృష్ణారావు, సరళ, సంతోష్

ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి

- ఇద్దరు కుమారులకు విషమిచ్చి..దంపతుల ఆత్మహత్య
- పండుగకని హాస్టల్ నుంచి వచ్చి మృత్యువుపాలైన పిల్లలు
- శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఘోరం

మడకశిర, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులకు ఓ కుటుంబం బలైపోయింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో శనివారం రాత్రి ఇద్దరు కుమారులకు విషమిచ్చి, తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు....మడకశిరలోని గాంధీ బజారులో బంగారం వ్యాపారి కృష్ణాచారి (55)...భార్య సరళ (39), కుమారులు సంతోష్ (15), భువనేశ్ (13)తో నివాసముంటున్నారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో సంతోష్ పది, భువనేశ్ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్‌లో ఉంటున్న పిల్లలిద్దరూ ఉగాది పండుగ అని శనివారమే ఇంటికొచ్చారు. వ్యాపారంలో నష్టాల కారణంగా కృష్ణాచారి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. మడకశిరలోనే మరో ప్రాంతంలో ఉంటున్న కృష్ణాచారి తండ్రి మల్లాచారి వద్దకు శనివారం వెళ్లి ఆశీస్సులు తీసుకుని వచ్చారు. బంధువులకు ఫోన్లు చేసి, ఆనందంగా మాట్లాడారు. అనంతరం బంగారు ఆభరణాల తయారీలో వినియోగించే విష పదార్థాన్ని నీటిలో కలిపి కుమారులు సంతోష్, భువనేశ్‌కు ఇచ్చారు. వారు తాగాక కృష్ణాచారి, సరళ కూడా తాగారు. అందరూ చనిపోయారు. తెల్లవారుజామునే మల్లాచారి.. కుమారుడికి ఫోన్ చేసినా తీయలేదు. మనవళ్లు కూడా వచ్చినందున వారిని చూద్దామని ఉదయాన్నే మల్లాచారి కుమారుడి ఇంటికొచ్చారు. తలుపు తట్టినా తెరవలేదు. తలుపును తోయగా.. తెరుచుకుంది. ఇంట్లో చూడగా నలుగురూ విగతజీవులుగా పడి ఉన్నారు. జిల్లా ఎస్పీ రత్న.. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

సీఎంకు శ్రీవారి ప్రసాదాలు



సీఎం చంద్రబాబుకు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా సీఎంను ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శేషవస్త్రం, శ్రీవారి ప్రసాదాలు అందజేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అలాగే, కడపజిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11వ తేదీ నిర్వహించే కల్యాణానికి విచ్చేయాలని సీఎంను టీటీడీ చైర్మన్, ఈవో ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు.



ఆరడుగుల గుంతలో ఉన్న కోటిరెడ్డిని బయటకు తీస్తున్న దృశ్యం

ప్రపంచ శాంతి కోసమంటూ.. సజీవ సమాధిలోకి!

- ఆరు అడుగుల గుంతలోకి వెళ్లి.. కుమారుడితోనే పూడ్పించుకున్న ఓ వ్యక్తి
- విషయం తెలిసి అడ్డుకున్న పోలీసులు
- 8 గంటల తర్వాత గుంతలోంచి బయటకు
- ఉగాది నాడున ప్రకాశం జిల్లాలో ఘటన
- భూదేవికి రెండు ఆలయాలు నిర్మించిన భక్తుడు

తాళ్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భూదేవి మాత నిత్యం తన ఒంట్లోకి వస్తోందని, ప్రపంచ శాంతి కోసమంటూ ఓ వ్యక్తి సజీవ సమాధికి యత్నించిన ఘటన ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలంలో ఆదివారం ఉగాది పండుగ నాడున చోటుచేసుకుంది. ఆరు అడుగుల గుంతలోకి వెళ్లి, తన కుమారుడితోనే పైన ఒక రేకు పెట్టించి, దానిపైన మట్టితో పూడ్పించుకోవడం సంచలనంగా మారింది. దీన్ని వీడియో తీసిన కుమారుడు స్నేహితులకు పంపడంతో.. ఈ వ్యవహారం పోలీసులకు తెలిసింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసు సిబ్బంది.. గుంతలోని వ్యక్తిని బయటకు తీయడం ద్వారా 8 గంటల పాటు సాగిన ఉత్కంఠకు తెరపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన కైపు కోటిరెడ్డి అనే వ్యక్తి భూదేవి భక్తుడు. అమ్మవారిపై భక్తితో కొంతకాలం క్రితం భూమిలో 40 అడుగుల లోతు గుంత తీసి భూదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. పైవరకు ఆలయం కూడా నిర్మించాడు. నిత్యం ఆ గుంతలోకి వెళ్తూ తనకు తోచిన రీతిలో పూజలు చేస్తుంటాడు. అయితే ఆ గుంతలోకి వెళ్లే భక్తులు గాలి ఆడక ఇబ్బందులు పడేవారు. దీంతో రెండేళ్ల క్రితం భూమిపైనే మరో ఆలయం నిర్మించాడు. భూదేవి అమ్మవారు తన ఒంట్లోకి వస్తుందని చెబుతూ ఇటీవల దాని పక్కనే ఆరు అడుగుల గుంత తీశాడు. ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో కోటిరెడ్డి ఆ గుంతలో కూర్చున్నారు. ఆయన ఆదేశాలతో కుమారుడు పైన రేకు పెట్టి, మట్టితో పూడ్చివేశాడు. దీన్ని వీడియో తీసి తన ఫోన్‌లో స్నేహితులకు పంపాడు. దీంతో కోటిరెడ్డి సజీవ సమాధి అయ్యాడన్న వార్త చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరావు సిబ్బందితో కలిసి ఉదయం 11 గంటలకు గ్రామానికి చేరుకున్నాడు. గుంతలో నుంచి బయటకు రావాలని కోరగా.. మొదట కోటిరెడ్డి నిరాకరించాడు. చివరికి పోలీసుల విజ్ఞప్తి మేరకు 8 గంటల పాటు గుంతలో ఉన్న ఆయన బయటికి వచ్చాడు. అనంతరం పోలీసులు గుంతను పూడ్పించారు. ఇలాంటి పనులు చేయడం నేరమని, కోటిరెడ్డికి ప్రాణాపాయం జరిగితే కుటుంబీకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

హైపవర్ కమిటీ చైర్మన్‌గా జస్టిస్ దుర్గాప్రసాదరావు


- రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతులివ్వనున్న కమిటీ

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మెడికల్, డెంటల్, నర్సింగ్ కాలేజీలకు అనుమతులిచ్చే హైపవర్ కమిటీ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాద రావును ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు మరో ముగ్గురు సభ్యుల నియామకానికి సీఎం చంద్రబాబు అనుమతిచ్చారు. నిమ్స్ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ వేమూరి సుధాకర్ ప్రసాద్, ఎస్ఆర్ఐ మెడికల్ కాలేజీ అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్ఎస్‌బీ పరిమల, విశాఖపట్నానికి చెందిన డెంటల్ డాక్టర్ రఘు బొడ్డేపల్లికి కమిటీలో అవకాశం కల్పించారు. రాష్ట్రంలో అవసరమైన మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు ఈ కమిటీ కృషి చేయాల్సి ఉంటుంది.

ప్రతి మనిషీ ఒక్క పుస్తకమైనా రాయాలి

హిందీ కవి, రచయిత వినోద్ కుమార్ శుక్లా 2024 సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 1937లో జన్మించిన శుక్లా మొదటి కవితా సంపుటి 'లగ్‌భగ్ జైహింద్' 1971లో ప్రచురితమైంది. 'నౌకర్ కి కమీజ్', 'దీవార్ మే ఏక్ కిడ్‌కీ రహ్‌తీ థీ', 'ఖిలేగా తో దేఖేంగే' మొదలైనవి ప్రసిద్ధ నవలలు. జ్ఞానపీఠ్‌కు ఎంపికైన సందర్భంగా వేర్వేరు ఇంటర్వ్యూలలో ఆయన మాటల్లోంచి కొన్నింటిని ఏరి ఇక్కడ ప్రచురిస్తున్నాం.

– వివిధ



రచనలో సవాళ్ళు

పిల్లలు ఆడుతూ పెరిగినట్టు నేను రాస్తూ పెరిగాను. పదిహేను పదహారేళ్ళ వయసు నుంచీ రాస్తూనే ఉన్నాను. ఐనా రచన మీద పట్టు రాలేదు. మొదట్లో ఎదురైన సవాళ్లే ఇప్పుడూ ఎదురవుతాయి. నా దృష్టిలో రాయటం అంటే ఎప్పుడూ రాయటానికి చేసే ప్రయత్నమే.

కవిత పుట్టుక

రాయకముందే ప్రతి కవితా వాస్తవంలో దాగి ఉంటుంది. సమయం వచ్చినప్పుడే దాని సమక్షం మనకు తెలుస్తుంది. పచ్చటి చెట్లలో కలిసిపోయే రామ చిలక లాగ. అది ఎగిరిపోయినా దాని సమక్షం మన లోంచి మాయం కాదు. అది మన అనుభవంలో కలిసి పోతుంది. మన జ్ఞాపకంలో భాగమవుతుంది. ఆ జ్ఞాపకం నుంచి మరికొన్ని జ్ఞాపకాలు జన్మిస్తాయి.

ఆఖరు పంక్తి

కవిత ఏ పంక్తితో ముగిసేదీ ఆ కవితకే తెలుస్తుంది. ఒక్కోసారి నేను ఒకే కవితను జీవితమంతా తిరగ రాయగల ననిపిస్తుంది.

వచనం – కవిత్వం

నేను ఎక్కువ కాలం పాటు ఏ కవితా రాయలేనప్పుడే వచనం జోలికి వెళ్తాను. అలా వచనం రాస్తూపోతే మధ్యలో కవిత్వం ఎదురవుతుంది. వచనం నాకొక తవ్వకం పనిముట్టు. ఆలోచనల లోతుల్లోకి తవ్వు కుంటూ పోయాకనే కవిత్వం దొరుకుతుంది.

కవితలు కథలుగా, కథలు కవితలుగా...

నా కవితలేమీ కథలుగా మారలేదు. కానీ ఒక్కోసారి కథ రాస్తున్నప్పుడు కొన్ని పదాలు, వాక్యాలు— పూర్తిగా ఏర్పడో ఏర్పడకుండానో— ఎక్కడి నుంచో ఊడిపడ తాయి. అప్పుడు వెంటనే వెళ్ళి కవిత రాయబుద్ధవు తుంది. వచన రచనలో ఒక్కోసారి కవిత్వం పుట్టడం సహజమే. దాన్ని ఒక అడ్డుగా ఏమీ భావించనక్కర్లేదు. సృజనలో అదొక భాగం. మనలో కవిత పుట్టి అది అక్షరంగా మారడమనే ప్రక్రియ ఒక క్రమపద్ధతిని పాటించదు. ప్రతి కవితా తన పద్ధతిని తనే ఎంచుకుం టుంది. కవిత ముగియగానే ఆ పద్ధతీ ముగిసిపోతుంది.

మనుషుల ఆధారంగా పాత్రల్ని కల్పించేటప్పుడు

వాళ్ళ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. రాజకీయ నేతల కార్టూన్లు వేసేవాళ్ళు వాళ్ళని అడిగి వేయరు కదా. కొన్ని అడిగి చేయలేం. మనకి మంచో చెడో జరిగినప్పుడు ఆ అనుభవం గురించి రాసు కుంటాం. మన అనుభవం మనం రాసుకుంటున్నప్పుడు అందుకు కారణమైన వాళ్ళూ అందులోకి వస్తారు. అన్నిసార్లూ అనుమతి అడగలేం.

ప్రేరణ

మొదట ఒక సంఘటన గురించో ఆలోచన గురించో రాయాలనిపించి మనల్ని మనమే ప్రేరేపించుకుంటాం. రాసేదాక ఆ సంఘటన, ఆలోచనల పూర్తి స్వభావం ఏమిటో మనకే తెలియదు. రాయటం మొదలుపెట్టిన తర్వాత ఆ రాస్తున్నదే మనలో కొత్త ఆలోచనలను పుట్టిస్తూ మనల్ని ముందుకి నడిపిస్తుంది.

పిల్లల కోసం ఎలాంటి భాషలో రాస్తారు?

పిల్లల కోసం రాస్తున్నప్పుడు వాళ్ళ వయసును దృష్టిలో ఉంచుకుంటాను. కానీ నేను వాడే భాష మాత్రం పెద్ద వాళ్ల కోసం వాడేదే. ఊహాశక్తిలో పిల్లలు మన కంటే ఏమాత్రం తీసిపోరు. కాబట్టి భాషను మార్చను. వాక్య నిర్మాణం మాత్రం మారుతుంది. అంత్యప్రాస పిల్లల భాషలో భాగం. అది వాళ్ళ పసితనానికీ అమాయకత్వానికీ భావోద్వేగాలకూ దగ్గరగా వెళుతుంది.

సృష్టించిన పాత్రల్లో దగ్గరగా అనిపించే పాత్ర

నాకు దగ్గరగా అనిపించే పాత్ర నేనే. నేను రాసిందంతా నా జీవితం నుంచి పుట్టిందే. నా రచనల్లో 'నేను' అని మాట్లాడే ప్రతి పాత్ర లోనూ నేనున్నాను. నా రచనల్లో కనపడే ప్రదేశాలన్నీ నేను తిరిగినవీ, చూసినవీ! నేను చూడని, వినని వాటిని కూడా నా ఊహాశక్తితో సొంతం చేసుకుంటాను.



పాత రచనల్లో ఏదైనా మార్చే వీలుంటే...

మార్చాలన్న యావ ఉంటుంది. అందుకే ఒకసారి పబ్లిష్ అయ్యాక ఇక వాటి వంక మళ్ళీ చూడను. చూస్తే మార్చాలనిపిస్తుంది. కానీ ఒకసారి పబ్లిష్ అయ్యాకా ఆ రచన పాఠకులది అవుతుంది. వాళ్ళు ఒక రచనను తమ సొంతం చేసుకున్నాక ఇక దాన్ని మార్చే హక్కు నాకు లేదు.

స్థానీయత

స్థానీయత లోనే విశ్వజనీనత ఉంటుంది. మన స్థానీ యతను కాపాడుకోవాలి. మన బాల్యాన్నీ గడిచిన జీవి తాన్నీ జ్ఞాపకంలో ఉంచుకోవాలి. ప్రతి మనిషీ తన చరిత్రను రాసుకోవాలి. అలా రాసుకుంటే మనకి మరే చరిత్ర పుస్తకాల అవసరమూ ఉండదు. ప్రతి మనిషీ జీవితంలో కనీసం ఒక్క పుస్తకమైనా రాయాలి.

జ్ఞానపీఠ్ అవార్డుపై స్పందన

ఈ అవార్డు ఒక తియ్యని కబురు అని మాత్రం అనను. ఎందుకంటే నేను డయాబెటిక్! జీవితంలో చాలా చూశాను, విన్నాను, అనుభవించాను. కానీ చాలా తక్కువే రాయగలిగాను. రాసింది చూసుకుంటే రాయాల్సింది చాలా మిగిలే ఉందనిపిస్తోంది. మిగిలిన రచనలన్నీ త్వరగా పూర్తి చేయాలని ఉంది. కానీ పూర్తి చేయలేకపోవచ్చు. నా జీవితం వేగంగా ముగింపు వైపు దూసుకుపోతోంది. అంత వేగంగా ఎలా రాయాలో నాకు తెలీదు. ■

A Monologue of a Stone

(హంపీ కవితలు)


రణగొణ ధ్వనుల నగరం నుండి
మౌనంగా తపస్సు చేసుకునే
రాళ్ళ మధ్య వచ్చి పడ్డాను.

చిరుగాలి ఒక్కతే
వాకబు చేస్తూ పోతోంది.

ఎండావానా దోబూచులాడుకుంటూ
వాదించుకుంటున్నాయి.

హంపీ మీద ఆకాశం
కదలని కొండలా చూస్తోంది.

ఎక్కడెక్కడో ఎగిరి, ఇప్పుడే
రాయి మీద దాహంగా
పిట్ట ఒకటి వాలింది, నాలాగే



దిగంతాల అంచుల దాకా
చేతులు చాచిన ఆకాశాన్ని
చేతులు చాచి అందుకుంటున్న
కొండరాళ్ళు

బహుశా
ఏనాటిదో వాటి
పురాతన సంభాషణ.

భాష తెలీదనే బాధ లేదు.

హృదయం రిక్కించాను.



ఆడుకుంటూ ఆడుకుంటూ పిల్లలు
లక్కపిడతలు వదిలేసిపోయినట్టు
కొండల మీద నిలబడి బండలు.

చేతిలో ఐస్‌క్రీమ్‌లా
కళ్ళలోనుంచి ఆశ్చర్యం కారిపోతూ
నోరెళ్ళబెట్టి చూస్తున్నారు పిల్లలు.

పెద్దల కళ్ళల్లో నిండి పొంగిపోతూ
ఇంకా పెద్ద అచ్చెరువుచెరువులు.




నేను పోల్చుకోగలను
కళ్ళల్లో బెంగచెట్టు వేర్లు దిగేసినవాళ్ళను
చూపుల పూలు ఎక్కడో రాలిపడి
మనిషిలో మనిషి ఎక్కడో తప్పిపడి




రాతి రథాన్ని చూస్తూ
వేర్లు భూమిలో పాతేసుకున్న
రాతిచెట్టులా
స్థాణువై నిలబడిన నన్నూ
ఎవరో పోల్చుకుంటున్నట్టున్నారు.

తనివితీరని ఆత్మల్ని ఒలిచి
ఈ బండరాళ్ళ మీద ఆరేసి పోయేది
ఎందరో కదా

కవితలో ఇమడని పదబంధలా
సగం చెక్కి వదిలేసిన
రాతిస్తంభం మీద
సగం రాసేసిన కవితని మడతేసి
నిరామయంగా కూర్చున్నా.



ఊహల లోపలలోపలే
పూర్తిగా చెక్కిన కవితాకట్టడంలో
చెక్కీచెక్కని రాతిస్తంభాన్ని కూడా
కవితని నిలబెట్టే పదబంధంగా
కూర్చి వెళుతున్నా.



గాలి అంబారీ ఎక్కి
మదపుటేనుగులతో నడిచి

ఊహలఉలి పట్టుకొని
ఆ మహాశిల్పుల వెనుక
ఆశ్చర్యార్థకమై నిలబడుకొని

ధాన్యాగారంలో ఒక ధాన్యం మూటనై
నాట్యమండపాల్లో మార్మోగిన పాటనై
నర్తకీమణుల నడుమొంపునై
రాశులు పోసిన రత్నాల సొంపునై

స్నానాల మందిరాన
రాణిగారు పూసుకునే పరిమళ ద్రవ్యమై
రాయల వీరగాథల గేయాల శ్రావ్యమై

హంపీ వనక్షేత్రంలో
పచ్చదనపు పక్షినై

■ పి. శ్రీనివాస్ గౌడ్
✆ 99494 29449

గత వారం వివిధలో (24.03.2025) ప్రచురితమైన 'దళిత కవితకు తార్కిక పదును' అన్న వ్యాసానికి సాంకేతిక కారణం వల్ల రచయిత పేరు అచ్చు కాలేదు. ఆ వ్యాస రచయిత శీలం భద్రయ్య (98858 38288). పొరపాటుకు చింతిస్తున్నాం.

– వివిధ

'అసంకల్పిత పద్యం' కవితా సంపుటి

కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శేషభట్టర్ రఘు కవితా సంపుటి 'అసంకల్పిత పద్యం' ఆవిష్కరణ ఏప్రిల్ 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షుడు శిఖామణి; ఆవిష్కర్త వాడ్రేవు చినవీరభద్రుడు; వక్తలు కొప్పర్తి, తూముచర్ల రాజారామ్, నాళేశ్వరం శంకర్, పి. శ్రీనివాస్ గౌడ్.

కవిసంధ్య

'నేల తడుముతూనే' కవితా సంపుటి

తెరసం జంట నగరాలు – తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గుండెల్లి ఇస్తారి 'నేల తడుముతూనే' కవితా సంపుటి ఆవిష్కరణ ఏప్రిల్ 6 ఉ.10 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త నందిని సిధారెడ్డి; అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు; విశిష్ట అతిథి నాళేశ్వరం శంకరం. రూప్ కుమార్ డబ్బీకార్, కొండపల్లి నీహారిణి తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు

జయమిత్ర పురస్కారం

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు జి. చెన్నకేశవరెడ్డి జన్మదినం సందర్భంగా నందిని సిధారెడ్డికి పురస్కారం సగౌరవ సమర్పణ కార్యక్రమం ఏప్రిల్ 7 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షులు అమ్మంగి వేణుగోపాల్, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు; విశిష్ట అతిథులు ఏనుగు నరసింహారెడ్డి, నాళేశ్వరం శంకరం; ఆత్మీయ అతిథులు ఎం.కె. రాము, ఎం. శంకర్ రెడ్డి తదితరులు పాల్గొంటారు.

రాయారావు సూర్య ప్రకాశరావు

హాస్య, వ్యంగ్య కథల పోటీ

కీ.శే. ఎ.వి. చయనులు స్మృతిలో కథలను ఆహ్వానిస్తున్నాం. 45 ఏళ్ళ లోపు వాళ్ళు మాత్రమే పంపాలి. పేజీల పరిమితి లేదు. హాస్య, వ్యంగ్య రచనలకి ప్రాధాన్యం. ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి. ఎంపికైన కథకు రూ.10వేల బహుమతి. కథలు జూన్ 25లోగా యూనికోడ్/ పిడిఎఫ్‌లో ఈమెయిల్: vidyasagarsriadibhatla@gmail.com కు పంపాలి. వివరాలకు ఫోన్: 94923 40651.

ఎస్. ఎ. విద్యాసాగర్

సోమవారం 31 మార్చి 2025
వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

మెరుపు వచనకారుడు

ఒక కవిని ఎలా పరిచయం చేయాలి? ఒక కథ మీద ఎలా కామెంట్ చేయాలి? ఒక సినిమాని ఎలా సమీక్షించాలి? సాహిత్యంలోనో, సంగీతంలోనో, వ్యాపారం లోనో ప్రసిద్ధుడయిన ఒకరి గురించి చెప్పడం ఎలా?

ఇందులో విశేషం ఏమీ లేదు. ఏళ్ల తరబడి సమీక్షలు, వ్యాఖ్యానాలు, వ్యాసాలూ చూస్తూనే వున్నాం. అవి ఎక్కువగా ఒక మూసలో వుంటాయి. పాత సంప్రదాయాన్ని పట్టుకు వేలాడుతుంటాయి. కొన్ని అకడెమిక్‌గా, కొన్ని పడికట్టు పదాలతో, మరికొన్ని మొక్కుబడిగా వుంటాయి. ఆ mould ని విజయవంతంగా బ్రేక్ చేసినవాడు తాడి ప్రకాష్.

జర్నలిస్టుగా అనుభవం, సాహిత్యాభిలాష, ఆధునికమైన చూపు – సంప్రదాయాన్ని బద్దలు చేయగల శక్తిని ప్రకాష్‌కి యిచ్చాయి. తెలుగులో బాగా రాయగలిగేవాళ్లు చాలామంది వున్నారు. సమర్థవంతంగా రాయగలిగేవాళ్లూ అనేకమంది వున్నారు. కానీ తాడి ప్రకాష్‌లా ఒక బ్రేక్ త్రూ సాధించినవాళ్లు అతికొద్దిమంది. ప్రకాష్ వాక్యాలు చాలా తేలిగ్గా రాసినట్టు పైకి కనిపించినా, ఆ నిర్మాణం సౌమ్యంగా, హుందాగా సాగుతూనే, చటుక్కున దూకుడుగా ఒక మాట అనడం వెనక ఒక కచ్చితమైన వ్యూహం వుంటుంది. పాజిటివ్‌గా రాసినా, నెగెటివ్‌గా రాసినా, కొన్నిచోట్ల కొంత 'అతి'గా అనిపించినా, ఆయన నిజాయితీ అక్షరాల్లో మెరుస్తూనే వుంటుంది.

"పొగడ పూల పరిమళమే వగరు జ్ఞాపకాల నవ్వు" అంటూ విమల కవిత్వం గురించిన ప్రకాష్ సమీక్ష విలువైనది. శ్రీశ్రీ అంతిమయాత్రపై ప్రకాష్ ఆర్టికల్ ఎప్పటికీ మరిచిపోలేం. ఐస్ బ్లాక్ మీద అచేతనంగా వున్న మహాకవి గురించి రాస్తూ, "హిమాలయాన్ని తలకింద దిండుగా పెట్టుకుని నిద్రపోతున్న అగ్నిపర్వతంలా వున్నాడు శ్రీశ్రీ" అన్నాడు ప్రకాష్. మహాకవి అంతిమ వీడ్కోలు ఆర్టికల్‌కి ప్రకాష్ పెట్టిన హెడ్డింగ్: 'శ్రీశ్రీకి అశ్రుదీపాల అల్విదా'.

'మాండలికంలో మొగలాయి' నామిని అన్నా, 'సట్లెజ్ కెరటాలు పిలిచాయా బంగోరే!' అన్నా, 'ఒక బెల్జియం అద్దం' రాంభట్ల కృష్ణమూర్తి అన్నా – అది ప్రకాష్ మార్క్ రచన. కమ్యూనిస్టు భావజాలం వున్నవాడే అయినా, "కమ్యూనిస్టు పార్టీలకు భవనాలు మాత్రమే మిగిలి, జనాలు దూరం అవుతున్న కాలం ఇది" అని రాస్తాడు. నండూరి రామ్మోహన్ రావు, ఎ.బి.కె. ప్రసాద్, కె.ఎన్.వై పతంజలి లాంటి గొప్పవాళ్లతో కలిసి పనిచేసిన అనుభవాలు రాసినా, తనని తాను ప్రొజెక్ట్ చేసుకోడు.

గోరటి వెంకన్న గురించి రాస్తూ, "హృదయాన్ని పాటతో నింపేవాడి గ్లాసు మాత్రం నింపగల నిమిత్తమాత్రుణ్ణి నేను" అంటాడు. ప్రొఫెసర్ సాయిబాబా గురించి రాస్తూ, "చదువూసంధ్యా లేని చవట సన్నాసులు రాజ్యమేలుతున్నపుడు, జ్ఞానకాంతులీనే ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ జైల్లో వుండటమే న్యాయం కదా" అంటాడు. జర్నలిజం, కవిత్వం, సాహిత్యం, సంగీతం, సినిమా, రాజకీయాలు, చరిత్ర.. దేని గురించి అయినా హృదయాన్ని హత్తుకునేలా చివరి వాక్యం దాకా చదివించేలా రాయగల

జర్నలిజం, కవిత్వం, సాహిత్యం, సంగీతం, సినిమా, రాజకీయాలు, చరిత్ర.. దేని గురించి అయినా హృదయాన్ని హత్తుకునేలా చివరి వాక్యం దాకా చదివించేలా రాయగలగడం సామాన్య విషయం కాదు. సున్నితమైన, కవితాత్మకమైన ప్రకాష్ వచనం చదువుకోవడం ఒక మంచి అనుభవం. అందులోని వ్యంగ్యమూ, ఎకసెక్కమూ గిలిగింతలు పెడతాయి.

గడం సామాన్య విషయం కాదు. సున్నితమైన, కవితాత్మకమైన ప్రకాష్ వచనం చదువుకోవడం ఒక మంచి అనుభవం. అందులోని వ్యంగ్యమూ, ఎకసెక్కమూ గిలిగింతలు పెడతాయి.

'ఉదాత్తమైన అక్రమ ప్రేమ' అనే శీర్షికతో జాతీయ, అంతర్జాతీయ సినిమాల గురించి ఒక సిరీస్ రాశాడు. భూమిక, పరోమా, ఆస్తా, సమ్మర్ ఆఫ్ 42, శోభ– బాలూ మహేంద్ర ఎఫైర్ గురించిన వ్యాసాలు చదివి తీరవలసినవి. పెళ్లయిన స్త్రీ మరొకతనితో ప్రేమలో పడడం అనేది వీటి థీమ్. ఇందులో భాగంగానే నటి ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ భర్త, గ్రేట్ ఇటాలియన్ డైరెక్టర్ రోబర్టో రోసాలిని, బెంగాలీ బ్యూటీ సోనాలి ప్రేమకథ తెలుగులో మొదటిసారి రాసింది ప్రకాష్ మాత్రమే. అలాగే, చేగువేరాని పాతిపెట్టిన ప్రాంతాన్ని 30ఏళ్ల తర్వాత డిస్కవర్ చేసిన ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్టు జాన్ లీ ఆండర్సన్ గురించి మొదటిసారి మనకి తెలియజేసిన వాడూ ఈ ఉత్తమ జర్నలిస్టే.

తెలుగు సాహిత్యంలో కె.ఎన్.వై పతంజలి ప్రాధాన్యం గురించీ, తెలుగు కళకి ఆర్టిస్ట్ మోహన్ కాంట్రిబ్యూషన్ గురించీ, తెలుగు సాహిత్య విమర్శని పదును పెట్టిన రాచమల్లు రామచంద్రారెడ్డి కృషి గురించీ ప్రకాష్ వ్యాసాలు మళ్లీ మళ్లీ చదువుకునేలా వుంటాయి. సొలోమోన్ విజయ్ కుమార్ 'మునికాంత పల్లె కథలు' చదివి, "ఏం రాశావ్ రా నా కొడకా" అని ప్రకాష్ దురుసుగా అనడం సంప్రదాయ పద్ధతిని బద్దలుకొట్టడానికే. 'నల్ల వంతెన' కథలు రాసిన నాగేంద్ర కాశీని, 'మైరావణ' రాసిన యువ రచయిత ప్రసాద్ సూరినీ భుజం తట్టి ప్రోత్సహించడం ప్రకాష్ ఎంతో బాధ్యతతో చేసిన పని. 'సాహిత్యంలో స్త్రీ సాహసం' అంటూ ఇప్పటి రచయిత్రుల గురించిన వ్యాసం – ప్రకాష్ ఇప్పటికీ విస్తృతంగా చదువుతున్నాడనడానికి ఒక నిదర్శనం.



'అనుభూతి గీతమై విరబూసిన వెన్నెల' అంటూ ఖదీర్ బాబు జ్ఞాపకాలకు ప్రకాష్ రాసిన ముందుమాట దాదాపు కవిత్వమే. చేరా, మద్దుకూరి చంద్రం, వేగుంట మోహన్ ప్రసాద్ గురించి రాసినా, అరుణ్ సాగర్, కలేకూరి ప్రసాద్, పైడి తెరేష్ బాబు గురించి రాసినా ఆప్యాయత నిండిన ఆ అక్షరాల్లో ఒక ప్రత్యేక ఆకర్షణ వుంటుంది. విశ్వనాథ, పెద్దిభొట్ల, బంగోరె, కేశవరెడ్డి, గుడిహాళం రఘునాథం లాంటి మహానుభావుల గురించి ప్రకాష్ గాఢమైన అనుభూతితో, ఒక ఉద్వేగంతో రాసే మాటలు కంటతడి పెట్టిస్తాయి.

జర్నలిస్టుగా ప్రకాష్ 40 ఏళ్ల అనుభవాలూ, జ్ఞాపకాలతో మూడేళ్ల క్రితం వచ్చిన 'ఏలూరురోడ్ ఆత్మగీతం' పుస్తకం జనాదరణ పొందింది. ప్రకాష్ వ్యాసాలతో రెండో పుస్తకం 'ఖైరతాబాద్ చౌరస్తా' త్వరలోనే రాబోతోంది. సొంత గొంతు వున్న గొప్ప రచయిత కె.ఎన్.వై పతంజలి లిటరరీ అవార్డును ఇటీవల ప్రకాష్ స్వీకరించిన సందర్భంగా "ప్రకాష్ ఈ కాలపు పతంజలి" అన్నారొక సాహితీవేత్త. నిజమేనేమో!

■ కూనపరాజు కుమార్
✆ 99899 99599

ఈ కవి యుద్ధభూమిలో సంచరించే పిల్లాడు

ప్రపంచంలోని ఎన్నో చారిత్రక యుద్ధాలు మొదలు నేటి కశ్మీర్ అంతర్యుద్ధం, మణిపూర్ అల్లర్లు, కగార్ అణచివేతలని చూసినప్పుడు రాజ్యం అధికార దుర్వినియోగం, సైనిక ప్రాబల్యం వంటివి స్పష్టంగా తెలిసివస్తాయి. ఈ కవిత కూడా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాష్టీకాల్ని తీవ్రంగా నిరసిస్తూ రాసినది. శైశవంలోనే ముగిసిపోతున్న జీవితాలకు గాజాలో దొరికే పిల్లల అస్థిపంజరాలే సాక్ష్యం అంటాడు కవి. వాటినన్నా కౌగిలించుకోండని అసహన పడతాడు. అందులో అధిక్షేపంతో కూడిన గొప్ప వాస్తవిక సంయమనం కనిపిస్తుంది.



యుద్ధ ప్రాంతంలో అమ్మలు పెట్టే తీయటి ముద్దుల ఆనవాళ్ళు లేవని, పిల్లల నోటి దగ్గరి రొట్టెలను బాంబులు లాక్కుంటున్నాయనీ కవి ఒక హృదయవిదారకతను మనకి సాదృశ్యం చేస్తాడు. తీవ్రమైన వేదన, భరింపరాని క్షోభల స్థిర రూపం ఎవ్వరినైనా కలచివేస్తుంది. కానీ ఆ కలవరం వెనుక గల నిస్సహాయత, దుఃఖం, దైన్యత కవిత్వపాదాల్లోకి జొరబడినప్పుడు వాటి పదును చాలా కాలం మనని ఛిద్రం చేస్తుంది. ఆ రకంగా ఒక విసురు ఉన్న కవిత. విల్‌ఫ్రెడ్ ఓవెన్, డబ్ల్యూ.బి. యీట్స్ వంటి పాశ్చాత్యులతో బాటు తిలక్, శివసాగర్, వరవరరావు, ఎండ్లూరి సుధాకర్ లాంటి తెలుగు కవుల కవితల్లో కూడా అవకాశవాద యుద్ధాలలో ఉండే స్వార్థం, క్రౌర్యం, విధ్వంసాల గురించి మనం చదివి ఉన్నాం. చరణ్ కవిత్వ నిర్మాణంలో కాల్పనిక అతిరేకత లేదు. స్మృతుల తలపోత, ప్రతిఫలం కోరని మాతృ త్యాగం, ఉపమానాలుగా ఉన్నాయి. తల్లి స్పర్శ, లాలనలతో ముడిపడి ఉన్న పిల్లల భావోద్వేగాలతోనే యుద్ధాన్ని వ్యతిరేకించడం ఈ కవితలోని అంతర్ధ్వని. తల్లీబిడ్డల వాచక వ్యక్తీకరణల వెనుక దేశం, ఆ దేశ ప్రజల అస్థిరత, అనేక విషాద శకలాలుగా ప్రతిబింబిస్తుంది. అపరాధ భావనే లేని ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాల కపట, దోపిడీ మనస్తత్వాలు బోధపడతాయి. అందుకే ఈ కవితలో అంతర్లీనంగా ఒక చారిత్రక ఎరుక ఉంది. అది రాజకీయంగా కాల పరీక్షకు నిలబడుతుంది. మెత్తదనం, అమాయకత్వం, సంవేదనలతోనే శత్రువులపై చరణ్ తిరగబడుతున్నాడు. అతని ప్రతిఘటనలో ఒక లేలేత పసిదనంతో కూడిన హేతువు కందని మానవ ప్రేమ ఉంది. దాని సహజమైన మెరుపు వలనే నా ఇది ప్రియపద్యం.

■ శ్రీరామ్ పుప్పాల
✆ 99634 82597

ప్రియ పద్యం

సాక్ష్యాన్ని కౌగిలించుకోండి

అమ్మను పిలవడానికి, పాలు తాగడానికీ
పెదవులు లేవు
నవ్వులనూ లాలిపాటలనూ వినడానికి
చెవులు లేవు
కాసింత ప్రేమ శ్వాసను పీల్చడానికి
దేహంలో జీవం లేదు

బాంబు పొగలో చర్మం ఆవిరై
దేహం ఛిన్నాభిన్నమై నేను దొరికితే
మా అమ్మ పెట్టిన ముద్దుల ఆనవాళ్ళు
కనిపించడం లేదని గుర్తు చేయకండి
అమ్మ వొడిలో వాల్చిన తల
ఇప్పుడు నా దేహానికి లేదని
గుర్తు చేయకండి



+++


మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి
చూడ్డానికి కళ్ళు లేవు
స్పర్శించడానికి చేతుల్లేవు
ఆమె అడుగుల్లో అడుగేసి నడవటానికి
కాళ్ళు లేవు
మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి
నా కోసం పరిగెత్తుకుంటూ వస్తుందని నాతో చెప్పకండి
దోగాడుతూ ఎదురెళ్ళటానికి
నేనిప్పుడు పసిపాపను కాదు
మాంసం ముద్దనూ కాదు
ఒట్టి బొక్కల చూరను

మా అమ్మింకా బ్రతికే ఉందని గుర్తు చేయకండి
మళ్ళీ నా పేరును నాకే గుర్తు చేయకండి
చనిపోయిన నాతోటి పసిపిల్లల పేర్లను గుర్తు చేయకండి
ఇది బాల్యానికి చోటులేని దేశమని గుర్తు చేయకండి
రొట్టెముక్కలను బాంబులు లాక్కుంటాయని గుర్తు చేయకండి
అస్థిపంజరం అనే పేరుగాంచిన బొక్కలగూడు మాత్రమే నేను

+++

కూల్చబడ్డ ఆసుపత్రి గోడల కింద
నేను అస్థిపంజరమై దొరికితే
నన్ను కౌగిలించుకోవడానికి నిరాకరించకండి
మరణించిన మానవీయతకు
బాల్యాన్ని రుచి చూడని ఈ అస్థిపంజరాలే సాక్ష్యం
సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!
మనసారా సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!

■ దొంతం చరణ్



ఉగాది ఉత్సవం



చైత్రమాస వసంత నవరాత్రుల ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో సీఎం చంద్రబాబు



దుర్గగుడిలో దక్షిణోత్తర నృత్య ప్రదర్శన

శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని దుర్గమ్మ పుష్పార్చనలు ప్రారంభమయ్యాయి. తొలి రోజున మల్లెలు, మరువంతో లలితా సహస్రనామాన్ని పారాయణ చేస్తూ అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం వెండి రథంపై గంగాపార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు భక్తిపారవశ్యంతో సాగింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల ప్రముఖులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున హంస పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుతో కలిసి వేడుకలను తిలకించారు.

6లో



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రులు దుర్గేష్, పార్థసారథి, రాం నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బొండా ఉమా, బుద్ధప్రసాద్, సీఎస్ విజయానంద్ తదితరులు

కరకష్టం

రామలింగేశ్వరనగర్ కరకట్టకు ప్రమాదం!

యథేచ్ఛగా ఇసుక లోడ్‌తో టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలు

శ్మశానం కూడలి నుంచి ఇస్కాన్ ఆలయం వరకు కుంగిన రోడ్డు



రామలింగేశ్వరనగర్ కట్టపై అధిక లోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్

టిప్పర్ వెనుక టిప్పర్. ట్రాక్టర్ వెనుక ట్రాక్టర్. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి. చూస్తుంటే టిప్పర్లు, ట్రాక్టర్ల ర్యాలీ జరుగుతుందా అనిపిస్తోంది. ఇదీ రామలింగేశ్వరనగర్ కరకట్టపై నిత్యం కనిపిస్తున్న పరిస్థితి. కృష్ణా జిల్లా నుంచి అడ్డూ అదుపు లేకుండా వస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లు కరకట్టను కుంగదీస్తున్నాయి. వాహనదారులను ప్రమాదాల బారిన పడేస్తున్నాయి. రెండు జిల్లాల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, కృష్ణాజిల్లా అధికారులు మచిలీపట్నం వరకే పరిమితం కావడంతో సరిహద్దుల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. విశ్రాంతి లేకుండా పగలు, రాత్రి నిర్విరామంగా ఇసుకను తరలించేస్తున్నారు. దీంతో కరకట్ట కుంగుతోంది. నిత్యం కరకట్ట మీద నుంచి 40-60 టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన బరువుతో తిరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

- రహదారిపై జారిపడి పోతున్న ఇసుక
- అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు
- పట్టించుకోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు



రోడ్డుపై ప్రమాదకరంగా ఇసుక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లాలో రొయ్యూరు, మద్దూరు, చోడవరం గ్రామాల్లో కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లు ఇసుకను గుంటూరు జిల్లాలోకి తరలిస్తున్నారు. ఈ రీచ్‌ల నుంచి ఇసుక లోడుతో వెళ్లే వాహనాలకు కరకట్టపై ప్రవేశం లేదు. అయినా ఈ నిబంధనను ఉల్లంఘించి టిప్పర్ల యజమానులు అధిక లోడుతో వాటిని కరకట్టపై తిప్పుతున్నారు. వాస్తవానికి ఈ టిప్పర్లు, ట్రాక్టర్లు బందరు రోడ్డు మీద నుంచి జాతీయ రహదారి మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. దీనివల్ల డీజిల్ ఎక్కువగా ఖర్చవుతుంది. అదే అవనిగడ్డ కరకట్ట మీద నుంచి రాకపోకలు సాగిస్తే నేరుగా విజయవాడ స్క్రూబ్రిడ్జి వద్ద జాతీయ రహదారి ఎక్కవచ్చు. జాతీయ రహదారి చేరుకోవడానికి ఇది దగ్గర మార్గం. అవనిగడ్డ కరకట్టపై అవనిగడ్డ వైపు

మిగతా 6లో..

టోల్‌గేట్‌లా మారిన ట్రాఫిక్ బూత్

ఇసుక రీచ్‌ల నుంచి మితిమీరిన సామర్థ్యంతో టిప్పర్లు తిరుగుతున్నా కృష్ణాజిల్లా రవాణా శాఖ అధికారులు తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి వాహనాల సామర్థ్యం, అందులో వేయాల్సిన లోడ్ సామర్థ్యాన్ని పరిశీలించే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. కరకట్టను కుంగదీస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నా ఇప్పటి వరకు అక్కడి రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. చోడవరం వైపు నుంచి వస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లకు స్క్రూబ్రిడ్జి వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్ మినీ టోల్‌ప్లాజాలా మారింది. అవనిగడ్డ కరకట్ట వైపు నుంచి గుంటూరు వైపు జాతీయ రహదారి మీదకు వచ్చే ప్రతి టిప్పరు, ట్రాక్టరు ఇస్కాన్ టెంపుల్ దాటిన తర్వాత ట్రాఫిక్ బూత్ ఎదురుగా ఆగిపోతాయి. వాటిలో నుంచి డ్రైవర్లు దిగి నేరుగా బూత్‌లోకి వెళ్తారు. నిమిషాల వ్యవధిలో వెనక్కి వచ్చి జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతారు. ఈ నిమిషాల వ్యవధిలో బూత్‌లో ఏం జరిగిందన్నది టిప్పర్ల డ్రైవర్లు, పోలీసులకు మాత్రమే తెలుసు.

బెట్టింగ్ కింగ్ ఎక్కడ?

పీపీ కోసం విస్తృతంగా గాలింపు



ఐదుగురికి 41ఏ నోటీసులు జారీ చేసిన పోలీసులు

- ఈ బెట్టింగ్ బాగోతంలో పెరగనున్న నిందితుల సంఖ్య

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అవనిగడ్డ కేంద్రంగా విజయవాడ నుంచి బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేసులో ప్రధాన నిందితుడు ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్ కుమార్, చెన్నా గోపయ్య స్వామి, కమ్మిలి వెంకటరమణ, కోట నాగేశ్వరరావు, కృష్ణలంకకు చెందిన ఉమామహేశ్వరరావుకు పటమట పోలీసులు ఆదివారం 41ఏ నోటీసులు ఇచ్చారు. వారి ఖాతాల్లో ఉన్న రూ.48లక్షల లావాదేవీలపై పోలీసులు కూపీలాగుతున్నారు. ఈ ఐదుగురితో ప్రసాద్ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ప్రసాద్ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని ఉన్నాడు. నిందితుల సెల్‌ఫోన్లను సీజ్ చేసి సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. నిందితులు పార్కర్ ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా పందేలు నిర్వహిస్తున్నట్టు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ యాప్‌లో యూజర్ ఐడీ, లాగిన్ పాస్‌వర్డ్‌లు తెలుసుకుని ఎంతమంది ఇందులో ఉన్నారన్న విషయాన్ని నిగ్గు తేల్చబోతున్నారు. నిందితుల బ్యాంక్ ఖాతాల వివరాలను తెలుసుకుని ఇప్పటి వరకు లావాదేవీలపై విచారణ చేస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ ఖాతాల్లో లావాదేవీలు జరిగాయన్న దానిపై కూపీ లాగుతున్నారు. ఈ బెట్టింగ్ బాగోతంలో మరో పది మంది వరకు నిందితుల సంఖ్య తేలే అవకాశం ఉందని తెలుస్తోంది.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



కస్తూరి గోపి (ఫైల్)

వత్సవాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్త వేమవరం గ్రామానికి చెందిన కస్తూరి గోపి (35) గ్రామంలో నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వడ్డీకి డబ్బు తెచ్చి నాలుగేళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. వరుసగా నష్టాలు రావడంతో పాటు ఈ ఏడాది మిర్చికి తెగుళ్ల కారణంగా దిగుబడులు రాలేదు. అప్పులు ఎలా తీర్చాలనే దానిపై వారం రోజులుగా భార్యతో చర్చిస్తున్న గోపి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు వత్సవాయిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి జగ్గయ్యపేటలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో ఎస్సై ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● జనపంజా



రంజాన్ పండుగను పురస్కరించుకుని పంజా సెంటర్‌కు ఆదివారం రాత్రి ముస్లింలు పోటెత్తారు. పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో దుకాణాలు కిటకిటలాడాయి. బిర్యానీ హోటళ్లు, హలీం సెంటర్లు ఆహార ప్రియులతో సందడిగా కనిపించాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 06-20
(సోమవారం సాయంత్రం)

చెత్త పంచాయితీ!

కార్పొరేషన్ వర్సెస్ ఏఎన్ఎం

ఏఎన్ఎంలకు చెత్త సేకరణ పర్యవేక్షణ బాధ్యతలు

- ఇప్పటికే రెవెన్యూ పరిధిలో పన్ను వసూళ్ల బాధ్యతలు అప్పగింత
- కార్పొరేషన్ నిర్వాకంపై కలెక్టర్‌ను కలిసిన ఏఎన్ఎంలు
- సానుకూల స్పందన రాకపోవటంతో ఆందోళన

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, ఏఎన్ఎంల మధ్య కొద్ది రోజులుగా 'చెత్త' పంచాయితీ నడుస్తోంది. ప్రజారోగ్యం విధులతోనే సతమతమవుతున్న వారిపై చెత్త సేకరణ పర్యవేక్షణ బాధ్యతలు, రెవెన్యూ పరిధిలోని పన్ను వసూళ్ల బాధ్యతలు మోపటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజారోగ్య పరిరక్షణకు ఒక వైపు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంటే మరో వైపు ఆ లక్ష్యానికి విరుద్ధంగా కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు. ఇన్ని రకాల పనులు తమ వల్ల కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కలెక్టర్‌ను కలిసినా తమకు న్యాయం జరగలేదని వాపోతున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రజారోగ్యానికి సంబంధించిన విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎంలను విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) 'చెత్త' పనులకు ఉపయోగించటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రజారోగ్యానికి ఒక పక్క ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంటే.. మరోపక్క ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన ఏఎన్ఎంలతో కార్పొరేషన్ అధికారులు ఆడుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర పరిధిలో ప్రజారోగ్యాన్ని మెరుగు పరిచేందుకు విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎంలకు చెత్త సేకరణ పర్యవేక్షణ విధులను అప్పగిస్తున్నారు. ఒక్క చెత్తే కాదు .. రెవెన్యూ విభాగం పరిధిలోని అన్ని రకాల పన్ను వసూళ్ల బాధ్యతలను కూడా మోపారు. ఇవి కాకుండా మరో 10 రకాల కొత్త బాధ్యతలను అప్పగించారు. ఇవన్నీ కూడా ఏఎన్ఎంలుగా వారు చేస్తున్న స్వభావ

మిగతా 6లో..

ఏఎన్ఎంల రోజువారీ విధులే చాలా కష్టం!

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతిరోజూ మొత్తం 31 రకాల విధులను ఏఎన్ఎంలు నిర్వహించాల్సి ఉంటుంది. సచివాలయాల పరిధిలో గర్భిణులను గుర్తించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన చికిత్సకు దోహదపడాలి. రక్తహీనత పరీక్షలు, ప్రభుత్వ హాస్పిటల్‌లో డెలివరీ చేయించటం వంటివి క్రమం తప్పకుండా చేయాలి. ఇవి కాకుండా పీహెచ్‌సీల నుంచి వివిధ రకాల వ్యాక్సిన్లను తీసుకుని పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఆ బిడ్డకు 16 సంవత్సరాలు వచ్చే వరకు ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే విధులు నిర్వహించాల్సి ఉంది. ఫ్యామిలీ ప్లానింగ్, ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవటం, తల్లీ బిడ్డలను కాపాడటం వంటివి చేయాల్సి ఉంటుంది. ఇవి కాకుండా ఏఎన్ఎంలు రోజువారీగా యూ - విన్, ఆర్‌సీహెచ్, అన్మోల్, హెచ్ఎంఐఎస్, ఐహెచ్ఎంపీ, ఏఎంబీ, వెక్టార్ హైజీన్, ఎన్టీఆర్ వైద్యసేవ, ఫ్రైడే డ్రైడే, గర్భవతులకు ఆర్‌సీహెచ్ ఐడీ, బర్త్ ప్లానింగ్, ఎఫ్‌డీపీ, ఎన్‌సీడీసీడీ 3.0, ఆర్‌బీఎస్‌కే, వీహెచ్ఎన్‌డీ, వీహెచ్ఎస్ఎన్‌సీ, టీబీ కేసులు, లెప్రసీ కేసులు, నెల వారీ రిపోర్టులు, అభా ఐడీలను రూపొందించటం, పీఎంజేఏవై వంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది.

తిరువూరులో వేడెక్కిన రాజకీయం

మున్సిపాల్టీలో అధికార వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు

- మరో వైపు ఎమ్మెల్యే, ఏఎంసీ మాజీ చైర్మన్ మధ్య రగడ
- ఈ పరిణామాలు దేనికి దారితీస్తాయోనని సర్వత్రా ఉత్కంఠ

(తిరువూరు-ఆంధ్రజ్యోతి):తిరువూరు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. వైసీపీలో అధికార కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు, టీడీపీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల నడుమ గొడవ పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇటీవల స్థానిక మున్సిపాల్టీలో అధికార వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు తాడేపల్లి ప్యాలెస్ వరకు వెళ్లి కొద్దిగా సద్దుమణిగినట్లు కనిపిస్తున్నా.. అంతర్గతంగా మాత్రం పోరు కొనసాగుతున్నట్లే వాతావరణం కనిపిస్తోంది. ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామాకు సిద్ధమైనా పార్టీకి చెందిన మరొకరు చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడంపై పట్టణ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గానికి ఒక్క సంవత్సరం మాత్రమే పదవీకాలం ఉంది. ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చేసినా మరొకర్ని ఎన్నుకునేందుకు నిబంధనల ప్రకారం సుమారు ఆరు నెలలు సమయం పడుతుందని, ఈలోగా ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికలు ప్రకటిస్తే ప్రస్తుత బోర్డు పదవీ కాలం నాలుగు సంవత్సరాలకే పరిమితం అవుతుందని మరి కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు అంశం పట్టణ వైసీపీ అధ్యక్షుడు ఎంపికకు ముడిపడి ఉండటంతో ఆ పార్టీ నాయకులు ఎన్ని జాగ్రత్తలు

మిగతా 6లో..



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

దుర్గగుడిలో ఘనంగా ఉగాది ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఆదివారం వేకువ జామున మూడు గంటలకు సుప్రభాత సేవ అనంతరం అమ్మవారికి స్నపన కార్యక్రమాలు నిర్వహించారు. శరన్నవరాత్రులు, చైత్రమాస నవ రాత్రులు, శాకంబరీ ఉత్సవాలు, పవిత్రోత్సవాలు తదితర ముఖ్యమైన సందర్భాలలో మాత్రమే అమ్మవారికి స్నపన చేయిస్తారు. ఈక్రమంలో ఆదివారం వేదమంత్రాల మధ్య అమ్మవారికి స్నపన కార్యక్రమం పూర్తిచేసి ప్రత్యేకమైన లేపనాల ద్వారా అమ్మవారిని అలంకరించారు. అర్చన, హారతులు ముగిసిన తరువాత భక్తులు అమ్మవారి దివ్యముఖారవిందాన్ని తిలకించి తన్మయులయ్యారు. తెలుగు సంవత్సరం తొలిరోజున అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నవి ్మక.

ఉదయం 9 గంటలకు నటరాజస్వామి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా మందిరంలో చైత్రమాస పుష్పార్చనలు ప్రారంభమయ్యాయి. తొలిరోజున మల్లెలు, మరువంతో లలితా సహస్రనామాన్ని పారాయణ చేస్తూ అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. వేసవి సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



రాజ్యపాలన బాగు బాగు..

- చల్లా శ్రీనివాసశర్మ

ఆలయంలో ఉగాది పంచాంగ పఠన కార్యక్రమాన్ని ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాస శర్మ పంచాంగ చేశారు. రాజు సూర్యుడు కావటంతో రాజ్యపాలన బాగుంటుందని తెలిపారు. దేవాలయాలు అభివృద్ధి చెందుతాయని, అన్నిరాశుల వారికి బాగుంటుందని, పరిపాలకులు ప్రజా సంక్షేమానికి పాటుపడతారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయన్నారు. ధనధాన్య సమృద్ధితో ప్రజలు ముందుకు వెళతారన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. గురుడు మూడు స్థానాల్లో ఉండటం వల్ల కొంత ఇబ్బందిగా ఉంటుందని, అయితే దుర్గమ్మ దర్శనం, చండీయాగం తదితరాలను చేయించటం ద్వారా పరిస్థితులు బాగుంటాయని చెప్పారు. ఈవో కె.రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పుష్పార్చన కార్యక్రమాల్లో అమ్మవారికి హారతి సమర్పించి ప్రారంభించారు. ఉగాది సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, పంచాంగాలను ఆయనకు అందజేశారు.

వెండిరథంపై ఊరేగిన గంగ, పార్వతీ మల్లేశ్వరులు

ఇంద్రకీలాద్రిపై చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం వెండి రథంపై గంగ, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు భక్తిపారవశ్యంతో సాగింది. ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సతీసమేతంగా కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. బ్రాహ్మణవీధి మీదుగా వన్‌టౌన్ పురవీధుల్లో రథోత్సవం సాగింది. భక్తులు దేవేరుల రథానికి స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు, పండ్లు సమర్పించారు.



ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది వేడుకలు

» ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, ముఖ్యమంత్రి చంద్రబాబు


» ఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్ సెంటర్, ఫార్మా తయారీ ల్యాబ్‌లను ప్రారంభించిన సీఎం

గన్నవరం/ఉంగుటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, స్వర్ణభారత్‌ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ట్రస్ట్ ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలులు ఘటించారు. అనంతరం ముప్పవరపు ఫౌండేషన్ సందర్శించిన సీఎం అక్కడ అందిస్తున్న కోర్సుల గురించి ట్రస్ట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అబ్దుల్‌కలాం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రాంగణంలోని మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. సువెన్ ఫార్మా, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ సహకారంతో ఇటీవల ట్రస్ట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్ సెంటర్, ఫార్మా తయారీ ల్యాబ్‌లను సీఎం ప్రారంభించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో ముచ్చటించారు.

ముందుగా ట్రస్టు కార్యాకలాపాలను మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ వివరించారు. 1.75లక్షల మంది యువతీయువకులకు శిక్షణ ఇచ్చామని, 50శాతం మంది స్వయం ఉపాధి సాధించారన్నారు. 5.50 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అందించామన్నారు. ఫౌండేషన్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వి.బాలశౌరి, మంత్రి రవీంద్ర, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనాచౌదరి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్, ట్రస్ట్ ప్రతినిధులు చుక్కపల్లి ప్రసాద్, మండవ ప్రభాకర్, రాజయ్య, గ్రంధి శ్రీనివాస్, పి.పరదేశి, సువెన్ ఫార్మా ప్రతినిధి పీఎస్ఎన్.మూర్తి, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ వైస్ ప్రెసిడెంట్ అన్షుల్ సక్సేనా, సౌత్‌హెడ్ అమరేంద్రబాబు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధుల సమన్వయంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో తదితర ఉన్నతాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు



పచ్చడి, పంచాంగం పద్యం కలిపితే ఉగాది

- గరికపాటి నరసింహారావు

గన్నవరం : ఆశావాదమే ఉగాది అని ఉపన్యాసకులు గరికపాటి నరసింహారావు ఉద్ఘాటించారు. పచ్చడి, పంచాంగం, పద్యం కలిపితేనే ఉగాది, అవుతుందన్నారు. దేవుడు లేని పండుగా ఏదైనా ఉందంటే అది ఉగాది. ఉగాది నాడు ఏ దేవుడినైన పూజించవచ్చు. ఆరు రుచులను తీసుకుంటేనే జీవితం సాఫీగా సాగుతుందని గరికపాటి పేర్కొన్నారు. ఉగాది ప్రశస్తి ప్రసంగంలో గరికపాటి మాట్లాడుతూ మనస్థితి, పరిస్థితి, గ్రహస్థితిపై జీవితాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాలం చక్రం లాంటిదని తిరిగి మళ్లీ అదే స్థితికి వస్తుందన్నారు. భారతీయ వైభవం నిచ్చెనలాంటిది కాదని, చక్రం వంటిదన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన పేర్లు వారసులకు పెడుతున్నారని, గతంలో పూర్వీకుల పేర్లు పెట్టి వారిలో పెద్దలను చూసుకునే వారని చెప్పారు. వారి ఆదర్శాలు, సాంప్రదాయాలు పిల్లలకు అలవాటు చేసేవారని నేటి పరిస్థితి అలా లేదని చెప్పారు. తెలుగు ఎంతో గొప్పదని చెప్పారు. అమ్మ, ఆవు, ఇల్లు, ఈశ్వరుడు మంచి అర్థాలను ఇస్తాయన్నారు. హిందూ జీవన విధానంలో ఈ నాలుగింటికి సమాధానం చెప్పకపోతే ఆ పురుషుడు భారతీయుడు కాదని చెప్పారు. ఎప్పుడు నవ్వుతూ ఉండటమే మనిషికి నిజమైన గోల్ అని చెప్పారు. పరమమైన అర్థం తెలుసుకుంటే గాని జీవితం అర్థం కాదన్నారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఒక ధర్మం ఉందని దానిని ఇద్దరు పాటించటం లేదన్నారు. ప్రతి రూపాయి పాపాల పుట్టలో నుంచి కాకుండా, పాల సముద్రంలో నుంచి రావాలన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అంటే అందరి ఇళ్లల్లో బంగారం నిండి ఉంటుందన్నారు. ఆత్మ విశ్వాసం ముఖ్యమని దానితో ముందుకు వెలితే విజయం తధ్యమన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా దక్షిణోత్తర నృత్య ప్రదర్శన





ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దక్షిణోత్తరం (దక్షిణ భారత), ఉత్తర (ఉత్తర భారత) సంప్రదాయాల సామరస్యపూర్వకమైన కలయికతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలు నిరుపమ, రాజేంద్ర శిష్య బృందం భరతనాట్యం, కథక్ నృత్య ప్రదర్శన చేశారు. రాజగోపురం ప్రాంగణంలో ఈవో కె.రామచంద్రమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాచీన హిందూ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు తెలియజెప్పే బాధ్యత అందరిది అని ప్రకటించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా గుడి సంబరాలు పేరిట ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు పరంపర ఫౌండేషన్ బాధ్యులు శ్రీనగి, శశిరెడ్డి, ప్రమోద్‌లు తెలిపారు. పరంపర ఫౌండేషన్ రూపొందించిన కళావేదిక పై ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగాది సందర్భంగా పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు కళా ప్రదర్శనను తిలకించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకట రంగ సాయి కుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాశిఫలాలు వివరించారు. కొత్త తెలుగు సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, సిరి సంపదలతో కొత్త వెలుగులు నిండాలంటూ వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. వేడుకల్లో పాల్గొన్న డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ, విశ్వావసు నామ సంవత్సరంలో కలెక్టర్ లక్ష్మీశ సారధ్యంలో జిల్లా అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి చెందాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆనందంగా వుండాలని కోరుకొంటున్నట్టు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా వేద పండితులు వెంకట రంగ సాయికుమార్ శర్మతో పాటు దాములూరి అప్పయ్యశర్మ, వేదాంతం అజయ్‌కుమార్, తూములూరి కృష్ణమూర్తి, దుర్భాకుల సాంబమూర్తి అవధానిలను సత్కరించారు.



పండితులను సత్కరిస్తున్న డీఆర్ఎం లక్ష్మీనరసింహం



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న, ఉగాది పురస్కారాలు అందుకుంటున్న (ఎడమ నుంచి వరుసగా) గుత్తికొండ సుబ్బారావు, కార్టూనిస్టు టీవీ, అంకబాబు, కుమార సూర్యనారాయణ, ఓలేటి పార్వతీశం, వేమూరి బలరాం, చింతా రవిబాలకృష్ణ, భాగవతుల సామ్య, మల్లాది బ్రదర్స్, కోమటి జయరాం, చలపాక ప్రకాష్, బండ్ల మాధవరావు, కొల్లూరి, కలిమిశ్రీ, వేంపల్లి షరీఫ్, గోళ్ల వాణి, ప్రసాద్, దూపాటి శ్రీదేవి, కృత్తివెన్ను శ్రీనివాసరావు, మొండెపు ప్రసాద్, ఉమామహేశ్వరపాత్రుడు, పోపూరి గౌరీనాథ్, రాజేష్



సంస్థ ఉద్యోగులకు దుస్తులు అందజేస్తున్న ఉప్పలపాటి ఉదయభాస్కరరాజు

'రైజ్ ఎన్ రైజ్'లో ఉత్సాహంగా..

పాయకాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ రైజ్ ఎన్ రైజ్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కరరాజు ఆంధ్రప్రభ కాలనీలోని కార్యాలయంలో ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఉద్యోగులు 150 మందికి దుస్తులు, చీరలు అందజేశారు. కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఉగాదిని పురస్కరించుకుని సుందరయ్యనగర్ ప్రాంతంలో ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, పరుగుపందెం నిర్వహించారు. విజేతలకు వెండి పట్టీలు, డ్రస్సింగ్ టేబుల్, ప్రెషర్ కుక్కర్ అందజేశారు. సంస్థ డైరక్టర్లు ఎన్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవీవీ. కృష్ణారావు, టి.రాజు పాల్గొన్నారు.

వేడుకగా ఉగాది పురస్కారాల ప్రదానం

విజయవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవం విజయవాడ తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పల్లె సంప్రదాయాన్ని ప్రతిబింబించే తెలుగు లోగిలి, ఉగాది పచ్చడి విందు, పంచాంగ శ్రవణం, కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, సంప్రదాయ వస్త్రధారణలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల కోలాహలం, ప్రభుత్వ అధినేత ప్రసంగం, ప్రముఖులకు పురస్కారాల ప్రదానం మేళవించి ఉగాది మహోత్సవం ఘనంగా జరిగింది. వేదికపై నాట్యాచార్య సప్పా శివకుమార్ బృందం ప్రదర్శించిన స్వాగతం సుస్వాగతం, ఉగాది పండుగ విశిష్టత, అమరావతి వైభవం నాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాట్యాచారిని పద్మశ్రీ హేమంత్ బృందం, యువ నర్తకి లేఖ్యా భరణి ప్రదర్శించిన కాలభైరవాష్టకం, యల్లాజోస్యుల అనురాధ బృందం ప్రదర్శించిన చందన చర్చిత, శైలజ శ్రీ బృందం జతి స్వర నాట్యాలు, స్వర్ణలత ప్రదర్శించిన జయము జయము అంశాలు కనువిందు చేశాయి.

ఆకట్టుకున్న వేదిక

ఉగాది మహోత్సవాల వేదికను తెలుగు లోగిలిగా, పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా తీర్చిదిద్దారు. అలనాటి పెంకుటిల్లు, దాని పక్కనే బావి, ఇంటికి ఇరువైపులా రెండు మామిడి చెట్లు, రచ్చబండ, దానిపై పంచాంగ శ్రవణం చేసే పండితుడు ఇలా ఉగాది వేదిక ఆకట్టుకుంది.

సమన్వయలోపం

దేవదాయ, సాంస్కృతిక శాఖల సంయుక్తంగా నిర్వహించిన ఉత్సవంలో సమన్వయలోపం కనిపించింది. అతిథులను, పురస్కార గ్రహీతలను ఆహ్వానిస్తూ, వారికి కేటాయించిన సీట్ల బాధ్యతను సాంస్కృతిక శాఖ స్వీకరించింది. పురస్కార గ్రహీతలను సరిగా రిసీవ్ చేయలేకపోవడంతో పలువురు ప్రముఖులు అసహనం వ్యక్తం చేశారు. వేదికపై థర్మకోల్ షీటుతో ఉగాది సంబరాలు 2025 పేరిట అతికించిన పేరులో 2 అంకె ఊడి నృత్య ప్రదర్శన సమయంలో కింద పడిపోయింది. సభ ఆటంకం కలుగుతుందని మిగిలిన అంకెలను తొలగించారు.

హాజరైన ప్రముఖులు

ఉగాది సంబరాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి, పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధప్రసాద్, గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, సృజనాత్మక-సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పి.తేజస్విని, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబు కళారత్న 83 మందికి, ఉగాది పురస్కారాలు 121 మందికి అందించి చివరివరకు ఓపికగా ఉండటం, అందరితో ఫోటోలు దిగడం పట్ల సభికులు, పురస్కార గ్రహీతలు చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. మరోవైపు, అవార్డులు అందుకున్న వృద్ధ కళాకారులు కళారత్న(హంస) అవార్డు బరువుగా ఉండటంతో కలెక్టర్ స్వయంగా పురస్కార గ్రహీతల వెంట వాటిని మోస్తూ మెట్లు దిగేంత వరకు సాగనంపారు. పురస్కార గ్రహీతలు ప్రశంసలు కురిపించారు.

పంచాంగాల ఆవిష్కరణ

టీటీడీ, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ పంచాంగాలతోపాటు సాంస్కృతిక శాఖ రూపొందించిన క్యాలెండర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. దుర్గామల్లేశ్వర దేవస్థాన ఆస్థాన పండితులు వేద గోష్టి నిర్వహించారు. వేద పఠనం అనంతరం పండితులను సీఎం ఘనంగా సత్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం మాడుగుల నాగఫణి శర్మను చంద్రబాబు సత్కరించగా, సరస్వతి అవధాన పీఠం నుంచి మాడుగుల నాగఫణి శర్మ ప్రత్యేక కానుక అందించి చంద్రబాబును సత్కరించారు. ప్రారంభంలో సీఎం చంద్రబాబు నాయుడును వేద పండితులు మంగళవాయిద్యాలతో వేదికపైకి ఆహ్వానించగా, రాజమండ్రి కమాండెంట్ కొండా నరసింహారావు దంపతులు శంఖనాదం చేశారు.

హంస అవార్డు గ్రహీతలు

డాక్టర్ కృతివెంటి శ్రీనివాసరావు, మొండెపు ప్రసాద్, పోపూరి గౌరీనాథ్, పారుపల్లి శ్రీ, మల్లాది బ్రదర్స్, కుమార సూర్యనారాయణ, పసుమర్తి వెంకటేశ్వరశర్మ, పిల్లా ఉమామహేశ్వరపాత్రుడు, టీవీ రావు, దామోదర గణపతిరావు, రామకుమారి రాజేష్(రంగం రాజేష్), బవిర రవి, ఎం.నాగేశ్వరరావు, వేమూరి బలరాం, కె.నాగసుధాకర్, కొల్లు అంకబాబు, వి.శ్రీరాములు, ఆకురాతి కోదండరామయ్య, లంకా అన్నపూర్ణ, బీవీఎన్ సౌమ్య, చింతా రవిబాలకృష్ణ, కోమటి జయరాం

ఉగాది పురస్కార గ్రహీతలు

చలపాక ప్రకాష్, బండ్ల మాధవరావు, డాక్టర్ ఎం.హరికిషన్, వల్లభనేని అశ్వనీకుమార్, కలిమికొండ సాంబశివరావు, అవనిగడ్డ సూర్యప్రకాష్, యలమర్తి అనురాధ, లగపాటి సంగయ్య, డాక్టర్ చింతలపాటి మోహన మురళీకృష్ణ, ఎ.వరప్రసాదరావు, అన్నవరపు బ్రహ్మయ్య, దాసరి ఆళ్వారుస్వామి, యనమదల మంజు, కప్పగంతు రామకృష్ణ, కొల్లూరి, స్ఫూర్తి గుర్రాజు, సింహాద్రి వాణి, మీరాబాయి, అరసవల్లి గిరిధర్, ఇంజారపు రమణమ్మ, గోళ్ల వాణి, దేవినేని మధుసూదనరావు, అక్కినేని భవానీప్రసాద్, దూపాటి శ్రీదేవి, తుమ్మల విల్సన్ సుధాకర్, ఎస్.కల్యాణరామన్, రెంటాల జయదేవ.

కరకష్టం

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. బస్సులతోపాటు అధిక లోడుతో లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. జాతీయ రహదారిపై నడిపిన ట్టుగా డ్రైవర్లు కరకట్టపై టిప్పర్లు, ట్రాక్టర్లు నడుపుతున్నారు. దీనితో కరకట్ట వాసులు భయాందోళన చెందుతున్నారు.

బెంబేలెత్తిపోతున్న వాకర్లు

యనమలకుదురు శివాలయం నుంచి రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్ సర్వీసు రోడ్డులో తెల్లవారుజామున మహిళలు, పురుషులు వాకింగ్ చేస్తుంటారు. ఈ టిప్పర్ల దెబ్బకు వారు వాకింగ్ కోసం రోడ్డెక్కడానికి భయపడుతున్నారు. వ్యాయామం కోసం కొంతమంది నడుస్తున్నా గుండెలు గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఒక టిప్పర్ సామర్థ్యం 18 టన్నులు ఉంటుంది. దీనిలో 20 టన్నుల వరకు ఇసుకను లోడు చేయవచ్చు. ఇసుకాసరులు ధనార్జన కోసం ఒక్కో టిప్పర్‌లో 40 టన్నుల ఇసుకను లోడ్ చేస్తున్నారు. డ్రైవర్ క్యాబిన్ ఎత్తు దాటి ఇసుకను నింపుతున్నారు. ఇసుక పైకి ఎగురకుండా దానిపై పలచటి చాపను వేస్తున్నారు. దీన్ని పటిష్టంగా వేయక పోవడం, టిప్పర్ సామర్థ్యం దాటి లోడ్ చేయడంతో ఇసుక ఒక సన్నిటి ధారలా కారిపోతోంది. ఈ ఇసుకంతా కరకట్టపై పడి ఉంటుంది. దీనితో ద్విచక్రవాహన దారులు బ్రేకులు వేసినప్పుడు అదుపు తప్పి పడిపోతున్నారు. కొద్దినెలలుగా రామలింగేశ్వరనగర్ కరకట్టపై ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ టిప్పర్ల అధిక బరువుకు శ్మశానం కూడలి నుంచి ఇస్కాన్ ఆలయం వరకు ఉన్న రహదారి కుంగిపోయింది. ఈ రహదారికి దిగువన తాగునీటి పైపులైన్ ఉంది. ఈ టిప్పర్ల కారణంగా పైపులైన్ పగిలిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు.

అనుమతించవద్దని ఆదేశాలు ఇచ్చాం

కరకట్ట మీదుగా టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లకు అనుమతి లేదు. వాటి రాకపోకలు అవనిగడ్డ కరకట్టపై నిషేధం. బందరు రోడ్డు, జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగాలి. రామలింగేశ్వరనగర్ కరకట్ట మీద నుంచి ఇసుక లారీలు, టిప్పర్లను అనుమతించవద్దని ట్రాఫిక్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

-ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

తిరువూరులో వేడెక్కిన రాజకీయం

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటున్నా మున్సిపల్ వివాదం రోజురోజుకు ముదురుతూనే ఉంది. ఏప్రిల్‌లో జరిగే కౌన్సిల్ సమావేశంలో మున్సిపాల్టీలో ఆధిపత్య పోరుకు తెరపడుతుందా లేకా మరో వివాదం నెలకొంటుందా అనే అనుమానం పట్టణ ప్రజల్లోనూ, కొందరు కౌన్సిలర్లలోనూ నెలకొంది. ఇప్పటికే మున్సిపాల్టీలో వైసీపీలో నెలకొన్న ఆధిపత్య పోరుకు తోడు, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాలపై పార్టీ చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యేగా రాజీనామ చేస్తానని ప్రకటించడం పట్టణంలో తీవ్ర దుమారం లేపింది. కొందరు నాయకులు నియోజకవర్గం నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు వివరించడం, జిల్లా స్థాయి నాయకులు తిరువూరు నియోజకవర్గంపై అధిష్టానానికి నివేదిక ఇవ్వడం వంటి చర్యలతో పట్టణంలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రెండు పార్టీల్లో భవిష్యత్ పరిణామాలు ఏం జరుగుతాయనే ఉత్కంట పట్టణ ప్రజల్లో నెలకొంది.

చెత్త పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

పనులకు విరుద్ధమైనవి కావడంతో తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఏఎన్ఎంలుగా రోజువారీ చేసే బాధ్యతలు చాలా ఉన్నాయి. వారు మొత్తం 31 రకాలకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి ఉంది. వీటిలో ఏది తేడా వచ్చినా ఏఎన్ఎంలు టార్గెట్ అవుతారు. ఇప్పటికే బండెడు చాకిరీ చేస్తున్న ఏఎన్ఎంలపై మరో 15రకాల బాధ్యతలు మోపటం వారిని తీవ్రంగా కుంగదీస్తోంది.

ఏమిటీ చెత్త పనులు?

ఏఎన్ఎంలకు ప్రధానంగా చెత్త సేకరణ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సచివాలయం పరిధిలో చెత్త సేకరణ సవ్యంగా జరుగుతున్నది. లేనిదీ పరిశీలించాల్సి ఉంది. ఎక్కడైనా చెత్త కుప్పలు పేరుకుపోతే పారిశుధ్య సిబ్బందికి సమాచారం ఇచ్చి వాటిని తొలగింపచేసే బాధ్యత వీరిది. రోజంతా ఏఎన్ఎంలు దీనిని పర్యవేక్షించటంతోనే సరిపోతుంది. ఇక ప్రజారోగ్య విధులు ఎలా నిర్వహిస్తారో కార్పొరేషన్ అధికారులకే ఎరుక. నగరంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇప్పుడే సరిగా పర్యవేక్షణ చేయటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏఎన్ఎంల చేత ఈ పనులు చేయిస్తే మరీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏంపని చేస్తారో అధికారులే చెప్పాలి.

పన్ను వసూళ్ల బాధ్యత ఎవరిది?

కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగం ఉంది. ఈ విభాగం పరిధిలో పనిచేయటానికి ప్రత్యేకంగా సిబ్బంది ఉన్నారు. పన్నుల వసూళ్ల బాధ్యతలను చూడటానికి క్షేత్ర స్థాయిలో బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. వారి విధులను కూడా ఏఎన్ఎంల మీద కార్పొరేషన్ అధికారులు నెట్టారు. రెవెన్యూ విభాగం పన్నులకు సంబంధించి చూస్తే ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, వాటర్ చార్జీలు, సీవరేజి అద్దె, వాటర్ మీటర్ చార్జీల వసూళ్లకు సంబంధించిన పురోగతి వ్యవహారాలన్నింటికీ ఏఎన్ఎంలదే బాధ్యత అని కార్పొరేషన్ అధికారులు తేల్చారు.

మరిన్ని విధులు.. మోపారిలా..

పారిశుధ్యం, రెవెన్యూ పనులే కాకుండా సంబంధం లేని అదనపు బాధ్యతలను ఏఎన్ఎంలపై మోపారు. ఆధార్ లేని పిల్లల రిపోర్టులు సమర్పించటం, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, వర్క్‌ఫ్రమ్ హోమ్ రిపోర్టు, నాన్ రెసిడెంట్ ఏపీ రిపోర్టు, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంఎస్ఎంఈ సర్వే, డెత్ మార్క్ సిటిజన్స్ ఆడిట్ రిపోర్టు, ప్యాక్స్ ఈకేవైసీ రిపోర్టు, పాఠశాల టాయ్‌లెట్స్ సందర్శన - తనిఖీలు, దోమల నియంత్రణ వంటి అదనపు బాధ్యతలను అప్పగించారు. వీటిలో ఒకట్రెండు మినహా వారి స్వభావ విధులకు పూర్తి భిన్నమైనవి కావటం గమనార్హం.

కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా..

కార్పొరేషన్ అధికారులు సంబంధం లేని అదనపు బాధ్యతలను మోపటంతో ఏఎన్ఎంలు కలెక్టర్‌ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. ఆయన నుంచి సానుకూలంగా స్పందన రాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

పట్టాలు తప్పిన రైలు

విజయవాడలో హెల్ప్‌డెస్క్

రైల్వేస్టేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒడిసాలోని ఖుర్దా రోడ్డు డివిజన్‌లో నెర్గుండి స్టేషన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం కామాఖ్య ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. మొత్తం 11 స్లీపర్ బోగీలు పట్టాలు తప్పాయి. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదని చెబుతున్నారు. రైల్వే అధికారులు, ఎన్డీఆర్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది హుటాహుటిన సహాయ కార్యక్రమాలకు చేపట్టారు. ఈ క్రమంలో విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. 0866-2575167 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోవచ్చు.

విజయవాడ తూర్పు



రాష్ట్ర బీసీ సంఘ ఉద్యోగ విభాగం అధ్యక్షుడిగా మూర్తి

మొగల్రాజపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంవీవీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. మొగల్రాజపురం నిమ్మతోట సెంటర్‌లో ఉన్న కుమ్మరి శాలివాహన సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, బీసీ యూత్ రాష్ట్ర యువత అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ మూర్తికి నియామక పత్రం అందించారు. సమస్యల పరిష్కారం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా కృషి చేసిన ఆయన ప్రస్తుత పదవీ బాధ్యతలు కూడా సమర్థంగా నిర్వహించాలని కోరారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

భారతీనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ నవమి 6న ఆదివారం నాడు శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఎన్టీఆర్ కాలనీలోని శ్రీకోదండ రామాంజనేయ, శ్రీవిజయ కార్యసిద్ధి గణపతి ఆలయంలో ఎన్టీఆర్, వెటర్నరీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను 4వ తేదీ శనివారం నుంచి 9వ తేది బుధవారం వరకు 5 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఆదివారంశ్రీ ఉదయం 10 గంటలకు వేదమంత్రాలతో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవము ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఐదురోజుల పాటు ఆలయంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయన్నారు.

కరెన్సీనగర్ కాలనీలో..

శ్రీరామనవమి పండుగ సందర్భంగా కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనీయ స్వామి దేవాలయంలో 34వ సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు శ్రీరామ భక్త సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఆదివారం స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ నవమి శ్రీ రామనవమి సందర్భంగా వేద మంత్రాలతో ఉదయం 11.30 గంటలకు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం జరుగుతుందని, సాయంత్రం కాలనీలో ఊరేగింపు నిర్వహించబడుతుందన్నారు. 10న గురువారం మధ్యాహ్నం అన్నవితరణ జరుగుతుందన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



గురునానక్ కాలనీలోని శివాలయంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి

భారతీనగర్: గురునానక్ కాలనీలోని శివాలయంలో ఉగాది పండుగ సందర్భంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. వేకువజాము నుంచి కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చి స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం సమీపంలో కోదండ రామాలయం, సాయిబాబ దేవాలయాలు కలిసి ఉండడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం రద్దీగా మారింది. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు.

ఎన్టీఆర్ కాలనీలో..

ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ కోదండ రామాంజనేయ, శ్రీ విజయ కార్యసిద్ధి గణపతి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా స్వామికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



ఉగాది వేడుకల్లో సీనియర్ సిటిజన్స్

పటమటలో వాడవాడలా..

పటమట: ఉగాది పర్వదినం సందర్భంగా పటమట సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో తెలుగు అధ్యాపకుడు దేశరాజు వెంకట కృష్ణమూర్తి పంచాంగ శ్రవణం నిర్వహించారు. కొండపల్లి మాధవరావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, కె.రామ్మోహన్‌రావు, శివశంకర్రావు పాల్గొన్నారు. అలాగే 10వ డివిజన్ టీచర్ కాలనీ ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. గీతా గాన ప్రవచన ప్రచారకర్త భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎల్వీ గంగాధర శాస్త్రికి ఉగాది పురస్కారాన్ని అందించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. క్లబ్ అధ్యక్షుడు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఉపాధ్యక్షుడు బొర్రా గాంధీ, అట్లూరి సుమబింధు, కిలారు వెంకట శివాజీ, కె.విజయ బాబు, సతీష్‌బాబు పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మీ దేవిగా కాళీమాత



కృష్ణలంక: విశ్వావసు ఉగాది సందర్భంగా ఆదివారం త్రిశక్తిపీఠంలోని కాళీ మాత అమ్మవారు భక్తులకు ధాన్య లక్ష్మీదేవిగా దర్శనమిచ్చింది. ఉదయాన్నే శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ ఉత్సవమూర్తులకు వేద మంత్రోచ్చారణల మధ్య పంచామృత అభిషేకం నిర్వహించారు. వసంత నవరాత్రుల సందర్భంగా రోజుకో పువ్వుతో 8 రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. తొలిరోజైన ఆదివారం చామంతులతో పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం పుచ్చా సూర్యప్రకాష్ శర్మచే పంచాగ శ్రవణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ పాల్గొన్నారు.

నడకతో మంచి ఆరోగ్యం: ఎమ్మెల్యే గద్దె



వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నడకను మించిన ఆరోగ్యం లేదని ఆరోగ్యానికి మించి ధనం లేదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పటమటలంకలో నూతనంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం నడవాలన్నారు. 40 ఏళ్లుగా నడకతో పాటు ఆహార నియమాలు పాటించడమే తన ఆరోగ్య రహస్యమన్నారు. ట్రాక్ నిర్మాణానికి అనుమతులిచ్చిన మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ గోగరాజు గంగరాజు మాట్లాడుతూ గద్దె మంత్రి అయితే ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేవారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ ట్రాక్ నిర్మాణంలో ఎమ్మెల్యే గద్దె పాత్ర మరువలేదనిదన్నారు. పరుచూరి అశోక్‌బాబు, ఎన్జీవో నేత విద్యాసాగర్, వైవీ ఈశ్వరరావు, చెన్నుపాటి వజీర్, కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, యలమంచిలి దేవేంద్ర, పి.వెంకటేశ్వరరావు, రావి సౌజన్య పాల్గొన్నారు.

మహిళల ప్రపంచ కబడ్డీ పోటీలకు

ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా శ్రీకాంత్



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య (ఐకేఎఫ్) ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రపంచ కప్ మహిళల కబడ్డీ-2025 పోటీల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన యలమంచిలి శ్రీకాంత్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య, అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వ క్రీడల మంత్రిత్వ శాఖ ఈ పోటీలను జూన్ 1న బిహార్‌లో నిర్వహిస్తోంది. బిహార్‌లోని రాజ్‌గిరిలో 13 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ప్రపంచంలోని అన్ని దేశాల జట్లు పాల్గొంటాయి. నిర్వహణ బాధ్యతను శ్రీకాంత్‌కు అప్పగిస్తూ అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు విబోర్ వి.జైన్, జితేంద్ర, ఠాగుర్ ఈనెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను దక్షిణ భారత అథ్లెటిక్స్ మానటరింగ్ కమిటీ చైర్మన్ ఆకుల రాఘవేంద్రరావు, ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ సీఈవో వెంకట్ నామిశెట్టి ఆదివారం ఘనంగా సత్కరించగా, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా అర్జునరావు, కోశాధికారి ఎస్.సుబ్బారాజు అభినందనలు తెలిపారు.

దుర్గంధభరితంగా వాకింగ్ ట్రాక్

భారతీనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత వంటివి ప్రచారాలకే తప్ప ఆచరణలో కనిపించడం లేదని పలువురు వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రీనరీలోని వాకింగ్ ట్రాక్‌లో స్థానికంగా ఉన్న వెటర్నరీ, ఎన్టీఆర్, కరెన్సీనగర్, తదితర కాలనీలకు చెందిన పలువురు చిన్నారులు, విద్యార్థులు, పెద్దలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వెటర్నరీ కాలనీ నుంచి రామవరప్పాడు రింగ్ సెంటర్ వరకు వాకింగ్ చేస్తుంటారు. ట్రాఫిక్ కారణంగా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని రోడ్డుపై ఉన్న చిరువ్యాపారులను సమీపంలోని గ్రీనరీలో ఏర్పాటు చేశారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్లు, కొనుగోలుదారులు పరిశుభ్రత పాటించకపోవడంతో గ్రీనరీ అంతా అధ్వానంగా మారింది. అంతేకాక ఆ ప్రాంతమంతా చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. అవి వాకింగ్ ట్రాక్‌పై రావడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయని వాకర్లు వాపోతున్నారు. అంతే కాకుండా కొందరు మందుబాబులు రాత్రి సమయంలో మద్యం సేవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాకర్లు కోరుతున్నారు.



గ్రీనరీలో పడి ఉన్న చెత్త, వ్యర్థాలు, మద్యం సీసాలు

తోటివారికి సాయంలో ఆనందం : శేషగిరి



కృత్రిమ అవయవాలు, స్టాండ్స్ పంపిణీ చేస్తున్న సభ్యులు

మొగల్రాజపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మనిషిగా ప్రతి ఒక్కరూ తోటివారికి సాయం చేయడంలో ఆనందం ఉంటుందని లయన్స్ ఇంటర్‌నేషనల్ 316డీ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. 316డీ ఆధ్వర్యంలో ఆదివారం స్పందన పేరుతో 22వ సేవా మహోత్సవాన్ని నగరంలో ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతృప్తి, మానసిక ప్రశాంత పక్కవారికి సాయం చేయడంలో లభిస్తుందన్నారు. సేవ అవసరం ఉన్న చోట లయన్స్ సభ్యులు ఉంటారన్నారు. అనంతరం పలువురికి వినికిడి యంత్రాలు, విద్యార్థినులకు సైకిళ్లు, మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం గ్రైండర్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, కృత్రిమ అవయవాలు వంటివి సుమారు రూ.20 లక్షల విలువ చేసేవి అందించారు. లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ ఆంజనేయులు, మాజీ గవర్నర్లు మిరియాల వెంకటేశ్వరరావు, కంకణాల శ్రీనివాసరావు, వీవీ సాయివరప్రసాద్, క్లబ్ జిల్లా సభ్యులు శ్రీనివాసరెడ్డి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, సుంకర కృష్ణ, లయన్స్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న గద్దె క్రాంతి, పక్కన షేక్ షరీఫ్

రంజాన్ కిట్లు పంపిణీ చేసిన గద్దె క్రాంతి

గుణదల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా గడుపుకోవాలన్న ఆలోచనతో రంజాన్ తోఫా తరహాలో కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని టీడీపీ యువ నేత గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. అమ్మా కల్యాణమండపం ఎదురుగా కొండపై ఉన్న మసీద్‌లో ఆదివారం ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గద్దె క్రాంతికుమార్ రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పేరుతో సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. వచ్చే ఏడాది నాటికి తిరిగి చంద్రబాబు ఆ పథకాన్ని ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. తూర్పులో తాము 5వ డివిజన్ పరిధిలో ఉన్న ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎస్.కె.హసన్ జానీ, ఎస్.ఫరోజ్, ఎండీ ఇక్బాల్, ఎస్.కె..జమాల్, షేక్ షఫీ, కరీం, సిద్దెల వివేక్, ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

కాలనీ రోడ్డుకు స్థలం వదలకుండా ప్రహరీ నిర్మాణం

- సీఆర్డీఏ కమిషనర్‌కు ఎండోమెంట్స్ కాలనీ వాసుల ఫిర్యాదు



కాలనీలో రోడ్డుకు స్థలం వదలకుండా ప్రహరీ నిర్మాణం

బెంజిసర్కిల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు బందరు రోడ్డు నుంచి నాగార్జున ఆస్పత్రి వరకు కొంతభాగం రోడ్డుకు స్థలం వదలకుండా ఒక స్థల యజమాని ప్రహరీగోడ నిర్మిస్తున్నారని ఎండోమెంట్స్, పంచాయతీరాజ్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు కాలనీవాసులైన ఎం వీరాస్వామి, టీ కోటిరెడ్డి, జీ నారాయణరావు, డీ రామలింగారెడ్డి, వీ రమేష్, డీ వీరభద్రరావు, రామారావు, కే అమరయ్య, శ్రీనివాసరావు, వీ బ్రహ్మారావు సీఆర్డీఏ కమిషనర్‌కు ఒక లేఖలో ఫిర్యాదు పంపారు. ఈసందర్భంగా వారు శనివారం కాలనీలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఉడా అప్రూవల్ ప్రకారం బందరు రోడ్డు కానూరు నుంచి నాగార్జున ఆస్పత్రి వరకు ఎండోమెంట్స్ కాలనీ మెయిన్‌రోడ్డు 40 అడుగుల రోడ్డుగా ఉందన్నారు. అయితే బందరు రోడ్డు నుంచి ఎండోమెంట్స్ కాలనీ వైపు వచ్చే మెయిన్ రోడ్డు ప్రారంభంలోని ప్రైవేటు స్థలాన్ని ఒక వ్యక్తి ఇటీవల కొనుగోలుచేసి రోడ్డుకు స్థలం వదలకుండా ప్రహరీగోడ కడుతున్నారని ఆరోపించారు. దీంతో కాలనీలోకి పెద్ద వాహనాలు రావడం కష్టమవుతుందని, 40 అడుగుల రోడ్డుకు స్థలం వదిలే విధంగా చర్యలు తీసుకోవాలని వారు సీఆర్డీఏ కమిషనర్‌ను కోరారు. దీనిపై స్థల యజమాని అల్లూరి సాయి ప్రసాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను ఇటీవల స్థలం కొనుగోలు చేశామని, రిజిస్టర్ డాక్యుమెంట్ ప్రకారం తన స్థలానికి ప్రహరీగోడ నిర్మించుకుంటున్నామని చెప్పారు. తాను ఈ ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపడితే సీఆర్డీఏ నిబంధనల ప్రకారం రోడ్డుకు స్థలం వదిలేస్తామన్నారు.



చెస్ టోర్నమెంట్ లో విజేతలతో నిర్వాహకులు

అండర్-7 ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా అండర్-7 బాలబాలికల చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 51 మంది పాల్గొన్నారు. అండర్-7 చాంపియన్‌షిప్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని ఏప్రిల్‌లో జరిగే అండర్-7 స్టేట్ చాంపియన్‌షిప్‌కి కృష్ణా జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పోటీల్లో విజేతలకు క్యాష్‌ప్రైజ్‌తో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విజ్ఞాన భారతి హైస్కూల్ డైరెక్టర్ కేఆర్ఎస్ రావు, ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ జె.స్నిగ్ధ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.ఎమ్.ఫణి కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం

పటమట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటినీ ఆసుపత్రి సహకారంలో అశోక్‌నగర్‌లోని సోమనాథ్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని, రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పోలవరపు విజయ్‌భాస్కర్ తెలిపారు. ఉచితంగా గుండె, నరాలు, ఎముకల పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధి నిపుణులు నరాల అనిల్ మాట్లాడుతూ వ్యాయామం లేకపోవడం, కొవ్వు ఉండటంతో గుండెజబ్బులు వస్తున్నాయన్నారు. 120 మంది రోగులకు ఈసీజీ, టూడీ ఎకో, బ్లడ్ షుగర్, బోన్ డెన్సిటీ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ పి.రఘునాథ శర్మ, నంబర్ న్యూస్ చానెల్ ఈడీ శ్రీనివాస్, రూట్స్ సభ్యులు శర్మ, క్రాంతి, సంజెయ్, సెంటినీ మార్కెటింగ్ హెడ్ జి.వెంకట రమణ పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

జీపాట్ 2025

గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) విడుదల చేసింది. ఎంఫార్మసీ అడ్మిషన్స్ కోసం ఉద్దేశించిన ఈ కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ 2025 మే 25న జరుగుతుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విండో ఓపెన్ అవుతుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు natboard.edu లింక్ యాక్టివేట్ అయిన తరవాత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత, నాలుగు సంవత్సరాల ఫార్మసీ విద్య పూర్తిచేసుకున్న అభ్యర్థులు దరఖాస్తునకు అర్హులు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదు. మే 21న హాల్ టికెట్లు విడుదల చేస్తారు. మే 25న పరీక్ష కాగా, ఫలితాలను జూన్ 25న వెల్లడించే అవకాశం ఉంది. జీపాట్ అడ్మిషన్ ప్రొసీజర్ ప్రారంభం కంటే ముందే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.3500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.2500. పూర్తి వివరాలకు ఎన్‌బీఈఎమ్ఎస్ వెబ్‌సైట్ చూడవచ్చు.

30 రోజుల్లో నీట్
ఇలా ప్లాన్ చేయండి



నీట్ పరీక్షకు దాదాపుగా ముప్ఫై రోజుల వ్యవధి ఉంది. ఈ సమయంలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన వ్యూహం అవసరం. మొత్తం 180 ప్రశ్నలతో నీట్ యూజీ ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ 45, కెమిస్ట్రీ 45, బయాలజీ 90 ఉంటాయనే విషయం తెలిసిందే. ఇందులో సరైన సమాధానానికి 4 నాలుగు మార్కులు లభిస్తాయి. తప్పుగా రాసిన సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తారు. పరీక్షకు సంబంధించి ఇలా మీదైన సొంత వ్యూహం రూపొందించుకోండి.

- 30 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మొదట ప్రిపేర్ చేసుకోండి. మూడు గంటలు ఫిజిక్స్, మూడు గంటలు కెమిస్ట్రీ, మూడు గంటలు బయాలజీకి కేటాయించండి.
- గత పరీక్షల ఆధారంగా అధ్యాయాల వెయిటేజీని విశ్లేషించండి. 2021 నుంచి 2024 వరకు పేపర్ల ట్రెండ్‌ను గమనించండి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా అన్ని సబ్జెక్టుల కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నేర్చుకోండి. ప్రతీ చాప్టర్‌కు షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకోండి.
- ప్రతీ సబ్జెక్టులోనూ ఎక్కువ వెయిటేజీ ఉన్న చాప్టర్లపై దృష్టి పెట్టండి. అలాగే ప్రతీ విద్యార్థి కొన్ని చాప్టర్లను సులభం అని భావిస్తారు. వాటిపై కూడా తప్పనిసరి దృష్టి సారించాలి.

సొంతంగా చదువుకునే సమయంలో సందేహం వస్తే టెక్నాలజీపై ఆధారపడండి. అంతేతప్ప సందేహాన్ని తీర్చుకునే విషయంలో వాయిదా అనే మాటే వద్దు. యూట్యూబ్స్, సబ్జెక్ట్ వెబ్‌సైట్స్ ఉపయోగించుకోండి.

- రోజూ ఫిజిక్స్ ఫార్ములాలు రివిజన్ చేయండి. దీనితోపాటు 2021 నుంచి 2024 సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. రోజుకు ఒక గంట అయినా ఈ పనిచేయాలి.
- ఫిజిక్స్ ప్రాబ్లమ్ సాధించే సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పాటించండి. ఒక ప్రశ్నను ఒక నిమిషంలో పూర్తి చేసేలా ఉండాలి.
- ఫిజిక్స్‌లో రోజుకు కనీసం 30-40 ప్రశ్నలు పూర్తి చేసేలా చూసుకోండి.
- రోజులో మొదట ఫిజిక్స్ సబ్జెక్టు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఫ్రెష్ మైండ్‌తో ఎక్కువగా అర్థం అవుతుంది.
- కెమిస్ట్రీ విషయానికి వస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు సాధించండి. మెకానిజమ్స్ ప్రాక్టీస్ చేయండి. ఫ్లోచార్ట్స్ గుర్తుంచుకోండి.
- కెమిస్ట్రీ ఫార్ములా రివిజన్‌తోపాటు 2019 నుంచి 2024 వరకు ప్రశ్న పత్రాలపై పట్టుసాధించాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలలో బలమైన అంశాలపై దృష్టి సారించండి. ఉదాహరణకు ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీలో బలహీనంగా ఉంటే పీ-బ్లాక్ ఎలిమెంట్స్, కో ఆర్డినేట్ కాంపౌండ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించండి.
- బయాలజీ విషయానికి వస్తే ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు చదవండి. జన్యుశాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం, బయోటెక్నాలజీ, పర్యావరణ శాస్త్రం మొదలైన వాటికి ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- మెటీరియల్ చదివే సమయంలో రాసుకున్న షార్ట్‌నోట్స్ రివిజన్ సమయంలో బాగా ఉపయోగపడుతుంది. తరుచూ ఎంట్రెన్స్‌లో వచ్చే చాప్టర్లు ఎక్కువగా రివిజన్ చేయడాలి.
- ముఖ్యమైన డయాగ్రామ్ చదవండి. ప్రతీ డయాగ్రామ్ లేబుల్స్ క్షుణ్ణంగా పరిశీలించండి.
- బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అందుకే డిటైల్డ్‌గా చదవడానికి ప్రయత్నించండి.
- వీలయినన్ని మాక్ టెస్టులు రాయండి. దీంతో ఏయే చాప్టర్లపై పట్టు ఉందో అర్థం అవుతుంది. అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ తెలుస్తుంది.
- నా ప్రిపరేషన్ సరిగా లేదేమో లేదా సరిపోలేదేమో అనే భావనకు లోనుకావద్దు. ఆత్మవిశ్వాసంతో ఉండండి.



- డా. కిషన్ రావు టంకశాల
సంజీవని మెడికల్ అకాడమి

SCHOLARSHIP ALERT

The Cadence Program



The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).
Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.
Prizes & Rewards: Financial support for covering key educational expenses.
Last Date to Apply : 31-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School Scholarship

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.
Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.
Prizes & Rewards : An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.
Last Date to Apply : 15-04-2025
Application mode: Online and offline via email at (admissions@doonschool.com)
Short Url: www.b4s.in/aj/DSSE2

buddy4study.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్స్

జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాలనే భావం స్థిరపడి పోయింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఇలా ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన వారికైనా మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే అవకాశం ఉంది. అలాగే ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటున్నవారు కూడా ఈ కోర్సులు చేసి కెరీర్‌లో మరింత ముందుకు వెళ్లగలుగుతున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల మేనేజ్‌మెంట్ కోర్సుల నోటిఫికేషన్ వెలువడింది. ఒకసారి పరిశీలించండి.

ఐపీఈ హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ 2025-27 విద్యా సంవత్సరానికి పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://www.ipeindia.org/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు

పీజీడీఎం - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - మార్కెటింగ్ మేనేజ్‌మెంట్



పీజీడీఎం - బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
పీజీడీఎం - ఇంటర్నేషనల్ బిజినెస్
పీజీడీఎం - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బిజినెస్ అనాలిసిస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/గ్మాట్/జీమ్యాట్/ మ్యాట్/ సీమ్యాట్/ ఏటీఎంఏ టెస్ట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఏప్రిల్ 12

'నిట్' కురుక్షేత్ర

హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://nitkkr.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.
అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు, క్యాట్/ సీమ్యాట్/ మ్యాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 5
గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీ ప్రకటన: 2025 మే 8

ఐఐఎం బోధ్‌గయ

ఐఐఎం బోధ్‌గయ, టీంలీజ్ ఎడ్యుటెక్‌తో కలిసి ఆన్‌లైన్ 'ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్'(ఈఎంబీఏ)ని డిజైన్ చేసింది. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ కోర్సు మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లకు ఉపయోగపడుతుంది. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, స్ట్రాటజీ తదితర సబ్జెక్టులు ఇందులో ఉంటాయి. వివరాల కోసం https://iimbgonline.in/ వెబ్‌సైట్ చూడ

JOBS

ఇండియన్ నేవీలో అగ్నివీర్

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియమకానికి నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన వారికి 'ఐఎన్ఎస్ చిల్కా'లో శిక్షణ ఉంటుంది. 2025, 2026 బ్యాచ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇది.
ప్రకటన పేరు: అగ్నివీర్(మెట్రిక్ రిక్రూట్-ఎంఆర్) ఖాళీలు
అర్హత: పదో తరగతి పాసైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
వయస్సు: 02/2025 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2004 సెప్టెంబరు 1 నుంచి 2008 ఫిబ్రవరి 29 మధ్యలో జన్మించి ఉండాలి. 01/2026 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 ఫిబ్రవరి 1 నుంచి 2008 జూలై 31 లోపు జన్మించి ఉండాలి. 02/2026 బ్యాంక్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 సెప్టెంబరు 1 నుంచి 2008 డిసెంబర్ 31లోపు జన్మించి ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: నేవీ ఎంట్రెన్స్ ద్వారా షార్ట్ లిస్ట్ చేస్తారు. రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష, వైద్య పరీక్ష ఉంటాయి.
పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ భాషల్లో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్, సైన్స్, మేథ్స్, జనరల్ అవేర్‌నెస్ నాలుగు విభాగాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 10
ఎంట్రెన్స్ టెస్ట్: 2025 మే 25న
వెబ్‌సైట్ : https://www.joinindiannavy.gov.in/

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 31 మార్చి 2025

మరో ఆరు రోజులు



ఉపవాసాలు, దానధర్మాలు, ప్రత్యేక నమాజ్‌లు, ఆరాధనలతో రంజాన్ మాసం ముగిసింది. తనపట్ల భక్తిని, నమ్మకాన్ని మరింత పటిష్టపరచుకొనే అవకాశాన్ని విశ్వాసులకు అల్లాహ్ అనుగ్రహించాడు. దీనికి కొనసాగింపుగా... రంజాన్ మాస ఉపవాసాలను పూర్తి చేసిన తరువాత... తదుపరి మాసమైన షవ్వాల్‌లో ఆరు రోజులు ఉపవాసాలు చేసే సంప్రదాయం ఉంది. సాధారణంగా... 'ఈద్-ఉల్-ఫితర్' జరుపుకొన్నాక... రెండో రోజు నుంచి ఈ ఉపవాసాలను పాటిస్తారు. ఎవరైతే రంజాన్ ఉపవాసాలు చేసి, ఆ తరువాత షవ్వాల్ మాసంలో ఆరు రోజులు ఉపవాసాలు ఉంటారో... వారు ఏడాదంతా ఉపవాసాలు చేసినట్టేనని దైవ ప్రవక్త మహమ్మద్ తెలిపారు. రంజాన్ ఉపవాసాలను, షవ్వాల్ ఉపవాసాలను పాటించిన వారు తల్లి గర్భంలోంచి అప్పుడే పుట్టినంత పవిత్రులవుతారని, వారు ఎప్పుడూ ఉపవాసాలు పాటిస్తున్నవారిగా పరిగణన పొందుతారని హదీస్ గ్రంథం చెబుతోంది. ఎల్లప్పుడూ ఉపవాసం పాటించడం గురించి తనకు ఎదురైన ఒక వ్యక్తి అడిగిన ప్రశ్నకు దైవ ప్రవక్త సమాధానం ఇస్తూ "రంజాన్ ఉపవాసాలతో పాటు తరువాతి నెలలోని (ఆరు రోజుల) ఉపవాసాలను కూడా పాటించు. అలాగే బుధ, గురువారాల్లో ఉపవాసం ఉండు. దీనివల్ల నువ్వు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటించేవాడిగా పరిగణన పొందుతావు" అని చెప్పారు. "ఎవరైనా రంజాన్ మాసమంతా ఉపవాసాలు ఉంటే... అతనికి పది నెలల పుణ్యం వస్తుంది. షవ్వాల్‌లోని ఆరు రోజుల ఉపవాసాల వల్ల అరవై రోజుల పుణ్యం లభిస్తుంది. ఈ విధంగా పన్నెండు నెలలు... అంటే ఏడాది కాలం ఉపవాసాలు చేసినంత పుణ్యం వారికి దక్కుతుంది" అని దివ్య గ్రంథాలు పేర్కొంటున్నాయి. కాగా, "రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే... షవ్వాల్ ఉపవాసాల ద్వారా ఆ పొరపాట్లను అల్లాహ్ మన్నిస్తాడు. నమాజ్‌లలో ఏర్పడిన లోపాలను తొలగిస్తాడు" అని పూర్వ ఉలేమాలు (ఇస్లాం గురువులు) స్పష్టం చేశారు.

- మహమ్మద్ వహీదుద్దీన్



ఉపవాస దీక్ష తరవాత



ముస్లింలు రంజాన్ మాసమంతా కఠిన ఉపవాస దీక్ష కొనసాగించారు. నేటి నుంచి వీరు సాధారణ విధానాన్ని అనుసరించాలి. నెల రోజులు ఉపవాసం చేయడం వల్ల జీర్ణక్రియలో మార్పులు వస్తాయి. కాబట్టి శరీరం సాధారణ ఆహారపు అలవాట్లకు సర్దుబాటు కావడానికి కొంత సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. జీవక్రియలు యథావిధిగా కొనసాగేందుకు పాటించాల్సిన కొన్ని చిట్కాలను ఇలా సూచిస్తున్నారు.

- తాజా కూరగాయలు, పళ్లు, తృణధాన్యాలతో కూడిన సమతులాహారాన్ని తీసుకోవాలి. ఇందులో మితంగా ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి. మసాలాలతో కూడిన నూనె పదార్థాలను తినకూడదు. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని మాత్రమే తినాలి.
- శరీరం నిర్జలీకరణ స్థితిలోకి వెళ్లకుండా కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండాలి. పలుచని మజ్జిగ, నీళ్లు కలిపిన పాలు తాగడం వల్ల శరీరంలో క్రమంగా నీటి శాతం పెరగడంతోపాటు తక్షణ శక్తి కూడా లభిస్తుంది. దాహంగా ఉందంటూ శీతల పానీయాలు తాగకూడదు. దీనివల్ల శరీరంలో అదనంగా చక్కెర చేరి దాహార్తి పెరుగుతుంది.
- ఈ నెల రోజులూ తక్కువగా తింటూ ఎక్కువ సమయం మేలుకొని ఉండే విధానాన్ని శరీరం అలవాటు చేసుకుని ఉంటుంది కాబట్టి సాధారణ విధానాన్ని ఒకేసారిగా కాకుండా మెల్లగా అనుసరించే ప్రయత్నం చేయాలి. ఆలస్యంగా పడుకోవడం, ఎక్కువసేపు నిద్రపోవడం కాకుండా సాధారణ దినచర్యను పాటించాలి.
- ఒకేసారి ఎక్కువగా తినకుండా కొద్దికొద్దిగా పలుమార్లు తింటే జీర్ణ సమస్యలను నివారించవచ్చు. భోజనం తరవాత కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ వేగం పుంజుకుంటుంది. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల శరీరానికి చురుకుదనం లభిస్తుంది.
- ఆకలి అనిపించినప్పుడు అధిక క్యాలరీలు ఉన్న ఆహార పదార్థాలు కాకుండా తేలికగా జీర్ణమయ్యే పోషకారాన్ని తినాలి. మొలకలు, క్యారెట్, కీరా, గింజలు తినడం మంచిది. దీనివల్ల శరీరం అలసిపోకుండా ఉంటుంది.
- శరీర బరువులో వస్తున్న మార్పులు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి తదితరాలను పరీక్షించుకుంటూ ఉండాలి. వాటికి అనుగుణంగా ఆహారపదార్థాలు తీసుకోవాలి.

డైనింగ్ టేబుల్ అందంగా ఇలా...

సాధారణంగా డైనింగ్ టేబుల్ మీద మంచినీళ్ల గ్లాసులు, వాటర్ బాటిల్స్, పళ్లేలు ఇలా ఎన్నెన్నో పెట్టేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల డైనింగ్ రూమ్ అందం పాడవుతుందని నిపుణులు చెబుతున్నారు. డైనింగ్ టేబుల్‌ను ఆకర్షణీయంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- డైనింగ్ టేబుల్ మీద తప్పనిసరిగా టేబుల్ క్లాత్ వేయాలి. కాటన్, సిల్క్, రేయాన్, జూట్, పాలిస్టర్ క్లాత్‌లను ఎంచుకోవచ్చు. ఎంబ్రాయిడరీ వర్క్ చేసినవి, పెద్ద ప్రింట్లు ఉన్నవి అయితే టేబుల్‌కు రిచ్ లుక్ వస్తుంది.
- డైనింగ్ టేబుల్ చుట్టూ అమర్చిన కుర్చీల ముందు టేబుల్‌పై మ్యాట్‌లు వేయాలి. వీటి వల్ల టేబుల్ క్లాసీగా కనిపిస్తుంది. కాటన్ లేదా నారతో తయారు చేసిన మ్యాట్‌లు..... టేబుల్‌పై



చక్కగా అమరుతాయి. రకరకాల రంగుల్లో పలు డిజైన్లతో ఉన్న మ్యాట్‌లు ఎంచుకుంటే టేబుల్ అందంగా కనిపిస్తుంది.
- డైనింగ్ టేబుల్‌కు క్యాండిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. టేబుల్ ముందు కుర్చీలో కూర్చున్నప్పుడు కంటి ఎత్తు కంటే కిందుగా క్యాండిల్స్ అమర్చాలి. టేబుల్ మధ్యలో ఓ పెద్ద క్యాండిల్ పెడితే చూడడానికి బాగుంటుంది. టేబుల్ మధ్యలో ఫ్లవర్ వాజ్‌ను ఉంచి దాని చుట్టూ రంగురంగుల క్యాండిల్స్ పెడితే ఆకర్షణీయంగా ఉంటుంది.
- డైనింగ్ టేబుల్ గుండ్రంగా ఉన్నట్లయితే రూఫ్ నుంచి ఓ పెద్ద పెండాంట్ లైట్ వేలాడేలా అమర్చుకుంటే బాగుంటుంది దీర్ఘచతురస్రాకారపు టేబుల్ అయితే రెండు లేదా మూడు వరుసల్లో పెండాంట్ లైట్లను అమర్చుకోవచ్చు. అందమైన షాండ్లియర్ ఏర్పాటు చేసుకుంటే డైనింగ్ టేబుల్ రిచ్‌గా కనిపిస్తుంది.
- డైనింగ్ టేబుల్ మీద ఓ పక్కగా చిన్న మొక్క ఉన్న పింగాణీ కుండీని పెడితే చూడడానికి బాగుంటుంది.

అభిరుచి

డిజిటల్ తెరపై తిరుగులేని తార

నీతూ బిష్త్... ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఒక సంచలనం. ఆమె పేరిట ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు సబ్‌స్క్రైబర్ల సంఖ్య మూడు కోట్లు దాటింది. ప్రతి వీడియోకూ వీక్షకుల సంఖ్య లక్షల్లో ఉంటోంది. దానికి తగినట్టే ఆదాయం కూడా వచ్చి పడుతోంది. డిజిటల్ తెరపై తిరుగులేని తారగా అభిమానులను సంపాదించుకుంది. ఇంతకీ ఎవరీ అమ్మాయి? ఆమె కంటెంట్‌లో అంత ప్రత్యేకత ఏముంది?

నీతూది మధ్యతరగతి కుటుంబం. తల్లి మోహిని బిష్త్, తండ్రి ప్రతాప్ బిష్త్... రాష్ట్రపతి భవన్‌లో ఉద్యోగి. నీతూకి ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు. పుట్టింది ఉత్తరాఖండ్‌లోని కర్చులి అయినప్పటికీ... తండ్రి ఉద్యోగరీత్యా అంతా కలసి ఢిల్లీలో ఉండేవాళ్లు. పిల్లలంతా 'డాక్టర్ రాజేంద్రప్రసాద్ సర్వోదయ స్కూల్‌లో చదువుకొనేవాళ్లు. నీతూకి పదకొండేళ్లప్పుడు సెరిబ్రల్ హెమరేజ్‌తో తండ్రి మరణించారు. దీంతో కుటుంబ బాధ్యతను తలకెత్తుకున్న తల్లికి చేదోడు వాదోడుగా ఉండాలని డిగ్రీ పూర్తికాగానే చిన్న ఉద్యోగంలో చేరింది నీతూ.

మొదటి అడుగు వేసింది ఇలా...

2016లో షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్ 'టిక్ టాక్' ఓ ప్రభంజనంలా వచ్చింది. అందులో వచ్చే వీడియోలు చూసి నచ్చడంతో తను కూడా కొత్తగా ప్రయత్నించాలనుకుంది 27 ఏళ్ల నీతూ. టిక్‌టాక్‌లో చిన్న చిన్న వీడియోలు చేయడం మొదలుపెట్టింది. ఇదే ఆమె వేసిన మొదటి అడుగు. తరవాత ఆమె వెనుదిరిగి చూడలేదు. కొన్ని రోజుల్లోనే నీతూకి ఫాలోవర్స్ బాగా పెరిగిపోయారు. క్రమంగా మోడలింగ్, కమర్షియల్ యాడ్స్ అవకాశాలు ఆమె తలుపుతట్టాయి. వచ్చిన ప్రతీ అవకాశాన్ని గెలుపు బాటగా మార్చుకుంటూ నీతూ ముందుకు సాగింది.

సోషల్ మీడియానే కెరీర్‌గా...

2018లో ప్రభుత్వం టిక్‌టాక్‌ని నిషేధించింది. అయినా నీతూ నిరాశ పడలేదు. ఆమె 2011లోనే యూట్యూబ్ ఛానెల్‌ని ప్రారంభించింది. అడపా దడపా వీడియోలు అప్‌లోడ్ చేస్తూ ఉండేది. టిక్‌టాక్ బ్యాన్ అయిన తరవాత యూట్యూబ్ మీద దృష్టి నిలిపింది నీతూ. టిక్‌టాక్ తరహాలోనే చిన్న చిన్న వీడియోలు, రీల్స్ చేసి అప్‌లోడ్ చేయడం ప్రారంభించింది. చూస్తుండగానే యూట్యూబ్‌లో కూడా సబ్‌స్క్రయిబర్స్ పెరిగిపోయారు. బయటికి వెళితే చాలు అందరూ గుర్తుపట్టి సెల్ఫీలు తీసుకునేవాళ్లు. దీంతో సోషల్ మీడియానే కెరీర్‌గా మార్చుకోవాలనే ఆలోచన వచ్చింది నీతూకి. వెంటనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా యాక్టివ్ రోల్ పోషించడం మొదలుపెట్టింది. క్రమంగా వ్లాగర్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, కంటెంట్ క్రియేటర్‌గా, వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకోవడంతో పాటు కోట్లు ఆర్జించే స్థాయికి ఎదిగింది.

ప్రేమ... పెళ్లి...

మోడలింగ్‌లో రాణిస్తున్న సమయంలో నీతూకి ప్రొఫెషనల్ క్రికెటర్ లఖన్ అర్జున్ రావత్‌తో పరిచయమైంది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో... 2021 జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. రెండేళ్ల తరవాత 2023 ఫిబ్రవరిలో వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా పేజీల్లో షేర్ చేసింది నీతూ.



ఇవి కూడా...

నీతూ... ఒకవైపు మోడలింగ్, మరోవైపు కమర్షియల్ యాడ్స్ చేస్తూ బిజీగా మారిపోయింది. బింగో, లివ్ ప్యూర్, అమెజాన్, కోస్టా, పాంటలూన్స్ ప్రకటనలు ఆమెకు మంచిపేరు తెచ్చాయి. ఎన్నో బ్యూటీ ప్రొడక్ట్‌కి ప్రమోషన్స్ చేసింది. పంజాబీ సాంగ్ 'బద్నావి'లో కూడా కనిపించి మురిపించింది.

కంటెంట్‌కీ ఫ్యాన్స్ ఉన్నారు...!

నీతూ పోస్ట్ చేసే వీడియోల్లోని కంటెంట్‌కి ప్రత్యేకమైన అభిమానులు ఉన్నారు. హాస్యం మేళవించిన సంభాషణలతో ఈ వీడియోలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. వీటి వ్యవధి కొన్ని సెకన్లు మాత్రమే ఉండడంతో అవి బాగా పాపులర్ అయ్యాయి. నీతూ ఎక్కువగా ట్రావెల్, ఫ్యాషన్, కామెడీ వీడియోలు పోస్ట్ చేస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ బ్యూటీ టిప్స్ చెబుతుంది. నీతూ ఇప్పటి వరకు సుమారు 3,000ల షార్ట్ వీడియోలు అప్‌లోడ్ చేసింది. వీటిలో పెద్ద వీడియోలు 8 మాత్రమే ఉన్నాయి. టిక్‌టాక్ అయినా, యూట్యూబ్ అయినా ఆమె అనుసరించిన పంథా షార్ట్ వీడియోలే. ఇవే ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి.



మిలియన్ మార్క్...

నీతూ బిష్త్ నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెల్‌ను ఇప్పటి వరకు 3.2 కోట్ల మంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఆమె వీడియోలకు కూడా లక్షల కొద్దీ వ్యూస్ వస్తూ ఉంటాయి. కోటి మంది వీక్షించిన వీడియోలు ఆమె చానెల్‌లో చాలానే ఉన్నాయి. ఇటీవల ఆమె పోస్ట్ చేసిన ఓ షార్ట్ వీడియోను దాదాపు ఆరు కోట్ల మంది చూశారు. నీతూకి ఫేస్‌బుక్‌లో నలభై లక్షల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 50 లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇప్పుడు బాలీవుడ్ స్టార్లకు ఏమాత్రం తీసిపోనంతగా క్రేజ్ సంపాదించుకుంది నీతూ.

స్వచ్ఛమైన పరిష్కారం

పరిసరాలను అసహ్యంగా మార్చడంతోపాటు పౌరుల ఆరోగ్యానికి కూడా పెనుముప్పు కలిగిస్తున్న వ్యర్థాల సమస్యకు వినూత్నమైన పరిష్కారంతో ముందుకొచ్చారు ముంబయి మహిళ మానా షా. ఆమె చొరవతో యాభైకి పైగా హౌసింగ్ సొసైటీలు, అనేక కార్పొరేట్ సంస్థలు చెత్త ఇబ్బందుల నుంచి విముక్తి పొందాయి. అంతేకాదు... ప్రతినెలా 500 టన్నులకు పైగా సేకరిస్తున్న వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చి, ఉచితంగా అందిస్తున్నారు.

ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు, నగరం శివార్లలో పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు. దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో నానాటికీ తీవ్రమవుతున్న 'ఈ సమస్యకు పరిష్కారం లేదా?' అనే ఆలోచన చాలాకాలం మానా షాను వెంటాడింది. 2006లో 'యాన్ ఇన్‌కన్వీనియెంట్ ట్రూత్' అనే డాక్యుమెంటరీ చూశాక... సమస్య తీవ్రత ఆమెకు మరింత బాగా అర్థమయింది. "మన దేశంలోని తీరప్రాంతాల్లో నివసిస్తున్నవారు సముద్ర మట్టాలు పెరగడం వల్ల ముప్పును ఎదుర్కొనే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. భారీ పరిమాణాల్లో వ్యర్థాలను తీర ప్రాంతాల్లో పారేస్తూ ఉండడంతో ఆ ప్రమాదం చాలా





వేగంగా పెరుగుతోంది. అలాంటి టాప్ 10 నగరాల్లో ముంబయి ఒకటని తెలియగానే నేను దిగ్భ్రాంతి చెందాను. నేను పుట్టి పెరిగిన నగరానికి ఆ దుస్థితి రాకూడదనుకున్నాను" అంటారామె.

కుటుంబ వ్యాపారాన్ని వదిలేసి...

మానా షాది వ్యాపారుల కుటుంబం. ఆమె తండ్రి, కుటుంబ సభ్యులు పెట్రోల్ బంకులు నిర్వహిస్తారు. ఒక ఫ్యాక్టరీ కూడా ఉంది. తండ్రి మార్గదర్శకత్వంలో ఆమె కూడా ఆ మార్గంలోకే వచ్చారు. ఫ్యాక్టరీ కార్యకలాపాలు, వినియోగదారుల సేవల్ని ఆమె చూసేవారు. క్రమంగా ప్రెసిడెంట్ హోదాకు చేరుకున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, వ్యాపారంలో ఒత్తిడులు ఒకవైపు... సొంత నగరానికి ఏదైనా మంచి చెయ్యాలనే కోరిక మరొకవైపు... చివరకు ఆమెలోని సేవా దృక్పథమే గెలిచింది. రెండేళ్లపాటు అధ్యయనం చేసిన తరువాత... 2010లో 'గ్రీన్ ప్రాక్టీసెస్' అనే సంస్థను ఆమె ప్రారంభించారు. నగరంలో వివిధ కాలనీలను సందర్శించారు. హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో మాట్లాడారు. చెత్తను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ పారెయ్యడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. "మనం చెత్తను దూరంగా పారేస్తున్నామని అనుకుంటాం. కానీ 'దూరం' అనే మాటకు అర్థం లేదు. అది మన ఊరు దాటి వెళ్ళదు. తన దుష్ఫలితాలను మన మీదకు పంపిస్తుంది. ఏ సమాజంలోనైనా వ్యర్థాల నిర్వహణ చాలా కీలకం" అని చెబుతారు మానా. ఇంటికే వచ్చి చెత్త తీసుకువెళ్తామని చెబితే ఎవరు కాదంటారు? మొదట ఒక ప్రాంతంతో మొదలైన ఈ కార్యక్రమం... ప్రస్తుతం 50కిపైగా హౌసింగ్ సొసైటీలకు విస్తరించింది. అంతేకాదు... రిలయన్స్, స్విగ్గీ లాంటి ప్రముఖ సంస్థలకు కూడా గ్రీన్ ప్రాక్టీసెస్ సేవలు అందిస్తోంది.

చైతన్యం పెరుగుతోంది...

ఆచరణాత్మకమైన ప్రణాళిక, అమలులో కచ్చితత్వమే తమ ప్రయత్నం విజయవంతం కావడానికి దోహదం చేశాయంటారు మానా. "రోజూ ట్రక్కులు కాలనీలకు, సంబంధిత సంస్థల కార్యాలయాల దగ్గరకు వస్తాయి. చెత్తను సేకరించిన తరువాత... దాన్ని నిర్ణీత ప్రదేశాలకు మా సిబ్బంది తీసుకువస్తారు. అక్కడ ఆహార, ఆహారేతర పదార్థాలను విడదీస్తారు. ఆహారేతర పదార్థాల్లో లోహాలు, కాగితాలు, ప్లాస్టిక్, గాజు... ఇలా వివిధ పదార్థాలను వేరు చేస్తారు. వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు పంపిస్తారు. ఆహార వ్యర్థాలను వేరే కేంద్రానికి తెచ్చి కంపోస్ట్ తయారు చేస్తారు. కంపోస్టింగ్‌కు సాధారణంగా ఆరు నెలలు పడుతుంది. కానీ మేం నిర్దిష్టమైన మైక్రోబ్స్ వినియోగంతో దాన్ని నెల రోజులకు కుదించాం. అలా ఆహార వ్యర్థాలను పోషకాలతో నిండిన కంపోస్ట్‌గా మార్చి... కాలనీలకు, సంస్థలకు ఉచితంగా అందజేస్తాం. దాన్ని ఆరుబయట ఉండే తోటలకు, ఇళ్లలో పెంచే మొక్కలకు ఎరువుగా దాన్ని వినియోగిస్తున్నారు. వ్యర్థాల రవాణా, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చుల కోసం ఇంటికి రూ. వంద చొప్పున వసూలు చేస్తున్నాం. దానికి బదులుగా కంపోస్ట్ అందజేస్తున్నాం. మరోవైపు వీధుల్లో, నగర శివార్లలో ఉన్న చెత్త కుప్పలను రీసైకిల్ చేసే బాధ్యత కూడా తీసుకున్నాం" అంటున్నారు మానా. ఆమె కృషితో ప్రస్తుతం నెలకు 500 టన్నుల చెత్త సేకరణ, రీసైక్లింగ్ జరుగుతోంది. కొన్ని పదుల మందికి ఉపాధి లభిస్తోంది. "కుటుంబ వ్యాపారాలను వదిలేసినందుకు ఎన్నడూ చింతించలేదు. నేను చేస్తున్న పనికి గర్వపడుతున్నాను. గతంలోకన్నా ఇప్పుడు ప్రజలలో ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత పట్ల చైతన్యం పెరుగుతోంది. ఇది మంచి పరిణామం. ఇళ్లలోని వ్యర్థాలు చెత్త కుప్పల మీదకు వెళ్ళకూడదనేదే నా లక్ష్యం. మరిన్ని హౌసింగ్ సొసైటీలతో, వ్యక్తులతో భాగస్వామ్యం కావడం ద్వారా... నా ప్రయత్నాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నాను. ఆ దిశగా పని చేస్తున్నాను" అని చెబుతున్నారు మానా.



స్నానం ఎలా చేయాలి?



శరీరం పరిశుభ్రంగా ఉండాలంటే స్నానం తప్పనిసరి. ప్రతిరోజూ సరైన పద్ధతిలో స్నానం చేయని పక్షంలో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. స్నానం చేయాల్సిన విధానం గురించి ఇలా తెలియజేస్తున్నారు.

- స్నానానికి మరీ చల్లటి నీళ్లు, మరీ వేడి నీళ్లు ఉపయోగించకూడదు. నీళ్లు ఒంటిపై పోసుకోగానే హాయి కలిగే విధంగా ఉండాలి. ఏ కాలంలో నైనా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.
- ముందుగా ముఖం, కాళ్లు, చేతులను నీటితో తడపాలి. తరవాత మిగిలిన శరీర భాగాలు తడిసేలా నీరు పోసుకోవాలి.
- స్నానానికి సబ్బు తప్పనిసరి. అయినప్పటికీ శరీరాన్ని ఎక్కువగా సబ్బుతో రుద్దకూడదు. అలా చేస్తే చర్మం పొడిబారుతుంది. ముందుగా చేతులతో సబ్బు నురుగు తీసుకుని దాంతో ముఖాన్ని రుద్దుకొని వెంటనే నీటితో శుభ్రం చేసుకోవాలి. తరవాత మెడ, భుజాలు, చేతులు, ఛాతీ, వీపు, పొట్టను సబ్బుతో రుద్దుకోవాలి. ముఖం మీదనుంచి నీళ్లు పోసుకుంటూ సబ్బు పూర్తిగా వదిలేలా శరీర భాగాలను తోముకోవాలి. చివరగా కాళ్లు, పాదాలు, వేళ్లను సబ్బుతో రుద్ది అది పూర్తిగా వదిలేవరకు నీళ్లు పోసుకుంటూ తోముకోవాలి.
- తలస్నానం చేసేటప్పుడు ముందుగా శరీర భాగాలను నీళ్లతో తడిపి ఆ తరవాతనే తలపై నీళ్లు పోసుకోవాలి. అలా కాకుండా ఒక్కసారిగా తలపై నీళ్లు కుమ్మరించుకుంటే తలనొప్పి వస్తుంది. ముందుగా తలకు షాంపూ పట్టించి రెండు నిమిషాలు ఆగాలి. తరవాత తలపై నీళ్లు చిలకరించుకుంటూ శిరోజాలకు అంటిన షాంపూను వదిలించాలి. తల మొత్తాన్ని నీళ్లతో శుభ్రం చేసుకున్న తరవాతనే శరీర భాగాలకు సబ్బు పట్టించాలి. ప్రతిరోజూ తలస్నానం చేయడం మంచిది కాదు. వారానికి రెండుసార్లు చేస్తే చాలు.
- వేసవికాలంలో ఉదయం నిద్ర లేవగానే చల్లటి నీళ్లతో స్నానం చేయాలి. పగలంతా బయట పనులతో అలసిపోయి ఇంటికి రాగానే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.

ఐపీఎల్‌లో నేడు	వేదిక ముంబై
ముంబై X కోల్‌కతా	రా.7.30



స్టేడియం 'పైలాన్' ఆవిష్కరణ

పాల్గొన్న మంత్రి లోకేశ్, ఐసీసీ చైర్మన్ జైషా

విశాఖపట్నం, స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, సన్‌రైజర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రముఖులు సందడి చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు కేశినేని చిన్ని, సానా సతీష్, మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఏసీఏ మాజీ కార్యదర్శి చాముండేశ్వర్‌నాథ్ మ్యాచ్‌ను వీక్షించారు. కాగా, మ్యాచ్‌కు ముందు.. స్టేడియం ఆధునికీకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రి లోకేశ్, జైషా, రోజర్ బిన్నీ ఆవిష్కరించారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
ఢిల్లీ	2	2	0	0	4	1.320
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
గుజరాత్	2	1	1	0	2	0.625
పంజాబ్	1	1	0	0	2	0.550
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
ముంబై	2	0	2	0	0	-1.163

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఈసారి అలవోకగా మూడు వందల పరుగులు చేసే జట్టుగా క్రికెట్ పండితుల అంచనాల మధ్య ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ భీకరంగా ఆడింది..కానీ తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ సన్'రైజింగ్'ను అడ్డుకున్నాయి..ఆరంభ మ్యాచ్‌లో హద్దులు లేకుండా చెలరేగిన హైదరాబాద్ బ్యాటర్లకు లఖ్‌నవూ, ఢిల్లీ బౌలర్లు ముకుతాడు వేశారు..దాంతో రెండు వరుస పరాజయాలతో హైదరాబాద్ బ్యాటింగ్ డొల్లతనం బయటపడింది.

వణికించిన స్టార్క్

రైజర్స్ బేజార్!


స్టార్క్ (5/35)

1 టీ20లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం స్టార్క్‌కు ఇదే తొలిసారి.

డుప్లెసి మెరుపు హాఫ్ సెంచరీ ● ఏడు వికెట్లతో ఢిల్లీ ఘన విజయం

విశాఖపట్నం: రెండో సొంత మైదానం వైజాగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుతంగా ఆడింది. తొలి మ్యాచ్‌లో ఓటమి అంచులనుంచి విజయం అందుకొని భళా అనిపించిన ఢిల్లీ, అదే జోరులో..అరవీర భయంకర బ్యాటింగ్ లైనప్‌తో ప్రత్యర్థి జట్ల గుండెల్లో గుబులు రేపుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను నేలకు దించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్లతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. వరుసగా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో క్యాపిటల్స్ రెండో స్థానానికి దూసుకొచ్చింది. తొలుత సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అనికేత్ వర్మ (41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 74) హాఫ్ సెంచరీతో చెలరేగగా, క్లాసెన్ (32), హెడ్ (22) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్ (5/35) టీ20 కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్‌తో హైదరాబాద్ వెన్ను విరిచాడు. స్వల్ప ఛేదనను ఢిల్లీ 16 ఓవర్లలో 166/3 స్కోరుతో ముగించింది. డుప్లెసి (27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 50) మెరుపు అర్ధ శతకం చేయగా, మెక్‌గర్క్ (38), అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) సత్తా చాటారు. లెగ్గీ జీషన్ అన్సారీ (3/42) మూడు వికెట్లు తీశాడు.

అనికేత్ తప్ప అంతా ఫ్లాప్..: క్రీజులో అడుగు పెట్టిందే తడవుగా భారీ షాట్లతో విరుచుకు పడాలనే ఆలోచన హైదరాబాద్ కొంపముంచింది. అదేసమయంలో..బ్యాటింగ్ అనుకూలించిన పిచ్‌పై తెలివిగా ఆడిన అనికేత్ వర్మ..ఢిల్లీ బౌలర్ల భరతం పట్టాడు. అనికేత్ పుణ్యాన సన్‌రైజర్స్‌కు ఆ స్కోరైనా సాధ్యమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్‌ను పేసర్ స్టార్క్ వణికించాడు. లేని సింగిల్ కోసం అభిషేక్‌ను పిలిచిన హెడ్ అతడి రనౌట్‌కు కారణమవడంతో మొదటి ఓవర్లోనే హైదరాబాద్ వికెట్ చేజార్చుకుంది. ఇక.. తన రెండో ఓవర్లో ఇషాన్ కిషన్ (2), నితీశ్ (0)లను పెవిలియన్ చేర్చిన స్టార్క్ సన్‌రైజర్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. కొద్దిసేపటికే హెడ్‌ను కూడా స్టార్క్ క్యాచవుట్ చేయడంతో పవర్ ప్లేలో హైదరాబాద్ 58/4తో తీవ్ర ఇక్కట్లలో పడింది. ఈ దశలో అనికేత్, క్లాసెన్ ఐదో వికెట్‌కు 42 బంతుల్లో 77 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. ముఖ్యంగా ఢిల్లీ స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకున్న అనికేత్ భారీ షాట్లతో అలరించాడు. క్లాసెన్ దూకుడుకు మోహిత్ చెక్ పెట్టగా, అభినవ్ (4), కమిన్స్ (2)లను పెవిలియన్ చేర్చిన కుల్దీప్ ఆపై అనికేత్‌నూ అవుట్ చేశాడు.


డుప్లెసి (50)

ఢిల్లీ అలవోకగా..: స్వల్ప లక్ష్యాన్ని ఢిల్లీ ఆడుతు..పాడుతు ఛేదించింది. ఓపెనర్లు డుప్లెసి, మెక్‌గర్క్ ఆరంభం నుంచే హైదరాబాద్ బౌలర్లపై ఎదురు దాడికి దిగారు. తొలి వికెట్‌కు 55 బంతుల్లోనే 81 పరుగులు జత చేశారు. స్పిన్నర్ జీషన్ ఒకే ఓవర్లో డుప్లెసి, మెక్‌గర్క్‌ను ఆపై కేఎల్ రాహుల్ (15)ను అవుట్ చేశాడు. కానీ స్టబ్స్ (21 నాటౌట్) జతగా అభిషేక్ పోరెల్ జట్టును విజయ తీరాలకు చేర్చాడు.

స్కోరుబోర్డు


సన్‌రైజర్స్: అభిషేక్ (రనౌట్) 1, హెడ్ (సి) రాహుల్ (బి) స్టార్క్ 22, ఇషాన్ (సి) స్టబ్స్ (బి) స్టార్క్ 2, నితీశ్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 0, అనికేత్ (సి) మెక్‌గర్క్ (బి) కుల్దీప్ 74, క్లాసెన్ (సి) నిగమ్ (బి) మోహిత్ 32, అభినవ్ (సి) డుప్లెసి (బి) కుల్దీప్ 4, కమిన్స్ (సి) మెక్‌గర్క్ (బి) కుల్దీప్ 2, ముల్డర్ (సి) డుప్లెసి (బి) స్టార్క్ 9, హర్షల్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 5, షమి (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.4 ఓవర్లలో 163 ఆలౌట్; వికెట్ల పతనం:** *1-11, 2-20, 3-25, 4-37, 5-114, 6-119, 7-123, 8-148, 9-162, 10-163;* **బౌలింగ్:** *స్టార్క్ 3.4-0-35-5, ముకేశ్ 2-0-17-0, అక్షర్ పటేల్ 4-0-43-0, విప్రాజ్ నిగమ్ 2-0-21-0, మోహిత్ 3-0-25-1, కుల్దీప్ 4-0-22-3.*

ఢిల్లీ: ఫ్రేజర్ మెక్‌గర్క్ (సి అండ్ బి) జీషన్ 38, డుప్లెసి (సి) ముల్డర్ (బి) జీషన్ 50, అభిషేక్ పోరెల్ (నాటౌట్) 34, కేఎల్ రాహుల్ (బి) జీషన్ 15, స్టబ్స్ (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 16 ఓవర్లలో 166/3; వికెట్ల పతనం:** *1-81, 2-96, 3-115;* **బౌలింగ్:** *షమి 3-0-31-0, అభిషేక్ శర్మ 3-0-27-0, కమిన్స్ 2-0-27-0, హర్షల్ 3-0-17-0, జీషన్ అన్సారీ 4-0-42-3, ముల్డర్ 1-0-16-0.*

చెన్నై మళ్లీ..

వరుసగా రెండో ఓటమి
రాజస్థాన్ బోణీ

గువాహటి: ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన పోరులో రాజస్థాన్ రాయల్స్ పట్టు వదల్లేదు. నితీశ్ రాణా (36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 81) అదిరే ఆటకు.. స్పిన్నర్ వనిందు హసరంగ (4/35) మ్యాజిక్ బంతులు తోడవ్వడంతో ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో గట్టెక్కింది. దీంతో ఆడిన మూడో మ్యాచ్‌లో రాజస్థాన్ బోణీ చేయగా.. చెన్నైకిది వరుసగా రెండో ఓటమి. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 182/9 స్కోరు చేసింది. రియాన్ పరాగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) రాణించాడు. నూర్, పథిరన, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 176/6 స్కోరుకే పరిమితమైంది. ఫామ్‌లో ఉన్న రచిన్ డకౌట్ కాగా, కెప్టెన్ రుతురాజ్ (63) ఆదుకునే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ రాహుల్ త్రిపాఠి (23)తో కలిసి రుతురాజ్ రెండో వికెట్‌కు 46 రన్స్ జోడించాడు. శివమ్ దూబే (18), విజయ్ శంకర్ (9) విఫలంకాగా కీలక సమయంలో రుతురాజ్‌ను హసరంగ దెబ్బతీశాడు. ఈ దశలో జడేజా (32 నాటౌట్)-ధోనీ (16) గెలిపించే ప్రయత్నం చేశారు. అయితే ఆఖరి ఓవర్‌లో విజయానికి 20 రన్స్ అవసరమవగా.. తొలి బంతికే ధోనీ అవుటవడంతో చెన్నై ఆశలు వదులుకుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాణా నిలిచాడు.


నితీశ్ రాణా (81)

నితీశ్ రాణాదే జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వన్‌డౌన్ బ్యాటర్ నితీశ్ రాణా తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. పేస్, స్పిన్ ఏదైనా బంతి బౌండరీ అవలే అన్నట్టుగా అతడి ఆటతీరు సాగింది. తను క్రీజులో ఉన్నంతసేపు 200 స్కోరు కూడా సులువే అనిపించింది. అయితే సరైన సమయంలో పుంజుకున్న చెన్నై బౌలర్లు డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. కెప్టెన్ పరాగ్ సైతం వేగంగా ఆడే ప్రయత్నం చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా సహకరించలేదు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జైస్వాల్ (4)ను పేసర్ ఖలీల్ అవుట్ చేశాడు. ఆ తర్వాత శాంసన్ (20)తో కలిసి రాణా రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 82 రన్స్ జత చేశాడు. ఓవర్టన్‌ను లక్ష్యంగా చేసుకుని నాలుగో ఓవర్‌లో 4,4,6తో 16 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే అశ్విన్‌ను బాదేస్తూ వరుసగా 6,6,4తో అదుర్స్ అనిపించాడు. ఇక ఖలీల్ ఓవర్‌లో 4,4,6 సాధించడంతో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 79/1తో నిలిచింది. రాణా కూడా 21 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే చెన్నై తురుపుముక్క స్పిన్నర్ నూర్ తన తొలి ఓవర్‌లోనే శాంసన్‌ను అవుట్ చేసి రిలీఫ్‌నిచ్చాడు. ఆర్ఆర్ స్కోరు 11వ ఓవర్‌లోనే వంద దాటింది. మరోవైపు రాణా అశ్విన్ ఓవర్‌లో వరుసగా 6,4 బాది వెంటనే అవుటవడంతో మూడో వికెట్‌కు పరాగ్‌తో 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత సీఎస్‌కే బౌలర్లు ఆధిపత్యం చూపి వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ పరుగులను కట్టడి చేశారు. పరాగ్ ఉన్న కాసేపు బ్యాట్ ఝుళిపించినా పథిరన యార్కర్‌కు బౌల్డ్ కాగా, హెట్‌మయెర్ (19) భారీ షాట్లు ఆడలేకపోయాడు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) అశ్విన్ (బి) ఖలీల్ 4, శాంసన్ (సి) రచిన్ (బి) నూర్ 20, నితీశ్ రాణా (స్టంప్డ్) ధోనీ (బి) అశ్విన్ 81, పరాగ్ (బి) పథిరన 37, జురెల్ (సి) పథిరన (బి) నూర్ 3, హసరంగ (సి) శంకర్ (బి) జడేజా 4, హెట్‌మయెర్ (సి) అశ్విన్ (బి) పథిరన 19, ఆర్చర్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 0, కార్తికేయ (రనౌట్) 1, తీక్షణ (నాటౌట్) 2, తుషార్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 182/9; వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-124, 4-134, 5-140, 6-166, 7-174, 8-175, 9-176; **బౌలింగ్:** ఖలీల్ 4-0-38-2, ఓవర్టన్ 2-0-30-0, అశ్విన్ 4-0-46-1, నూర్ అహ్మద్ 4-0-28-2, పథిరన 4-0-28-2, జడేజా 2-0-10-1.

చెన్నై: రచిన్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 0, రాహుల్ త్రిపాఠి (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 23, రుతురాజ్ (సి) జైస్వాల్ (బి) హసరంగ 63, శివమ్ దూబే (సి) పరాగ్ (బి) హసరంగ 18, విజయ్ శంకర్ (బి) హసరంగ 9, జడేజా (నాటౌట్) 32, ధోనీ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 16, ఓవర్టన్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-0, 2-46, 3-72, 4-92, 5-129, 6-164; **బౌలింగ్:** ఆర్చర్ 3-1-13-1, తుషార్ 4-0-45-0, సందీప్ 4-0-42-1, తీక్షణ 4-0-30-0, హసరంగ 4-0-35-4, కార్తికేయ 1-0-10-0.

బెదిరింపులు → ఒత్తిళ్లు ఎవరివి?



- సన్‌రైజర్స్, హెచ్‌సీఏ మధ్య ఈ-మెయిల్స్ వివాదం
- పాసుల కోసం హెచ్‌సీఏ బ్లాక్‌మెయిల్ చేస్తోందన్న రైజర్స్
- ఎస్‌ఆర్‌హెచ్ అభియోగాలను తోసిపుచ్చిన హెచ్‌సీఏ
- ఒక బాక్సులో 50 టిక్కెట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్న

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం తమను బెదిరిస్తోందని సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) యాజమాన్యం ఆరోపించడం దుమారం రేపుతోంది. హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యుల తీరు మారకపోతే తాము హైదరాబాద్ నుంచి వేదిక తరలిస్తామని హెచ్‌సీఏలోని ప్రధాన అధికారికి ఎస్‌ఆర్‌హెచ్ ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించినట్టు తెలుస్తోంది. అయితే తమకు ఎస్‌ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి మెయిల్ రాలేదని హెచ్‌సీఏ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ఎస్‌ఆర్‌హెచ్ అభియోగాలను కూడా తోసిపుచ్చింది. అసలు ఈ వివాదం ఎలా మొదలైందన్న దానిపై పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

కార్పొరేట్ బాక్స్ సామర్థ్యం ఎంత?

ఉప్పల్ స్టేడియంలో మొత్తం కార్పొరేట్ బాక్సుల సంఖ్య 58. ఇందులో ఒక్కో బాక్సులో అధికారికంగా 20 టిక్కెట్లు జారీ చేస్తారు. కొన్ని సందర్భాల్లో అనధికారికంగా మరో 5 నుంచి 10 టిక్కెట్లు కూడా ముద్రిస్తారని సమాచారం. ఒప్పందం ప్రకారం స్టేడియం మొత్తం సీటింగ్ సామర్థ్యంలో 10 శాతం (3,900) కాంప్లిమెంటరీ పాసులను హెచ్‌సీఏకు ఎస్‌ఆర్‌హెచ్ ఇవ్వాలి. ఇందులో నుంచి హెచ్‌సీఏ తమ క్లబ్‌లకు 2,832 టిక్కెట్లు ఇస్తుంది. మిగిలినవి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బందోబస్తు నిర్వహించే పోలీసులకు, సీఎంవో, మంత్రులు, రాజకీయ ప్రముఖులకు హెచ్‌సీఏ ఇస్తుందని సమాచారం. భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు స్టేడియంలోని మొత్తం టిక్కెట్లు హెచ్‌సీఏ ఆధీనంలోనే ఉంటాయి కాబట్టి కాంప్లిమెంటరీ పాసుల పంపకాలు సాఫీగానే జరుగుతాయి. ఐపీఎల్‌కొచ్చేసరికి స్టేడియాన్ని ఎస్‌ఆర్‌హెచ్‌కు అద్దెకు ఇస్తుంది కాబట్టి ఏర్పాట్లు మొదలు టిక్కెట్ల వ్యవహారం మొత్తం ఆ జట్టు యాజమాన్యం చేతిలోనే ఉంటుంది. అయితే, పదేళ్లుగా లేని సమస్య ఇప్పుడు ఉత్పన్నమవడానికి కారణం ఎఫ్12-ఎ బాక్సు టిక్కెట్ల వద్దే మొదలైందని తెలుస్తోంది.

ఇదీ.. సన్‌రైజర్స్ అభియోగం

అదనంగా కాంప్లిమెంటరీ పాసులు ఇవ్వాలని హెచ్‌సీఏ ఒత్తిడి చేస్తున్నదని ఎస్‌ఆర్‌హెచ్ ప్రధాన అభియోగం. గత మ్యాచ్‌కు ముందు స్టేడియంలోని ఎఫ్-3 బాక్సుకు హెచ్‌సీఏ తాళాలు వేసిందని, ఇలాంటి ధోరణిలో హైదరాబాద్‌లో మ్యాచ్‌లు నిర్వహించలేమని, హెచ్‌సీఏకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ఇష్టం లేకపోతే ఆ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని హెచ్‌సీఏ అధికారికి పంపిన ఈ-మెయిల్‌లో ఎస్‌ఆర్‌హెచ్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో బీసీసీఐ, ఐపీఎల్ పాలకమండలి జోక్యం చేసుకోవాలని కోరనున్నట్టు కూడా ఆ మెయిల్‌లో పేర్కొందట.

వివాదానికి కేంద్ర బిందువు ఎఫ్12-ఎ!

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్టేడియం దక్షిణ భాగంలోని మొదటి అంతస్తులో ఉన్న ఎఫ్12-ఎ బాక్సులో ఎస్‌ఆర్‌హెచ్ చాలాకాలంగా 50 టిక్కెట్లు (కాంప్లిమెంటరీ పాసుల) హెచ్‌సీఏకు ఇస్తోంది. ఒక బాక్సు సామర్థ్యం 20 టిక్కెట్లే కాబట్టి మహా అయితే మరో 10 కలిపి ఎఫ్12-ఏలో 30 టిక్కెట్లు ఇవ్వాలని, మిగిలిన 20 టిక్కెట్లు వేరే బాక్సుల్లో సర్దుబాటు చేయాల్సిందిగా హెచ్‌సీఏ సభ్యులు సీజన్ ఆరంభానికి ముందే ఎస్‌ఆర్‌హెచ్‌ను కోరారు. దానికి రైజర్స్ అంగీకరించింది. అయితే, ఈనెల 23న రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌కు సుమారు 15 బాక్సులు ఖాళీగా ఉన్నా ఎస్‌ఆర్‌హెచ్ మళ్లీ ఎఫ్12-ఏ బాక్సులో 50 టిక్కెట్లు కేటాయించడం హెచ్‌సీఏకు రుచించలేదు. దీంతో ఇదే విషయమై, ఈనెల 27న లఖ్‌నవూతో మ్యాచ్ సందర్భంగా హెచ్‌సీఏ నిరసన తెలపడంతో తదుపరి మ్యాచ్‌కు సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌ఆర్‌హెచ్ హామీ ఇచ్చింది.

రహస్యంగా 'కాంప్లిమెంటరీ'ల లెక్క...

అసలు హెచ్‌సీఏకి ఇచ్చేవి కాకుండా ఎస్‌ఆర్‌హెచ్ ఎన్ని కాంప్లిమెంటరీ పాసులు జారీ చేస్తోంది.. ఎన్ని టిక్కెట్లను అమ్మకానికి పెడుతుందనే దానికి లెక్కా పత్రం లేకపోవడం చర్చనీయాంశమైంది. ఎస్‌ఆర్‌హెచ్ సోషల్ మీడియా ఖాతాల్లో తప్ప టిక్కెట్ల విక్రయం గురించి ఆ జట్టు యాజమాన్యం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. మ్యాచ్ టిక్కెట్ల ధరలను కూడా డిమాండ్‌ను బట్టి ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో విధంగా నిర్ణయిస్తున్నారని, టిక్కెట్ రేట్‌ల పట్ల ఆఖరికి ఎస్‌ఆర్‌హెచ్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కూడా సమాచారం ఇవ్వడం లేదని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కొత్త యాప్‌లో టిక్కెట్లు విక్రయించడం, వాటి అమ్మకాలపై సమాచారం ఇవ్వకపోవడంపై కూడా అభిమానులు విమర్శలు కురిపిస్తున్నారు. ఇకపోతే స్టేడియంలోని కొన్ని స్టాండ్లలో టిక్కెట్లు కొనుగోలు చేసి వెళ్లిన వారికి సీట్లు కూడా దొరకడం లేదని, సామర్థ్యానికి మించి టిక్కెట్లు విక్రయిస్తున్నారని, సదుపాయాలు కూడా బాగా లేవన్న ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంగా హెచ్‌సీఏ-ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మొదలైన కాంప్లిమెంటరీ పాసుల వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి.

దీపక్, ఉదిత్‌కు రజతాలు

ఆసియా రెజ్లింగ్‌లో దినేశ్‌కు కాంస్యం


దీపక్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మరో మూడు పతకాలు దక్కించుకుంది. పురుషుల 92 కిలోల విభాగంలో దీపక్ పూనియా, 61 కిలోల కేటగిరిలో ఉదిత్ రజత పతకాలతో మెరవగా, పురుషుల 125 కిలోల విభాగంలో దినేశ్ కంచు మోత మోగించాడు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో పూనియా 0-10తో ఇరాన్ రెజ్లర్ అమీర్‌హొసేని చేతిలో, ఉదిత్ 4-6తో టకారా (జపాన్) చేతిలో ఓడి రజతాలకు పరిమితమయ్యారు. ఇక కాంస్య పతక పోరులో దినేశ్ 14-12తో తుర్క్‌మెనిస్థాన్ రెజ్లర్ సపరోవ్‌ని ఓడించాడు.

అక్టోబరులో ఆసీస్ పర్యటనకు..

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం గతేడాది చివర్లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా ఈ ఏడాది కూడా అక్కడ పర్యటించబోతోంది. అయితే ఈసారి టెస్టు సిరీస్ కోసం కాకుండా వన్డే, టీ20ల్లో తలపడేందుకు వెళ్లనుంది. అక్టోబరు 19 నుంచి నవంబరు 8 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20ల కోసం భారత్ తమ దేశానికి రానుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో వన్డేలు జరుగనుండగా.. అక్టోబరు 29 నుంచి కాన్‌బెర్రా, మెల్‌బోర్న్, హోబర్ట్, గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్‌లలో టీ20లు నిర్వహించనున్నారు. సెప్టెంబరులో జరిగే ఆసియాకప్ తర్వాత భారత జట్టు ఆసీస్ టూర్‌కు వెళ్లనుంది.

వచ్చే ఏడాది మహిళల జట్టు కూడా..: భారత మహిళల జట్టు కూడా వచ్చే ఏడాది మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం ఆసీస్ పర్యటనకు రానుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. భారత్-ఆసీస్ మహిళల జట్ల మధ్య ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు మూడు టీ20లు, 24 నుంచి మార్చి 1 వరకు మూడు వన్డేలతో పాటు మార్చి 6-9 మధ్య ఏకైక టెస్టు జరుగుతుందని వెల్లడించింది.

చిత్రజ్యోతి
SINCE 1965

కళారత్న అవార్డుల ప్రదానం

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల ప్రముఖులకు కళారత్న (హంస) అవార్డులు, ఉగాది పురస్కారాలను ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు అందజేశారు. సినిమా విభాగంలో నటుడు పృథ్వీరాజ్, నృత్య విభాగంలో ప్రముఖ సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సాయి సౌజన్యకు కళారత్న అవార్డులు బహూకరించారు.




చిరంజీవి చిత్రానికి శ్రీకారం

అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా 157' - వర్కింగ్ టైటిల్) సెట్స్‌పైకి వెళ్లింది. ఉగాది సందర్భంగా ఆదివారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలు పెట్టారు. ముహూర్తపు షాట్‌కు వెంకటేశ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత దిల్‌రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. 'విభిన్నమైన వినోదాత్మక చిత్రాలను రూపొందించి విజయాలు అందుకున్న అనిల్ రావిపూడి మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది. మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరిస్తుంది' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఘన విజయం సాధించిన నేపథ్యంలో 'మెగా 157'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి నటించిన 'విశ్వంభర' విడుదలకు సిద్ధమవుతోంది.



ధర్మం కోసం యుద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథగా తెరకెక్కుతోన్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా అలరించనున్నారు. ఉగాది సందర్భంగా చిత్రబృందం పవన్ కల్యాణ్ కొత్త లుక్‌ను విడుదల చేసింది. ఎరుపు రంగు దుస్తులు ధరించి, ఓ చేతిలో పిడిబాకు, మరో చేతిలో చిన్న కడియం పట్టుకొని పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్‌లో కనిపించారు. 'ధర్మం కోసం యుద్ధం. హరిహర వీరమల్లు సాహస గాథను చూసేందుకు సిద్ధంగా ఉండండి' అని ఈ సందర్భంగా మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఎ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పిస్తున్నారు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. 'హరిహర వీరమల్లు' రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మే 9న తొలిభాగం ప్రేక్షకుల ముందుకు రానుంది.

కమర్షియల్ ట్రెండ్‌ను సెట్ చేసింది

- నందమూరి బాలకృష్ణ



'**తె**లుగు చలన చిత్ర పరిశ్రమలో కమర్షియల్ ట్రెండ్‌ను సెట్ చేసిన చిత్రం 'ఆదిత్య 369'. ఒక కొత్త కాన్సెప్ట్‌తో ఆ చిత్రాన్ని చేయడం నాకు చాలా ఆనందం కలిగించింది. అందుకే ఇది ఈ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమమే తప్ప రీ రిలీజ్ వేడుక అని భావించడం లేదు. త్వరలో ఈ చిత్రానికి సీక్వెల్ మొదలుపెట్టబోతున్నాం' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 4న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'నాన్నగారి స్ఫూర్తితో ఈ చిత్రంలో శ్రీకృష్ణదేవరాయలు పాత్ర చేశాను. ఈ సినిమా వెనుకున్న మూలస్తంభం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఆయనతో పాటు శివలెంక కృష్ణప్రసాద్, సింగీతం గార్లకు రుణపడి ఉంటాను' అన్నారు. 'ఈ సినిమా విజయంలో సింహభాగం బాలకృష్ణకే దక్కుతుంది. శ్రీకృష్ణ దేవరాయల పాత్రను అంత అద్భుతంగా పోషించగల నటుడు అప్పుడూ, ఇప్పుడూ బాలకృష్ణ తప్ప మరొకరు లేరు' అని సింగీతం శ్రీనివాసరావు తన వీడియో సందేశంలో ప్రశంసించారు. ఈ సినిమాను నిర్మించడం తనకు దక్కిన అదృష్టం అని శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు.

బాధపెట్టాను... క్షమించండి



'**ఎ**ల్2: ఎంపురాన్' చిత్రంలోని కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన నేపథ్యంలో కథానాయకుడు మోహన్‌లాల్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పారు. 'రాజకీయం, సామాజిక అంశాలు కొన్ని 'ఎంపురాన్'లో భాగమయ్యాయి. అవి కొందరిని బాధించాయి. నా సినిమాలు ఏ రాజకీయ ఉద్యమాన్ని, భావజాలాన్ని, మతాన్ని కించపర్చకుండా చూడటం నటుడిగా నా బాధ్యత. అందుకే నా తరఫున, చిత్రబృందం తరఫున క్షమాపణలు చెబుతున్నా' అని అన్నారు. ఇదే అంశంపై చిత్ర నిర్మాత గోకులం గోపాలన్ మాట్లాడుతూ 'సినిమాలో చూపించిన ఏదైనా సన్నివేశం లేదా సంభాషణలు ప్రేక్షకుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంటే వాటిని వెంటనే తొలగించాలని దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు చెప్పా. ఇప్పటికే కొన్ని పదాలను మ్యూట్ చేశాం' అని అన్నారు. కాగా, కేరళ సీఎం పినరయి విజయన్ కుటుంబంతో కలసి 'ఎంపురాన్' చిత్రాన్ని చూశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి మద్దతు పలికారు.

మాజీ మంత్రి కాకాణికి నోటీసులు


నెల్లూరులో కాకాణి ఇంటి గేటుకు నోటీసు అంటించిన పోలీసులు

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. వరదాపురంలోని రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై మైనింగ్ డీడీ ఫిర్యాదు మేరకు పొదలకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి రావాలని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179/సీఆర్‌పీసీ 160 కింద ఇచ్చిన ఈ నోటీసులో పేర్కొన్నారు. అయితే కాకాణి గత రెండ్రోజులుగా నెల్లూరులో కనిపించడం లేదు. పోలీసులకు కూడా అందుబాటులోకి రాలేదు. దీంతో వీటిని స్వయంగా అందించేందుకు పొదలకూరు పోలీసులు ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసానికి వెళ్లారు. అయితే ఆయనతో పాటు కుటుంబ సభ్యులెవరూ అక్కడ లేరు. ఇంట్లోని పనివారిని ప్రశ్నించగా.. తమకు తెలియదని సమాధానమిచ్చారు. దీంతో కాకాణి ఇంటి గేటు, గోడలకు పోలీసులు నోటీసులు అంటించి వెళ్లారు. ఆ తర్వాత ఫోన్లో ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

ఏఐ స్టార్టప్‌ను నెలకొల్పి స్ఫూర్తిగా నిలిచావు

» దివ్యాంగ విద్యార్థికి మంత్రి లోకేశ్ ప్రశంస

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో గతంలో ఎన్ఐటీ-కాలికట్‌లో సీటు పొందిన దివ్యాంగ విద్యార్థి రఘునాథరెడ్డి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ నెలకొల్పారు. ఈ విషయాన్ని రఘునాథ్ ఎక్స్ ద్వారా తెలియజేశారు. లోకేశ్ ఇచ్చిన సహకారం, మార్గదర్శనం వల్లే రాణిస్తున్నానని రఘునాథ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. 'మీ విజయంలో నేను చిన్న పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది. మీ బృందం భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి. స్టార్టప్‌ను ప్రారంభించడం ద్వారా ఎందరో విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తున్నారు' అని పేర్కొన్నారు. గత ఏడాది జూలైలో దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్ అప్‌లోడ్ విషయంలో సమస్య ఎదురైంది. ఆ సమస్యను విద్యార్థులు వాట్సాప్ మెసేజ్ ద్వారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన లోకేశ్.. సమస్య పరిష్కారానికి ప్రత్యేక జీవో ఇచ్చారు. దీంతో వారంతా ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశం పొందారు. అలా సీటు పొందినవారిలో రఘునాథ్ కూడా ఉన్నారు.

పరిశ్రమకు అనుమతుల కోసం 70 వేలు లంచం

» సీబీఐకి పట్టుబడిన బీఐఎస్ శాస్త్రవేత్త

విశాఖపట్నం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఒక పరిశ్రమకు అనుమతులకు సంబంధించి రూ.70 వేలు లంచం తీసుకుంటూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) విజయవాడ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్‌సాగర్ ముత్యాలు సీబీఐకి పట్టుబడ్డారు. ఆయనతోపాటు లంచం ఇచ్చిన పరిశ్రమ యజమానిని కూడా సీబీఐ విశాఖపట్నం బ్రాంచి అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. సీబీఐ డీఐజీ కార్యాలయం ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించింది. బెంగళూరుకు చెందిన క్రోనాక్స్ ఇంజనీరింగ్ అండ్ ప్రెషర్ వెసెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 12,500 సిలిండర్ల తయారీకి బీఐఎస్ ఆమోదం కోసం ఆ కంపెనీ యజమాని వి.లక్ష్మీనారాయణరెడ్డి అలియాస్ బాబురెడ్డి, కంపెనీ పార్ట్‌నర్, బాబురెడ్డి సోదరుడు వెంకటరెడ్డి శివశంకర్ రెడ్డి, కంపెనీ క్వాలిటీ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌తోపాటు మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు విజయవాడ బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్‌సాగర్‌ను కలిశారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలంటే తనకు రూ.70వేలు లంచం ఇవ్వాలని రమాకాంత్‌సాగర్ తేల్చి చెప్పారు. కంపెనీ ప్రతినిధులు అంగీకరించడంతో ఆదివారం హైదరాబాద్‌కు వచ్చి తనను కలవాలని రమాకాంత్‌సాగర్ సూచించారు. సీబీఐ అధికారులకు ఈ సమాచారం అందడంతో హైదరాబాద్‌లో బాబురెడ్డి రూ.70 వేలను రమాకాంత్‌సాగర్ ఇంట్లో ఇచ్చి వస్తుండగా పట్టుకున్నారు.

ఆసక్తి.. ఆ 'శక్తి'.. తగ్గుతున్నాయ్!



(మొదటి పేజీ తరువాయి)

విలాసవంతమైన జీవితాలు.. ఇప్పుడు కష్టపడితే రేపు సుఖపడొచ్చన్న భావనతో అలుపెరగకుండా శ్రమిస్తున్న జంటలు సహా వృత్తిగతంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిరంతరం తపించే నవతరం వరకూ సంసార 'సౌఖ్యాన్ని' మాత్రం ఆస్వాదించలేక పోతున్నారు!! భవిష్యత్తులో ఆనందంగా గడపాలనే ఆశతో వర్తమానాన్ని చీకటి చేసుకుంటున్నారు! శృంగారం అంటేనే ఆమడదూరం ఉంటున్నారు!! రసస్పందనలు లేకుండా 'తిన్నామా.. పడుకున్నామా.. ఆఫీసుకెళ్లొచ్చామా..' అన్నట్లు యాంత్రికంగా బతికేస్తున్నారు!! భాగస్వామితో శృంగారం అంటేనే.. 'ప్చ్'.. అనేస్తున్నారు. తనివితీరా సంసార సుఖాన్ని అనుభవించకుండానే చాలామంది 'పిల్లలు పుట్టడం లేదంటూ' సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరిగేస్తున్నారు!! నేటి తరం యువత ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సంసారమే సరిగా చేయకుండా..

అసలు సంసారమే సరిగా చేయకుండా పిల్లలు కావాలనుకొని వస్తున్న జంటల సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. హైపోయాక్టివ్ సెక్సువల్ డిజైర్ డిజార్డర్ (హెచ్ఎస్‌డీడీ)తో బాధపడుతున్న వారు ఎక్కువయ్యారని అంటున్నారు. హెచ్ఎస్‌డీడీ అంటే లైంగిక ఆసక్తి/వాంఛలు లేకపోవడమే. గతంలోనూ ఈ హెచ్ఎస్‌డీడీ కేసులు ఉన్నప్పటికీ ఇటీవలి కాలంలో బాగా పెరిగాయని చెబుతున్నారు. కొన్ని జంటలు పెళ్లయిన కొద్ది రోజులకే విడిపోతున్నాయి. కారణం.. భర్త 'పని'కి రాకపోవడమే! ఒత్తిడి, మారిన జీవనశైలి సహా ఎన్నో అంశాలు దీనికి కారణమవుతున్నాయని వైద్యులు అంటున్నారు.

ఆ సుఖం మాయమైంది..!

ఉద్యోగాల్లో ఒత్తిడికి తోడు ఆందోళన, ఆత్మన్యూనత వంటి అంశాలు లైంగిక వాంఛలు సన్నగిల్లేలా చేస్తున్నాయి. సంతానోత్పత్తి పరంగానూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. నగరాల్లో చాలామంది తమకు సెక్స్‌లో పాల్గొనడానికి సమయమే చిక్కడం లేదంటున్నారని సీనియర్ ఫెర్టిలిటీ కన్సల్టెంట్ లక్ష్మి చెప్పారు. హెచ్ఎస్‌డీడీ అనేది ఇటీవల బాగా పెరిగిందని ఆండ్రాలజిస్టులు చెబుతున్నారు. మగవారిలోనే కాదు.. ఆడవారిలోనూ ఇది కనిపిస్తుందని అంటున్నారు. లైంగిక వాంఛలు ఒక్కోసారి తగ్గడం సాధారణమే.. కానీ, అది నిరంతరం కొనసాగితే మాత్రం ప్రమాద సంకేతమని వైద్యులు చెబుతున్నారు. కొత్తగా పెళ్లయిన జంటలు కూడా నెలకు ఒకటి లేదా రెండు సార్లు లైంగికంగా కలుస్తున్నామని చెబుతుంటే ఆశ్చర్యంగా ఉందని గైనకాలజిస్టులు అంటున్నారు. కొంతమంది అండం విడుదలయ్యే 9 లేదా 10వ రోజు సెక్స్‌లో పాల్గొంటే చాలనే భావనలో ఉంటున్నారు. ఇలాంటి సమస్యలు ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువగా ఉంటున్నాయంటున్నారు. అరచేతిలో అన్నీ అందుబాటులో ఉన్న ఈ కాలంలో కూడా సెక్స్‌పై అవగాహన కల్పించాల్సి రావడం ఇబ్బందికరమని గైనకాలజిస్ట్ శాంతి పేర్కొన్నారు.

వాంఛ తగ్గడానికీ.. గుండె జబ్బులకీ లింకు..?

నేటి తరం సంసార సుఖం ఎరగకపోవడానికి కారణాలెన్నో! పొగాకు, అతిగా మద్యం సేవించడం, ఊబకాయం, ఒత్తిడి, రాత్రిళ్లు సైతం పనిచేస్తుండడం వంటివి సంసార జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒత్తిడి కారణంగా 'కోరికలు' నశిస్తుంటే.. ఊబకాయం, మద్యం, పొగతాగడం వంటివి వీర్యకణాలు, లైంగిక పటుత్వంపై ప్రభావాన్ని చూపుతాయి. వాస్తవానికి హెచ్ఎస్‌డీడీ వృద్ధి అనేది మనిషికో రకంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కొంతమందిలో లైంగిక వాంఛలు నెమ్మదిగా తగ్గితే, మరికొందరిలో అకస్మాత్తుగా తగ్గుతాయి. తగిన చికిత్స అందించకపోతే మానసిక ఆరోగ్య సమస్యలు, సంసారంలో కలతలు వచ్చే అవకాశాలున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని అధ్యయనాల ప్రకారం కనీసం 15% మంది మగవారిలో జీవితంలో ఏదో ఒక దశలో లైంగిక వాంఛలు తగ్గిపోవడం జరుగుతుంది. నిజానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చు. కానీ, వైద్య సహాయం తీసుకోవడానికి చాలామంది వెనుకడుగు వేయడం, వయసుతో పాటు శృంగారం పట్ల ఆసక్తి తగ్గుతుందనే అపోహ కూడా సెక్స్ లైఫ్‌కు సమస్యగా మారుతుందని డాక్టర్లు అంటున్నారు. కామ వాంఛలకు, గుండె జబ్బులకు ఉన్న సంబంధాన్ని గుర్తించినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఆండ్రాలజిస్ట్, యూరాలజిస్ట్ డాక్టర్ రవికుమార్ చెప్పారు. మగవారిలో హృదయ సంబంధ జబ్బులు రావడానికి ఒక ఏడాది ముందు నుంచే అంగస్తంభన సమస్యలు ప్రారంభమవుతాయన్నారు. గుండెకు వెళ్లే రక్తనాళాలతో పోలిస్తే అంగానికి వెళ్లే రక్తనాళాల పరిమాణం చాలా తక్కువగా ఉంటుందని, అందువల్ల అవి ముందుగా ప్రభావితమవుతాయని చెప్పారు. దురదృష్టవశాత్తు దీన్ని చాలామంది గుర్తించరని, అందరూ జాగ్రత్తపడాలని సూచించారు. హెచ్ఎస్‌డీడీకి కొన్ని ప్రవర్తనా పరమైన మార్పులు కూడా కారణమవుతాయని కన్సల్టెంట్ ఆండ్రాలజిస్ట్ విక్రమ్ చెప్పారు. లైంగిక సమస్యలతో వైద్యుల్ని సంప్రదించే వారి సంఖ్య ఇటీవల పెరిగిందన్నారు. తమ దగ్గరకు వచ్చే వారిలో 90 శాతం కేసులు కొద్దిపాటి జాగ్రత్తలతో పరిష్కరించే అవకాశం ఉన్నవేనని తెలిపారు. నేటి యువత తీవ్రమైన ఒత్తిడిలో ఉందని, ఆహారపు అలవాట్లు, జీవనశైలి.. వారిలో శృంగారపరమైన కోర్కెలను తగ్గిస్తున్నాయని చెప్పారు. నిద్రలేమి సమస్యలు కూడా శృంగార వాంఛను తగ్గించడానికి కారణమవుతాయని తెలిపారు. అధికంగా మద్యం తీసుకోవడం, నిశ్చల జీవనశైలి వల్ల టెస్టోస్టెరాన్ స్థాయి తగ్గి లైంగిక ఆరోగ్యంపై ప్రభావితం చూపుతుందన్నారు. ఇక మగవారిలో లైంగిక వాంఛలు లేకపోవడానికి సెక్సువల్ ఫాంటసీ (శృంగార అనుభూతికి చెందిన ఊహ)లు లేకపోవడమూ ఓ కారణమేనని, ఇటీవలి కాలంలో తమ దగ్గరకు వస్తున్న వారిలో 75% మంది ఈ తరహా సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడించారు.



పెళ్లయిన కొత్తలో ఎక్కువ సార్లు శృంగారంలో పాల్గొన్నా, తర్వాత అది కాస్త తగ్గడం సాధారణం. కానీ, పెళ్లయిన కొత్తలోనే ఈ ఇబ్బందులు ఉంటున్నాయంటే మానసిక కారణాలే అధికంగా ఉంటాయి. పని ఒత్తిడి, శారీరక, మానసిక అలసటతో పాటు ఐటీ ఉద్యోగులు అమెరికా, యూరోప్ సమయాల్లో పనిచేయడం వల్ల లైంగిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా డబుల్ ఇన్‌కమ్ కుటుంబాల్లో ఇద్దరికీ వేర్వేరు పనివేళలు ఉండడం కూడా సమస్యగా మారింది. చాలా మంది నెలకు ఒకటి లేదా రెండు సార్లే సెక్స్‌లో పాల్గొంటున్నారు.

- డాక్టర్ రవికుమార్, మెడికవర్ హాస్పిటల్

చక్కటి శృంగార జీవితం కోసం..

హెచ్ఎస్‌డీడీ సమస్యను పరిష్కరించడానికి జీవనశైలి మార్పులతో పాటు కొన్నిసార్లు మందులు కూడా వాల్సి ఉంటుందని డాక్టర్ రవి కుమార్ చెప్పారు. మగవారికి శృంగారం పట్ల ఆసక్తి పెరగాలంటే ఒత్తిళ్లను ఆమడదూరంలో ఉంచాలన్నారు. ఒత్తిడిని జయించడానికి యోగా, ధ్యానం వంటివి తోడ్పడతాయని చెప్పారు. నిత్యం వ్యాయామం, సమతుల ఆహారం మనసుని, శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుతాయన్నారు. ధూమపానం, మద్యపానం శృంగార జీవితానికి శత్రువులని.. వాటికి వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు. స్థూలకాయం, హార్మోన్ సమస్యలకు సత్వర వైద్యం తీసుకుంటే శృంగార జీవితానికి ఢోకా ఉండదని తెలిపారు. సరిపడా నిద్ర లేకపోయినా హార్మోన్ల అసమతుల్యతతో అనేక ఇబ్బందులు వస్తాయన్నారు.

భూదందాల్లో.. ఆరుగురు జగన్ మంత్రులు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. మరోవైపు రెవెన్యూ శాఖ అంతర్గత విచారణ చేపట్టింది. ఓ సీనియర్ అసిస్టెంట్, ఆర్డీవో, మాజీ ఆర్డీవోను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో రెవెన్యూ విభాగం శాఖాపరమైన విచారణకు ఉపక్రమించింది. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారని తేల్చారు. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టులోనే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో ఎక్కడికక్కడ విచారణ బృందాలు ఏర్పాటు చేసి అసైన్డ్ భూములపై విచారణ చేయించింది. భూముల రికార్డులను పునఃపరిశీలన చేయించింది. రాష్ట్రవ్యాప్తంగా 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయగా.. అందులో 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్టవ్యతిరేకంగా, జీవో 596ని ఉల్లంఘించి నిషేధ జాబితా నుంచి బయటకు తీశారని విచారణలో తేలింది. 25 వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయగా, అందులో 8,483 ఎకరాలు అక్రమంగా చేశారని తేల్చారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం.. నాటి వైసీపీ ప్రభుత్వంలో ఆరుగురు మంత్రులు, 42 మంది ప్రజాప్రతినిధులు, 120 మంది నేతలు, 22 మంది డిప్యూటీ కలెక్టర్లు, 48 మంది తహశీల్దార్లు, 23 మంది మండల సర్వేయర్లు.. ఈ భూదందాల్లో ప్రధాన పాత్రధారులని రెవెన్యూ శాఖ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. నేతలు, అధికారులపై అసైన్డ్ భూముల చట్టం-1977లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని సిఫారసు చేసింది.

క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలు..: చట్టవిరుద్ధంగా, కుట్రపూరితంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములు కాజేసిన వారిపై భూముల ఆక్రమిత చట్టం-1905 కింద క్రిమినల్ కేసులు పెట్టాలని.. ప్రభుత్వ భూములను చెరపట్టేందుకు కుట్రలు, కుయుక్తులు పన్నినందుకు కూడా కేసులు నమోదు చేయాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది. నాడు ఆర్డీవోలు, తహశీల్దార్లుగా పనిచేసిన రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమే గాక ఏసీబీ లేదా విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణకు ఆదేశించాలని సూచించినట్లు సమాచారం. ఇవన్నీ ప్రభుత్వ స్థాయిలో తీసుకోవలసిన నిర్ణయాలే. అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తప్పనిసరి. దీంతో ఆయా ప్రతిపాదనలను ఆయన పరిశీలనకు పంపించారు. సదరు ఫైలు ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన ఇచ్చే ఆదేశాల కోసం రెవెన్యూ శాఖ ఎదురుచూస్తోంది.

రెవెన్యూ శాఖ సిఫారసులు

- ప్రభుత్వ, అసైన్డ్ భూములను చెరపట్టిన రాజకీయ నేతలపై కేసులు నమోదు చేయాలి.
- అక్రమార్కులకు కొమ్ముకాసిన అవినీతి అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి.
- అసైన్డ్ భూముల పరాధీనంలో ఆర్డీవో, తహశీల్దార్లతోపాటు ఐఏఎస్ స్థాయి అధికారుల వైఫల్యం కూడా ఉంది. వారిపైనా చర్యలు తీసుకోవాలి.
- నేతలు, అధికారుల సంయుక్త దోపిడీపై ఏసీబీ లేదా విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి.
- రికార్డుల్లేకుండానే అసైన్డ్ భూములను నిషేధ విముక్తి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

బ్రోకరేజీ కింగ్ నిఖిల్ కామత్



దేశంలో యంగెస్ట్ బిలియనీర్

రూ.22,300 కోట్ల నికర ఆస్తులు

పుస్తకాలు చదివితే ఏమొస్తుంది గురూ. మహా అయితే కొద్దో గొప్పో శాస్త్ర జ్ఞానం వస్తుంది. దాంతో ఏదో కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవితం గడిపేయవచ్చు. అదే లోకాన్ని చదివితే లోకజ్ఞానం, ఇంకా కాలం కలిసొస్తే కోట్లకు పడగలెత్తడం ఎలాగో కూడా తెలుసుకోవచ్చు. భారత స్టాక్ మార్కెట్లో బ్రోకరేజీ బిజినెస్‌ను సమూలంగా మార్చేసిన నిఖిల్ కామత్ ఇందుకు ఉదాహరణ. జీరో బ్రోకరేజీ సంస్థ 'జీరోధా' ఏర్పాటు చేసి దేశ స్టాక్ బ్రోకరేజీ చరిత్రను తిరగ రాసిన నిఖిల్ కామత్ గురించి మరిన్ని విశేషాలు.

నిఖిల్ కామత్.. ఇప్పుడు దేశ స్టాక్ మార్కెట్లో ఈ పేరు తెలియని ఇన్వెస్టర్ ఉండరంటే అతిశయోక్తి కాదు. జీరో బ్రోకరేజీ నినాదంతో స్టాక్ మార్కెట్ బ్రోకరేజీ చరిత్రను తిరగరాసిన జీరోధా వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ గురించి చాలా కొద్దిమందికే తెలుసు. కాలేజీ చదువు కూడా లేకుండా హేమాహేమీ స్టాక్ బ్రోకరేజీ సంస్థలకే చెమటలు పట్టించి 38 ఏళ్లకే 260 కోట్ల డాలర్ల (సుమారు రూ.22,300 కోట్లు) ఆస్తులతో దేశంలో యంగెస్ట్ బిలియనీర్‌గా నిలిచిన కామత్.. జీవితంలో ఎదగాలనుకునే ఎంతో మంది ఔత్సాహికులకు ప్రేరణ.

జీవితం-చదువు: నిఖిల్ కామత్ కర్ణాటకలోని ఉడుపిలో 1986 సెప్టెంబరు 5న జన్మించారు. తండ్రి బ్యాంకర్. తల్లి టీచర్. వారు నిఖిల్‌ను బాగా చదివించాలనుకున్నారు. అయితే మనోడికి చదువు పెద్దగా అబ్బలేదు. స్కూల్లో ఉండగానే 14 ఏళ్ల వయసులోనే మొబైల్ ఫోన్లు అమ్మి నాలుగు రాళ్లు సంపాదించడం ప్రారంభించాడు. తల్లిదండ్రులకు ఇది ఏ మాత్రం నచ్చలేదు. ముందు టెన్త్ క్లాసైనా పూర్తి చేయ్. తర్వాత నీ ఏడుపు నువ్వు ఏడుద్దువు గాని అని మందలించారు. అయినా మనోడు వింటేగా. దాంతో కామత్ తల్లి కొన్నిసార్లు అతడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు లాక్కుని టాయిలెట్‌లో పడేసేవారు. అయినా మనోడిలో ఏ మార్పు లేదు. ఫోన్లు కాకపోతే ఇంకో బిజినెస్ అనుకుని వేరే చిన్న చిన్న వ్యాపారాలు చేసి డబ్బులు సంపాదించడం ప్రారంభించారు.

ఉద్యోగం: అమ్మా నాన్న పోరు పడలేక నిఖిల్ కామత్ నెలకు రూ.8,000 జీతంతో ఒక కాల్ సెంటర్ జాబ్‌లో చేరారు. అక్కడే నిఖిల్‌కు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ అలవాటైంది. మనోడికి ఉన్న మార్కెట్ విశ్లేషణా శక్తికి తోడు కాలం కూడా కలిసి రావడంతో ఈ ట్రేడింగ్‌లో బాగానే సంపాదించాడు.

జీరోధా స్థాపన: కాల్ సెంటర్ జాబ్ చేస్తూ, ట్రేడింగ్‌లో సంపాదించిన డబ్బుతో సొంతంగా ఏదైనా బిజినెస్ స్టార్ట్ చేయాలనుకున్నాడు. అందుకు అన్న నితిన్ కామత్ కూడా తోడయ్యాడు. ఏ బిజినెస్ ప్రారంభిద్దామా? అని ఆలోచిస్తుంటే స్టాక్ మార్కెట్ బ్రోకరేజీ బిజినెస్ ఆలోచన వచ్చింది. అప్పట్లో షేర్లు అమ్మాలన్నా, కొనాలన్నా బ్రోకరేజీ కమిషన్ ఎక్కువగా ఉండేది. దాంతో చిన్న మదుపరులు ఎవరూ పెద్దగా స్టాక్ మార్కెట్‌కు వచ్చేవారు కాదు. దీన్నే వ్యాపార అవకాశంగా మార్చుకోవాలని అన్నదమ్ములిద్దరూ నిర్ణయించారు. ఇద్దరు కలిసి 2010లో జీరోధా పేరుతో స్టాక్ బ్రోకరేజీ సంస్థను ఏర్పాటు చేశారు. ఇంట్రాడే, డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై నిర్ణీత చార్జీలు, డెలివరీ ఆధారిత అమ్మకాలు, కొనుగోళ్లపై నో బ్రోకరేజీ అనే వీరి నినాదం బాగానే పేలింది. ఒక విధంగా చెప్పాలంటే జియో ద్వారా రిలయన్స్ భారత టెలికాం రంగంలో ఎలాంటి సునామీ సృష్టించిందో.. జీరోధా కూడా భారత స్టాక్ బ్రోకింగ్ వ్యాపారంలో అలాంటి మార్పునే సృష్టించింది. అధునాతన టెక్నాలజీ కూడా ఇందుకు తోడవడంతో స్టాక్ బ్రోకింగ్ వ్యాపారంలో జీరోధాకు ఎదురు లేకుండా పోయింది. ప్రస్తుతం దాదాపు కోటి మంది మదుపరులు ఈ యాప్ ద్వారా తమ స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీన్నిబట్టి కామత్ సోదరులు ఈ యాప్‌ను ఎంతగా మదుపరులకు దగ్గర చేశారో అర్థం చేసుకోవచ్చు.

చిన్న వయసులోనే బిలియనీర్: ఫోర్బ్స్ పత్రిక నివేదిక ప్రకారం నిఖిల్ కామత్ ఆస్తుల ప్రస్తుత విలువ 260 కోట్ల డాలర్లు. ప్రస్తుతం మారకం రేటు ప్రకారం ఇది సుమారు రూ.22,300 కోట్లకు సమానం. దేశంలో అత్యంత చిన్న వయసులో బిలియనీర్‌గా ఎదిగింది ఎవరంటే నిఖిల్ కామతే. పట్టుదల, ముందు చూపు, వినూత్న ఆలోచనలే తనను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టాయని నిఖిల్ కామత్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నాలుగు పదుల వయసు నిండకుండానే ఇంతగా ఎదిగిన ఈ బిలియనీర్‌కు సామాజిక స్పృహ ఎక్కువే. తన ఆస్తుల్లో సగాన్ని సామాజిక సంక్షేమ పథకాలకు ఇచ్చేస్తానని 2023 జూన్‌లో ప్రకటించారు. మంచి వ్యాపార ఆలోచన, టెక్నాలజీ ఉంటే విజయం దానంతట అదే వస్తుందనుకునే ఎందరో ఔత్సాహికులకు నితిన్ కామత్ చక్కటి ఉదాహరణ.

బిజినెస్

'వొడాఫోన్'లో ప్రభుత్వానికి మరింత వాటా

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో ప్రభుత్వ వాటా ప్రస్తుత 22.6 శాతం నుంచి 48.99 శాతానికి పెరగనుంది. స్పెక్ట్రమ్ బకాయిల కింద తనకు రావలసిన రూ.36,950 కోట్లను ఒక్కోటి రూ.10 ముఖ విలువ ఉండే 3,695 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చుకునేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో కంపెనీ ఈక్విటీలో ప్రభుత్వ వాటా 48.99 శాతానికి చేరనుందని వొడాఫోన్ ఐడియా తెలిపింది. అయినా కంపెనీ నిర్వహణ ప్రస్తుత ప్రమోటర్లు వొడాఫోన్, ఆదిత్య బిర్లా గ్రూప్ వద్దే ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ప్రమోటర్లకు వొడాఫోన్ ఐడియాలో వరుసగా 14.76 శాతం, 22.56 శాతం వాటా ఉంది.

ఇండిగోకు రూ.944 కోట్ల పెనాల్టీ

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు (ఇండిగో) ఆదాయ పన్ను శాఖ 2021-22 అసెస్‌మెంట్ సంవత్సరానికి రూ.944.20 కోట్ల జరిమానా విధించింది. శనివారం ఈ ఉత్తర్వులు అందాయని, వాటిని న్యాయస్థానంలో సవాలు చేయనున్నామని ఇండిగో ప్రకటించింది. అలాగే దీని ప్రభావం తమ ఆర్థిక స్థితిపై గాని, నిర్వహణపై గాని కంపెనీ ఇతర కార్యకలాపాలపై గాని ఉండబోదని తేల్చి చెప్పింది.

వచ్చే ఏడాది 6.5% వృద్ధి

ఎర్నెస్ట్ అండ్ యంగ్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధిని సాధించవచ్చని ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) అంచనా వేసింది. మానవ వనరుల అభివృద్ధికి సహాయపడే ఆర్థిక వ్యూహాలను అనుసరించడంతో పాటు వివేకవంతమైన విత్త నిర్వహణ విధానాలు దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడతాయని తాజా నివేదికలో తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక వృద్ధిరేటు 6.4% ఉండవచ్చని కూడా అంచనా వేసింది. వికసిత్ భారత్ దిశగా దేశం సాగించే పయనానికి మద్దతు ఇచ్చేలా విత్త విధానాన్ని అనుసంధానించవలసి ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఓ అంచనా వేసిన విధంగా 6.5% వార్షిక వృద్ధిని సాధించాలంటే మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికంలో 7.6% వృద్ధిని సాధించాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే ఇంత భారీ వృద్ధి ఇటీవల సంవత్సరాల్లో సాధ్యం కాలేదని తేల్చి చెప్పింది. ఇందుకు ప్రైవేట్ వినియోగ వ్యయం 9.9% అవసరమని కూడా పేర్కొంది. దీనికి బదులుగా పెట్టుబడి వ్యయాలు పెంచేందుకు కృషి చేయడం మంచిదని పేర్కొంది. దేశంలో పెరుగుతున్న యువజనాభాను పరిగణనలోకి తీసుకుంటే 2048 నాటికి విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో 6.5 శాతానికి పెంచాలని కూడా సూచించింది.

నేడు మార్కెట్లకు సెలవు

సోమవారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) సందర్భంగా స్టాక్ మార్కెట్లు.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఐసీఐసీఐ ప్రు బ్లూచిప్ ఫండ్

ఈక్విటీ మార్కెట్లో ఆటుపోట్లున్నప్పటికీ దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు మంచి రిటర్నులు అందించటంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ కీలకంగా ఉంది. ఇటీవలి మార్కెట్ కరెక్షన్‌లో మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్ భారీగా కరెక్షన్‌కు గురయ్యాయి. అయితే ఈ సమయంలో లార్జ్ క్యాప్ ఫండ్స్ మాత్రం కొద్దిగా సురక్షితంగా ఉండటంతో దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఇవి మంచి పెట్టుబడి సాధనంగా ఉన్నాయి. గడచిన పదేహేడేళ్ల కాలంలో ఐసీఐసీఐ ప్రు బ్లూ చిప్ ఫండ్ అన్ని రకాలైన మార్కెట్ గమనాల్లో నిలకడగా రిటర్నులు అందించింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు సవాళ్లు విసురుతున్నప్పటికీ ఈ ఫండ్ మాత్రం ఫండమెంటల్స్ బలంగా ఉన్న లార్జ్ క్యాప్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ ఫండ్ సగటున 14.6 శాతం రిటర్నులు అందించటం విశేషం. ఇదే సమయంలో నిఫ్టీ 100 టీఆర్ఐ రిటర్నులు 13.3 శాతంగా ఉన్నాయి. సిప్ రూపంలో చూసినా రిటర్నులు 15.3 శాతంగా ఉన్నాయి. ఈ ఫండ్ రిస్క్, రివార్డ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటూ ఐటీ, పెట్రోలియం, ఆటోమొబైల్ వంటి రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తోంది.

- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ప్యూర్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాల విస్తరించింది. ఇందులో భాగంగా కర్నూల్‌లో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు.
- అమెజాన్ ఇండియా.. ఏప్రిల్ 1 నుంచి 5 వరకు హోమ్ షాపింగ్ స్ప్రీ పేరుతో ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రూ.1,000 వరకు క్యాష్‌బ్యాక్, ఉత్పత్తులపై 40% వరకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది.
- జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్కెట్లోకి అడుగుపెట్టింది. గుంటూరులో తొలి శాఖను ప్రారంభించటం ద్వారా ఏపీ మార్కెట్లోకి ప్రవేశించినట్లు బ్యాంక్ ప్రకటించింది. ఇప్పటి వరకు బ్యాంక్ 24 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.
- స్కిన్‌కేర్ బ్రాండ్ న్యూట్రోజెనా.. తన ఉత్పత్తుల ప్రచారానికి బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అలాగే హైడ్రో బూస్ట్ సన్ స్క్రీన్, ఎస్‌పీఎఫ్ 50 ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చింది.
- కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంస్థ అకాయ్ ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త శ్రేణి ఎయిర్ కండీషనర్లను విడుదల చేసింది. అకాయ్ సియాచిన్ (హెవీ డ్యూటీ), నీలగిరి (ఎకానమీ), కశ్మీర్ (హాట్ అండ్ కోల్డ్) పేర్లతో వీటిని తీసుకువచ్చింది. 1 టన్ను నుంచి 2.25 టన్నుల శ్రేణిలో అందుబాటులో ఉండనున్న ఈ ఏసీల ప్రారంభ ధర రూ.30,090.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	152
కరీంనగర్	146	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	115
కర్నూలు	146	నెల్లూరు	120
విశాఖపట్నం	124	అనంతపురం	120
గోదావరి	152		

23,400 వద్ద కన్సాలిడేషన్


వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం గరిష్ఠ స్థాయి 22,850 నుంచి బలమైన రియాక్షన్ సాధించి వారం మొత్తం మీద కేవలం 170 పాయింట్ల లాభంతో 23,500 ముగిసింది. ఇది అప్రమత్త సంకేతం. కనిష్ఠ స్థాయిల నుంచి 2,000 పాయింట్ల మేరకు లాభపడినందు వల్ల ఈ తరహా టెక్నికల్‌గా కరెక్షన్ రావడం అవసరం. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం నాటి బలమైన రియాక్షన్ కారణంగా ట్రెండ్‌లో మరింత అప్రమత్తతకు ఆస్కారం ఉంది. మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా గత వారం స్వల్ప రియాక్షన్ సాధించాయి.

బుల్లిష్ స్థాయిలు : ఊహిస్తున్న విధంగా అప్రమత్త సానుకూల ధోరణి ప్రదర్శించినట్టయితే మరింత సానుకూలత కోసం నిరోధ స్థాయి 23,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 23,800, 24,000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 22,400 వద్ద రికవరీ సాధించాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం ప్రధాన స్థాయి 52,000 వద్ద రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. స్వల్పకాలిక కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం స్వల్పకాలిక నిరోధం 52,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక మద్దతు స్థాయి 50,800. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్ : మార్కెట్ ప్రస్తుతం 100 డీఎంఏ వద్ద రియాక్షన్ సాధిస్తోంది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి వల్ల కూడా రియాక్షన్ ఏర్పడుతోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,540, 23,600
మద్దతు	23,455, 23,400

23,825 పైన బుల్లిష్

(ఏప్రిల్ 1-4 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో టెక్

నిఫ్టీ గత వారం 23,412-23,870 పాయింట్ల మధ్యన కదలాడి 169 పాయింట్ల లాభంతో 23,519 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,825 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,573, 23,489, 23,028, 22,795 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,825 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,225

నిరోధ స్థాయిలు: 23,725, 23,825, 23,925 (23,625 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,325, 23,225, 23,125 (23,425 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	470
వరంగల్	457	గోదావరి	460
చిత్తూరు	520	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 60	

ఎవరి 'పంచాంగం' వారిదే!

» తీరు మార్చుకోని సిద్ధాంతులు.. పార్టీకో రకంగా పఠనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగు వారి నూతన సంవత్సరం ప్రారంభమయ్యే ఉగాది రోజు పంచాంగం వినడం ఆనవాయితీ. ఉగాదితో ప్రారంభమయ్యే నూతన సంవత్సరం ఎలా ఉంటుందన్న ఆసక్తితో దాదాపు ప్రతివారూ పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వం కూడా ఉగాది వేడుకలు నిర్వహించి.. పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం ఇస్తాయి. అయితే.. అసలు పంచాంగంలో ఎలా ఉన్నా.. 'ఏ ఎండకు ఆ గొడుగు' అన్నట్టుగా పంచాంగ కర్తలు.. ఆయా పార్టీల కార్యక్రమాల్లో ఆయా నేతలకు అనుకూలంగా పంచాంగాన్ని వండివారుస్తున్నారు. దశాబ్దం కిందటి వరకు ఎలా ఉన్నా.. గత పదేళ్ల నుంచి మాత్రం పార్టీలు, నాయకుల మెప్పుకోసం పంచాంగ కర్తలు.. 'ఎవరి పంచాంగం వారిదే' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా కూడా రాష్ట్రంలో ఇదే కనిపించింది. విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, టీడీపీ, వైసీపీ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు పంచాంగ కర్తలు మూడు విధాలుగా పంచాంగ పఠనం చేసి.. నాయకులను మెప్పించే ప్రయత్నం చేయడం గమనార్హం. వైసీపీ అధికారంలోకి వచ్చేస్తుందని, ఆ పార్టీ అధినేత జగన్ జాతకం ఈ ఏడాది దేదీప్యమానంగా వెలిగిపోతుందని సిద్ధాంతి నారాయణమూర్తి చెప్పడం గమనార్హం. కానీ, వాస్తవానికి రాష్ట్రంలో ఎన్నికలు జరిగేందుకు మరో నాలుగేళ్ల సమయం ఉంది. అప్పటికి కూడా నేతల నాడిని బట్టి ఎవరికి అధికారం దక్కుతుందన్నది ప్రజలే నిర్ణయిస్తారు. కానీ, సిద్ధాంతి నారాయణమూర్తి మాత్రం వైసీపీ నాయకుల మనసుకు ఇష్టమైన మాటలు చెప్పి మెప్పించే ప్రయత్నం చేశారన్న విమర్శలు వినిపించాయి. ఇక, మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఉగాది కార్యక్రమంలో సిద్ధాంతి మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ పఠనం చేశారు. ఈయన కూడా టీడీపీని పొగడ్తలతో ముంచెత్తారు. టీడీపీ అంటే తులా రాశి అని, ఈ ఏడాది తులారాశికి చాలా బాగుందని అన్నారు. తెలంగాణలో కూడా టీడీపీ నిలదొక్కుకుంటుందని చెప్పడం గమనార్హం. అంతేకాదు.. పార్టీలో ఎంతమంది నాయకులు ఉంటే అందరికీ పదవులు దక్కుతాయని చెప్పడం కొసమెరుపు. మరి ఇది సాధ్యమేనా? అన్నది చూడాలి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. మాటకోసారి సీఎం చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు. అయితే.. నాగఫణి శర్మ చెప్పిన విషయాలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయని పలువురు వ్యాఖ్యానించారు. గతంలో ఇరుకు దారులను మార్చి ఇంద్రభవనాలను నిర్మించిన(హైదరాబాద్) ముఖ్యమంత్రి చంద్రబాబు మరో మహానగర నిర్మాణం(అమరావతి) పూర్తి చేస్తారన్నారు. ఆయన లక్ష్యాన్ని ఎవరూ చేరుకోలేరని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ ఫైలుపై తొలి సంతకం

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగువారి నూతన సంవత్సరం.. ఉగాది రోజున పేదలకు సాయం అందించే సీఎం సహాయనిధి ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం చేశారు. 3,456 మంది పేదలకు లబ్ధి చేకూర్చేలా రూ.38 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు 23,418 మంది పేదలకు రూ.281.38 కోట్లను ప్రభుత్వం అందించింది.

టీడీపీ కార్యాలయంలో ఘనంగా..

తెలుగువారి కొత్త సంవత్సరం.. ఉగాది నుంచి రాష్ట్ర ప్రజలు.. కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు దూరమై అందరూ సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలను నిర్వహించారు. సిద్ధాంతి మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ పఠనం చేస్తూ.. టీడీపీ అంటే తులా రాశి అని, ఈ ఏడాది బాగుందని తెలిపారు. టీడీపీ తిరుగులేని శక్తిగా మారుతుందని, తెలంగాణలో కూడా నిలదొక్కుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్, రమణ, అశోక్ బాబు, బుచ్చి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




ఉగాది వేడుకల్లో పంచాంగ పఠనం చేస్తున్న నాగఫణిశర్మ, వేదికపై సీఎం చంద్రబాబు, ఉండవల్లి శ్రీదేవి, కంభంపాటి, అజయ్‌జైన్, యార్లగడ్డ, మండలి, సీఎస్ విజయానంద్, ఆనం, దుర్గేశ్, పార్థసారథి, ఉమా తదితరులు, వేడుకల్లో పాల్గొన్న జనం

జీవితాంతం సమాజం కోసమే!

» చివరి వరకు ప్రజల కోసమే పనిచేస్తా

» గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కళ తప్పింది

» ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డు అందుకుంటున్న 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ కె.నాగ సుధాకర్



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం



కళారత్న అవార్డు అందుకుంటున్న కృత్తివెంటి శ్రీనివాసరావు

అమరావతి/ విజయవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): 'నా జీవితాంతం సమాజం కోసం పనిచేయాలన్న ఏకైక లక్ష్యంతో ఉన్నా. చివరి వరకు ప్రజల కోసమే పనిచేస్తా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ, కృష్ణాజిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆదివారం నిర్వహించిన ఉగాది సంబరాల్లోనూ ఆయన మాట్లాడారు. 'పండుగలు మన దేశ సంస్కృతిలో ఒక భాగం. అవి మన వారసత్వం. పండుగ అంటే స్వీట్లే కాకుండా.. అన్ని రకాల సమస్యలూ ఉంటాయి. వీటిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను సమాజం, కుటుంబ వ్యవస్థలు మనకు ఇచ్చాయి. వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి ప్రపంచంలోకెల్లా నంబర్ 1, 2 స్థానాల్లో భారతదేశం ఉంటుంది. ఇప్పుడు నేను వేసే పునాది ప్రపంచంలోనే తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెడుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

ఉగాది మన సంప్రదాయం..

జనవరి 1 ఎంత ముఖ్యమో, ఉగాదికి అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాం. తెలుగు నూతన సంవత్సరం రోజున ఉగాది పచ్చడితో ప్రారంభిస్తాం. కష్టాలు, సుఖాలు, అదృష్టం, దురదృష్టం గురించి ముందుగానే తెలుసుకొని మానసికంగా సిద్ధపడుతున్నాం. పంచాగ శ్రవణం ద్వారా అన్నింటికీ తట్టుకుని నిలబడాలనే విషయాన్ని పెద్దలు వారసత్వ సంపదగా మనకు అందించారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరి జీవితంలో నూతన ఉత్సాహాన్ని, మంచి భవిష్యత్తును ఇవ్వాలి. సెల్‌ఫోన్ వ్యసనంగా మారితేనే సమస్య. దాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటే మీ జీవితాల్లో చాలామార్పు వస్తుంది. ఏ పని చేయాలన్నా అదుంటే చాలు. చివరికి ఆఫీస్ పని కూడా సెల్‌ఫోన్‌లో పూర్తి చేస్తున్నారు. అందుకే వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చాం. రాష్ట్రంలో ఎన్ని కష్టాలున్నా ఈ ఏడాది రూ.3.22లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టాం. అప్పుడు హైటెక్ సిటీ, ఐటీ టవర్స్ కట్టాను. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతున్నాను. 1996-97 మధ్యలో మలేసియా వెళ్లాను. 2 కోట్ల మంది జనాభా ఉన్న ఆ దేశంలో 8 లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టారు. మన దేశంలో అప్పటికే 110 కోట్ల జనాభా ఉన్నారు. ఒక్క రోడ్డు లేదు. అప్పుడు ప్రధాని వాజ్‌పేయికి చెబితే.. ఏం చేద్దామని అడిగారు. ఒక్క రోడ్డు వేసి చూపిస్తామని చెప్పి నెల్లూరు నుంచి చెన్నై వరకూ తొలిసారి ప్రయివేటు సెక్టార్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాం. అప్పటి నుంచి దేశం మొత్తం రోడ్ల నిర్మాణం పూర్తి చేశాం.

పురస్కారాల ప్రదానం

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన 87 మందికి కళారత్న, 116 మందికి ఉగాది పురస్కారాలను సీఎం చంద్రబాబు అందించారు. దాదాపు గంటన్నర పాటు వేదికపై నిల్చుని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా పురస్కారాలు ప్రదానం చేశారు. ముందుగా 86 కళారత్న అవార్డులు ఇస్తున్నట్లు జీవో ద్వారా ప్రకటించారు. అయితే ఆదివారం ఉదయానికి ఆ సంఖ్య 87కి చేరింది. అలాగే తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్‌కు కళారత్న అవార్డు ప్రకటించి, ఉగాది పురస్కారం అందించారు. కాగా, ఉగాది సంబరాల ఏర్పాట్లలోనూ, పురస్కార గ్రహీతలను సమన్వయం చేయడంలోనూ సాంస్కృతిక శాఖ పూర్తిగా విఫలమైంది. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేశ్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లూ కళ తప్పింది

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కళ తప్పింది. ఈ విధంగా కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి లేదు. రాష్ట్రంలో అందరికీ అవమానాలే.. ఒకప్పుడు వాజపేయి, ఎన్టీఆర్, జ్యోతిబసు వంటి విలువలు కలిగిన వ్యక్తులతో పనిచేశా. ఇప్పుడు ఎవరితో పోటీ పడుతున్నానో ఒక్కసారి ఆలోచించుకుంటే అసంతృప్తి కలుగుతోంది. గత ప్రభుత్వం సృష్టించిన సమస్యలు జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఒక్కొక్కటిగా వ్యవస్థల్ని గాడిన పెడుతున్నాం.

సమృద్ధిగా వర్షాలు: మాడుగుల

విశ్వవసు నామ సంవత్సరంలో రాష్ట్రంలో వర్షాలు బాగా పడతాయని, పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని పంచాంగ శ్రవణంలో సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ తెలిపారు. గతంలో ఇరుకు దారులను మార్చి ఇంద్ర భవనాలు నిర్మించిన చంద్రబాబు మరో మహానగర నిర్మాణాన్ని పూర్తి చేస్తారని చెప్పారు.

స్వర్ణాంధ్రకు సహకరిద్దాం: గరికపాటి

సీఎం చంద్రబాబుపై సహస్రావధాని గరికపాటి ఒక పద్యం వినిపించారు. 'రాష్ట్రాన్ని నడిపే వ్యక్తికి ఎన్ని సమస్యలు ఉంటాయో తెలియంది కాదు. ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా, పార్టీపరంగా ఇలా అనేక రకాల సవాళ్లను దాటుకొని ముందుకెళ్లాలి. అలాంటి ధైర్యం ప్రభుత్వాధినేతకు ఉంది. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేయడానికి సహకరిద్దాం. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులన్నింటినీ కడదాం' అన్నారు.



కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పంచాంగ కర్త గరికపాటి నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తెలుగు రాష్ట్రాలకు ఆస్తి స్వర్ణభారత్ ట్రస్ట్

'స్వర్ణభారతి ట్రస్ట్ నేడు తెలుగు రాష్ట్రాలకు ఒక ఆస్తిగా తయారైంది. ఒక ట్రస్ట్ నడపడం అంత సులువు కాదు. అలాంటిది 24 ఏళ్లుగా స్వర్ణభారత్ ట్రస్ట్‌ను నడుపుతున్న దీపా వెంకట్‌ను అభినందిస్తున్నా. ఈ ట్రస్ట్ ద్వారా గ్రామీణ ప్రజలకు విద్య, వైద్య సేవలు అందిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద వేలాది మందికి శిక్షణ ఇస్తున్నారు. మా ట్రస్ట్‌కు ఈ పని చేసి పెట్టంటని వెంకయ్యనాయుడు ఎప్పుడూ అడగలేదు. నెల్లూరు, ఆత్కూరులో సొంతగా భూములు కొని ట్రస్ట్‌ను నడుపుతున్నారు. సంపద సృష్టి జరిగే క్రమంలో సమాజంలో విలువలు పతనమైతే దానికి సార్థకత ఉండదు' అని సీఎం తెలిపారు. నేటితరం పిల్లల్లో సృజనాత్మకత లోపించిందని, గరికపాటి వంటి వారు తమ ప్రవచనాల ద్వారా విలువల గురించి చెప్పాలని కోరారు.

అవాంఛనీయ ధోరణులు: వెంకయ్య

మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న నైపుణ్య శిక్షణ దేశానికి అవసరమన్నారు. సమాజంలో ప్రబలుతున్న అవాంఛనీయ ధోరణులపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువతలో వస్తున్న మార్పులు ఆందోళనకరంగా ఉన్నాయని, అత్యాచారాలు, పెళ్లి చేసుకుంటామని మోసాలు వంటివి ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. సమాజాన్ని తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే కేంద్రం నూతన విద్యావిధానం తీసుకొచ్చిందని, దీనిపై విమర్శలు మానుకోవాలని అన్నారు.


పేదవాడిని పైకి తెద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకారం చుడుతున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది జరిగితే తన జన్మ చరితార్థమవుతుందన్నారు. తెలుగు జాతిని తెలివైన జాతిగా మార్చే బాధ్యతను మార్గదర్శులకు ఆయన అప్పజెప్పారు. కెరీర్లో ఏ సమయంలో ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియక చాలామంది అవకాశాలు వినియోగించుకోలేకపోతున్నారని, వారందరికీ మాటసాయం, ఆర్థిక సాయం చేసి.. వారి కెరీర్‌ను డిజైన్ చేయాలని పిలుపిచ్చారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్-పార్ట్‌నర్‌షిప్-పీ4 కార్యక్రమాన్ని 'మార్గదర్శి-బంగారు కుటుంబం.. పీ4-జీవో పావర్టీ' పేరిట ఆదివారం సాయంత్రం అమరావతిలో సీఎం ప్రారంభించారు. ఆ సందర్భంగాను, అంతకుముందు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ఉగాది సంబరాల్లోను ఆయన ప్రసంగించారు. పేదలను ఎలా ఆదుకోవాలి, వారికోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. సంపద కొంతమందికే పరిమితం కాకూడదన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉంటేనే సమసమాజమన్నారు. భవిష్యత్‌లో ఈ రాష్ట్రంలో పేదవాళ్లు లేకుండా చేయాలని లక్ష్యంతోనే పీ-4 విధానం తీసుకొచ్చామని తెలిపారు. 'మొదటి ఫేజ్ జీరో పావర్టీ.. ఆ తర్వాత మెరుగైన, ఉన్నత జీవన ప్రమాణాలు పెంపొందించడం. అవసరమైన అందరికీ విద్య, వైద్యం.. అన్నింటిలో సహకారం అందించాలనేదే నా జీవిత ఆశయం. చివరిగా ఆర్థిక అసమానతలు లేకుండా ఉండే వ్యవస్థ. అందరికీ సమానావకాశాలు కల్పించి అందరినీ సమానంగా చూడాలి. ఇది ప్రపంచానికి ఆదర్శం కావాలి. ఇలాంటి మంచి కార్యక్రమానికి అందరూ సహకరించాలి' అని కోరారు. విశ్వావసు నామ సంవత్సరంలో తెలుగు వారు ప్రపంచస్థాయి గుర్తింపు పొందాలని.. వారు చరిత్ర రాయాలన్నది తన ఆకాంక్షగా పేర్కొన్నారు. మనుషులు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనన్నారు. దృఢసంకల్పం ఉంటే ఎలాంటి జటిల సమస్యనైనా పరిష్కరించవచ్చని.. ఆ శక్తి తెలుగు జాతికి ఇంకా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. తెలుగువారి మొదటి పండుగ ఉగాది నాడు చేపట్టే కార్యక్రమం జయప్రదమవుతుందని.. అందుకే పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభించానని తెలిపారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఆ గౌరవం, తృప్తి రావు..

డబ్బులున్నవారికే ఎక్కువ కష్టాలుంటాయి. వాటిని ఎలా కాపాడుకోవాలనే టెన్షన్ ఉంటుంది. అందుకే బీపీలు వస్తున్నాయి. ప్రాణాలు పోయాక సంపాదించింది మీవెంట రాదు. మీ పిల్లలకు చెందుతుంది. ఆర్థికంగా ఒకస్థాయికి వచ్చిన వాళ్లు మంచి పేరు కోసం, ప్రజల మెప్పు కోసం పనిచేస్తారు. మీ తెలివితేటలు, ఆలోచనలు, సంపదతో కుటుంబాలను, సమాజాలను మార్చగలిగితే దాని వల్ల వచ్చే గౌరవం, తృప్తి.. ఇక దేనివల్లా రావు. ఒక్కొక్కరికీ 20, 30 కంపెనీలున్నాయి. పీ4 కింద మీరు చేయాల్సిన పనులను కూడా ఒక కంపెనీగానే అనుకోండి. పేదల జీవితాల్లో మార్పు రావాలంటే ఏం చేయాలో చేయండి. తెలుగు జాతిని తెలివైన జాతిగా తయారుచేసే బాధ్యత మార్గదర్శులకు అప్పజెబుతున్నా. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబాలకు మౌలిక సదుపాయాలన్నీ ఇస్తాం. కానీ వాళ్ల కెరీర్‌ను బాగుచేసే బాధ్యత మార్గదర్శులదే. ఆగస్టు 15నాటికి ఒక రూపం తీసుకొస్తాం. వచ్చే ఉగాదినాటికి ఏం చేశామో చెబుతాం.



పీ4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, శ్రావణ్‌కుమార్, పయ్యావుల కేశవ్, పెమ్మసాని, సీఎస్ విజయానంద్, కామినేని తదితరులు

డబ్బులు ముఖ్యం కాదు..

బిల్ గేట్స్ 1991-92లో కంపెనీ పెట్టారు. ఇంటర్నెట్ విప్లవం తీసుకొచ్చారు. ప్రపంచాన్ని అనుసంధానించారు. అయితే డబ్బులు ముఖ్యం కాదు.. ప్రజాసేవ ముఖ్యమని.. రాజకీయం ద్వారా కాదు.. ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవ చేస్తున్నారు. వారెన్ బఫెట్.. సమయం లేదని తన డబ్బును కూడా బిల్ గేట్స్ ఫౌండేషన్‌కు ఇచ్చారు. విప్రో అధినేత కొన్ని వేల కోట్లు చారిటీకి ఇస్తున్నారు.. టాటా ఫౌండేషన్ కూడా సాయం అందిస్తోంది. ప్రభుత్వం సైతం సీఎస్ఆర్ పెట్టింది. ఇలా అందరూ ఖర్చు పెడుతున్నారు.

ఐటీ ఉద్యోగాలు అప్పటి విజన్

25ఏళ్ల కంటే ముందు.. ఐటీకి ప్రాధాన్యం ఇచ్చాను. అది అప్పటి రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా ఎన్నో పనులు చేశాం. పోలవరానికి నిధులొచ్చాయి. 2027కే పూర్తవుతుంది. విశాఖలో రైల్వేజోన్ వచ్చింది. విశాఖ ఉక్కుకు కేంద్రం డబ్బులిస్తోంది. ప్రైవేటీకరణ ఆపి పునరుద్ధరిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచించరు. అలాంటి మిత్రుడితో కలిసి ప్రభుత్వంలో ఉండడం సువర్ణావకాశం. కేంద్రంలో మోదీ రూపంలో సరైన సమయంలో సరైన ప్రధాని ఉండడం మన అదృష్టం. నాకు పనితప్ప వేరే అలవాటేమీ లేదు. ఏంచేస్తే పేదల జీవితాల్లో మార్పొస్తుందా అనే ఆలోచనతో నిద్రలేస్తాను. ఏ తప్పూ చేయలేదు. భవిష్యత్‌లో కూడా చేయను. అందుకే రాత్రి ఆనందంగా నిద్రొస్తుంది.

అంబేడ్కర్‌కు మార్గదర్శి సాయాజీరావు

మనందరి స్ఫూర్తి దాత అంబేడ్కర్. కుటుంబంలో 12వ సంతానం.. తెలివి ఉంది. కానీ అనుకూలమైన వాతావరణం లేదు. అంటరానితనం, అవమానాలు ఎదుర్కొన్నా.. పట్టుదలను మాత్రం వదులుకోలేదు. ఎవరో ఒకరు అండగా ఉండాల్సిన అవసరం పడింది. ఆయన మేధాశక్తి గురించి తెలిసి నాటి బరోడా రాజు సాయాజీరావు మహరాజ్ అండగా నిలిచారు. బాంబేలోని ఒక కళాశాలకు పంపి నెలకు 25 రూపాయలు ఇచ్చారు. తర్వాత ఉన్నత చదువుల కోసం లండన్ పంపి నెలకు 11 డాలర్లు ఇచ్చారు. చదువు పూర్తయ్యాక ఏజీ కార్యాలయంలో ప్రొబేషన్‌గా పెట్టుకున్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజ్యాంగ రూపకర్తగా అంబేడ్కర్‌ను సాయాజీరావు తీర్చిదిద్దారు. పీ-4 మార్గదర్శులు కూడా అలాంటి సాయాలే చేయాలి.

కలాంకు అయ్యర్ బలం

దేశం గర్వించదగిన విశిష్టమైన వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. చిన్నప్పుడు రామేశ్వరంలో ఉండేవారు. అప్పట్లో ముస్లింలు, బ్రాహ్మణులు కలిసి భోజనం చేయకూడదు, కలిసి కూర్చోకూడదు. అలాంటి సమయంలో కలాంను శివసుబ్రహ్మణ్యం అయ్యర్ దగ్గరకు తీశారు. గణితం అధ్యాపకుడిగా సలహాలిచ్చి.. శిష్యుడిగా ఆదరించారు. దాంతో కలాంకు ధైర్యం వచ్చింది. శాస్త్రవేత్తగానే గాక రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. స్వామి వివేకానంద తన జ్ఞానబోధతో ప్రపంచాన్ని మెప్పించారు. ఆయన వెనుక రామకృష్ణ పరమహంస ఉన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ4: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకే పీ4 కార్యక్రమాన్ని చేపట్టామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పీ4 అంటే డబ్బులిచ్చేయడం కాదని... మార్గదర్శనం చేయడమని చెప్పారు. పీ4 కోసం సర్వేలు, గ్రామసభల ద్వారా 30 లక్షల కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కంపెనీలు కనిపిస్తే వాటాలు రాయించుకుందని.. కానీ, తాము మాత్రం పేదలకు అభివృద్ధిలో వాటా కల్పించమని అడుగుతున్నామని చెప్పారు. ఆదివారం సాయంత్రం అమరావతిలో పీ4 కార్యక్రమం ప్రారంభం సందర్భంగా పవన్ మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా లేకపోతే.. పీ4 బయటకి వచ్చేదే కాదన్నారు. ఆయన మా అందరికీ మార్గదర్శకత్వం చేస్తూ.. కష్టా ల్లో ఉన్న రాష్ట్రాన్ని ముందుండి నడిపిస్తున్నారని, అందుకే 2014 నుంచి చంద్రబాబుకి మద్దతిస్తున్నామని తెలిపారు. పీ4ను ప్రభుత్వ కార్యక్రమంగా చేపట్టిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పారు. 'సినిమాల్లో రెండున్నర గంటల్లోనే సమస్యలన్నీ తీరిపోతాయి. కానీ నిజజీవితంలో అలా కాదు. చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నేత కావాలి. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించేందుకు పీ4 పథకం ఉపయోగపడుతుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో వికసిత్ భారత్ కోసం ముందుకు సాగుతుండగా.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటోంది' అన్నారు.

'స్త్రీ' మూలంగా జగన్‌కు ఇబ్బందులు

» ఆరోగ్య సమస్యలు తగ్గి.. అధికారంలోకొస్తారు.. సిద్ధాంతి నారాయణమూర్తి 'పంచాంగం'

» వైసీపీ కేంద్ర కార్యాలయంలో 'ఉగాది'.. బెంగళూరులోనే జగన్.. బోసిపోయిన వేడుక

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ ఓ 'స్త్రీ' మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని ప్రముఖ సిద్ధాంతి నారాయణ మూర్తి చెప్పారు. విశ్వావసునామ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి నారాయణమూర్తి నూతన పంచాంగాన్ని చదివి వినిపించారు. జగన్ జన్మ నక్షత్రం, మిధునరాశితో సిద్ధాంతి నారాయణమూర్తి పంచాంగ పఠనం ప్రారంభించారు. ఈ ఏడాది ఓ స్త్రీతో జగన్‌కు సమస్యలు ఎదురవుతాయని వెల్లడించారు. కుటుంబంలోని స్త్రీల వల్లే చిక్కులు ఎదురుకానున్నాయని తెలిపారు. అయితే.. ఆ 'స్త్రీ' ఎవరనేది సిద్ధాంతి వెల్లడించలేదు. కాగా.. తమ నాయకుడు జగన్ ముఖ్యమంత్రి అవుతారని సిద్ధాంతి చెప్పడం గమనార్హం. పంచాంగ పఠనంలో రాజకీయ అంశాలను కూడా నారాయణ మూర్తి స్పృశించారు. జగన్‌ను ఓడించినందుకు ప్రజలు ఇప్పుడు తప్పుచేశామా అని బాధపడుతున్నారని పేర్కొన్నారు. నాయకుడిగా జగన్ డబ్బును కోల్పోయి, మాటలు అనిపించుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది రాజకీయంగా పూర్వవైభవాన్ని దక్కించుకుంటారని తెలిపారు. ఆరోగ్యరీత్యా జగన్ ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తోందని, ఈ సంవత్సరం ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. కుటుంబ రీత్యా ఇబ్బందులు కూడా తొలగిపోతాయని తెలిపారు. జగన్ బంధువుల్లోని స్త్రీల వల్ల ఆయనకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దానిని తట్టుకునే నేర్పరితనం జగన్‌కు రావాలని సిద్ధాంతి పేర్కొన్నారు. జగన్ మేక కాదని సింహమని తెలిపారు. కాగా.. అధికారంలో ఉన్నప్పుడు అట్టహాసంగా నిర్వహించిన ఉగాది వేడుకలు.. ఈ ఏడాది బోసిపోయాయి. వైసీపీ అధినేత జగన్.. బెంగళూరుకే పరిమితం కావడంతో కీలక నేతలు సైతం డుమ్మాకొట్టారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ నాయకుల నుంచి కూడా పెద్దగా స్పందన కనిపించలేదు. అదేసమయంలో ఒకరిద్దరు నాయకులు.. సిద్ధాంతి నారాయణమూర్తి చెప్పింది విని అతిశయోక్తులు పలికారని పెదవి విరిచారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలు ముగించి ఈదుల్ ఫితర్ వేడుకకు సన్నద్ధమవుతున్న ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం ఇదని గుర్తుచేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.